


GST NO: 36ACPPF9587L2ZM TELTEL/2013/53323

# సమయుజ్యోతి

ప్రతీ అక్షరం - ప్రజలకోసం

తెలుగు దిన పత్రిక

CELEBRATING 12TH YEAR ANNIVERSARY

సంపుటి : 12 సంచిక : 181 పేజీలు : 12 ఆదిలాబాద్ వెల రూ : 01 శనివారం 04 అక్టోబర్ 2025 ఎడిటర్ : ఫైసల్ ఖాన్




# పటిష్టంగా భారత్ ఆర్థిక వ్యవస్థ





**న్యూఢిల్లీ,అక్టోబర్ 3( సమయజ్యోతి):**

ప్రపంచ ఆర్థిక వ్యవస్థ నిర్మాణాత్మక మార్పును చూస్తోందని ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ పేర్కొన్నారు. హఠాత్తుగా వచ్చిపడే షాక్‌లను స్వీకరిస్తున్న భారత సామర్థ్యం బలంగా ఉందన్నారు. ఎలాంటి ఒడిదుడుకులనైనా ఎదుర్కొనే సత్తా మనకు ఉందన్నారు. శుక్రవారం ఢిల్లీలో కౌటిల్య ఎకనామిక్ కాన్‌క్లేవ్ 2025లో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆర్థిక, ఇంధన అసమతుల్యతను ఎదుర్కోవడం కూడా దేశాల ముందున్న కర్తవ్యం అని పేర్కొన్నారు. 'భౌగోళిక రాజకీయ సంఘర్షణలు తీవ్రమవుతున్నాయి. ఆంక్షలు, సుంకాలు, విభేదాలు ప్రపంచ సరఫరా గొలుసులను దెబ్బ తీస్తున్నాయి. ఇవి భారత్‌కు కూడా దెబ్బే. కానీ, వీటన్నింటినీ బలంగా ఎదుర్కొనే సామర్థ్యం మనకు ఉందని నిర్మల అన్నారు. మన ఆర్థిక పరపతి కూడా అభివృద్ధి చెందుతోంది. యుద్ధాలు, వ్యూహాత్మక పోటీలు, సంఘర్షణ సరిహద్దులను తిరిగి రాస్తున్నాయి. గతంలో బలమైన సంబంధాలు పరీక్షలు ఎదుర్కొంటున్నాయి, కొత్త సంకీర్ణాలు ఉద్భవిస్తున్నాయి. అయితే, మనం ఎదుర్కొంటున్నది తాత్కాలిక అంతరాయం మాత్రమే కాదు.. నిర్మాణాత్మక మార్పులు' అని ఆమె అన్నారు. భారత ఆర్థిక వ్యవస్థ నిలకడగా ఉందని, స్థిరంగా వృద్ధి చెందుతూనే ఉందని నిర్మలా సీతారామన్ తెలిపారు. యాదృచ్ఛికంగా భారత్ ఈ స్థాయికి రాలేదని, అనేక శక్తిమంతమైన సంస్కరణల ద్వారా వచ్చిందన్నారు. ఇందుకు అనేక విధాలుగా కసరత్తు చేసిందన్నారు. భారత్ ఆర్థిక పురోగతి కారణంగానే గట్టిగా నిలబడగలుగుతోందన్నారు.

## ఎలాంటి ఒడిదుడుకులనైనా ఎదుర్కొనే సత్తా

## -కేంద్ర ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్

# కొండారెడ్డిపల్లి దసరా వేడుకల్లో సిఎం రేవంత్

## స్వాగతం పలికిన నేతలు... జమ్మి పూజలో పాల్గొన్న సిఎం

**నాగర్ కర్నూల్,అక్టోబర్ 3( సమయజ్యోతి):**




దసరా ఉత్సవాలను సీఎం రేవంత్ రెడ్డి తన స్వగ్రామం కొండారెడ్డిపల్లిలో గురువారం ఘనంగా జరుపుకున్నారు. నాగర్ కర్నూలు జిల్లా వంగూర్ మండలం కొండారెడ్డపల్లికి హెలికాప్టర్‌లో కుటుంబ సభ్యులతో కలిసి ఆయన చేరుకున్నారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డికి నియోజకవర్గ ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణతోపాటు గ్రామస్తులు గజమాలతో స్వాగతం పలికి.. ఆయనపై పూల వర్షం కురిపించారు. అనంతరం ఆ గ్రామంలోని శ్రీ ఆంజనేయస్వామి దేవాలయంలో స్వామివారిని దర్శించుకుని సీఎం రేవంత్ రెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

# విదేశీ విద్యార్థులపై ట్రంప్ కొరడా

## విదేశీ విద్యార్థులపై ట్రంప్ కొరడా

## యూనివర్సిటీలకు

## హుకూం జారీచేసిన వైట్‌హౌజ్

**వాషింగ్టన్,అక్టోబర్2 ( సమయజ్యోతి):**



అమెరికా అధ్యక్షుడు ట్రంప్ మరో హుకూం జారీచేశారు. విదేశీ విద్యార్థుల రాకపై ఆంక్షలు లాంటి కత్తి పెట్టారు. పరిమిత సంఖ్యలోనే వారిని అనుమతించాలని యూనివర్సీటీలను ఆదేశించారు. అమెరికా ప్రభుత్వ నిధులు కావాలంటే విదేశీ విద్యార్థుల అడ్మిషన్లను పరిమితం చేయాలని వైట్ హౌజ్ విశ్వవిద్యాలయాలకు తేల్చిచెప్పింది. ఈమేరకు ప్రతిపాదించిన నిబంధనలను మెమో రూపంలో దేశంలోని ప్రధాన యూనివర్శిటీలకు పంపింది. ప్రభుత్వ నిధులు కావాలంటే విదేశీ విద్యార్థుల సంఖ్యపై పరిమితి, జాతి, లింగ ఆధారిత నియామకాలు నిలిపివేయడం, విద్యార్థుల



# భారత్‌లో ప్రజాస్వామ్య వ్యవస్థపై దాడి

## కొలింబియా పర్యటనలో రాహుల్ వ్యాఖ్యలు

**న్యూఢిల్లీ,అక్టోబర్2( సమయజ్యోతి):**

నరేంద్ర మోడీ పాలనలోని భారత్‌లో ప్రజాస్వామ్య దాడులు జరుగుతున్నా యంటూ లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ విమర్శించారు. దేశానికి అత్యంత ప్రమాదకరమైనది ఏదైనా ఉందంటే అది దేశంలో ప్రజాస్వామ్యంపై జరుగుతున్న దాడేనంటూ మండిపడ్డారు. కొలంబియా పర్యటనలో ఉన్న ఆయన ఈఐఏ యూనివర్సిటీలో ఇంజినీరింగ్ విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. భారత్‌లో ఎన్నో మతాలు, కులాలు, సంప్రదాయాలు ఉన్నాయి. ప్రజాస్వామ్య వ్యవస్థ ప్రతిఒక్కరికీ చోటుకల్పిస్తుంది. కానీ ప్రస్తుతం ఈ వ్యవస్థ ముప్పేటదాడిని ఎదుర్కొంటోందన్నారు. విద్యార్థులతో మాట్లాడుతూ.. ఇంధన వినియోగంలో వచ్చిన మార్పులతో అనేక సామ్రాజ్యాల సృష్టి జరుగుతూవస్తోంది. బ్రిటిష్‌వారు ఆవిరి యంత్రం, బొగ్గుపై నియంత్రణ సాధించారు. తర్వాత వారు సూపర్‌పవర్‌గా మారారు. ఆ సామ్రాజ్యానికి వ్యతిరేకంగా



# రష్యా వాణిజ్య మిత్రులపై ట్రంప్ పెత్తనం


## భారత్ తమకు మంచి మిత్రదేశమన్న పుతిన్

### అమెరికా ఒత్తిళ్లకు తలొగ్గదద్దని హితవు

**మాస్కో,అక్టోబర్ 3( సమయజ్యోతి):**

రష్యా నుంచి చమురు కొనుగోలు చేస్తున్నందున భారత్‌పై ట్రంప్ భారీ సుంకాలతో విరుచుకుపడిన సంగతి తెలిసిందే. దీనిపై రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ స్పందిస్తూ ట్రంప్ విధానాలను తీవ్రంగా ఖండించారు. బయటి దేశాల ఒత్తిడికి భారత్ తలొగ్గకూడదని చెప్పారు. గురువారం దక్షిణ సోచిలోని మీడియాతో పుతిన్ మాట్లాడారు. మాస్కోతో ఇంధన వాణిజ్యాన్ని తగ్గించుకోవాలని ఇతర దేశాలపై ట్రంప్ చేస్తున్న ఒత్తిడిని పుతిన్ తప్పుబట్టారు. ఈ చర్య వల్ల వాషింగ్టన్‌కే ఎదురుదెబ్బ తగులు తుందని హెచ్చరించారు. రష్యా వాణిజ్య భాగస్వాములపై అధిక సుంకాలు విధిస్తే.. అది ప్రపంచంలోని

మిగతా 2 లో




# తెలంగాణలో ఆర్థిక విధ్వంసం

## జిఎస్టీ వసూళ్లే ఇందుకు నిదర్శనం

## కాంగ్రెస్ పాలనపై కెటిఆర్ విమర్శలు

# ఇక వెంటనే చెక్ క్లీయరెన్స్

## ఆర్‌బిఐ సూచనలతో బ్యాంకుల అమలు

## నేటి నుంచే అమల్లోకి కొత్త విధానం

**ముంబై,అక్టోబర్ 3( సమయజ్యోతి):**

చెక్కు వినియోగదారుకలు ఆర్‌బిఐ శుభవార్త చెప్పింది. సాంకేతికత అందుబాటులోకి వచ్చాక బ్యాంకింగ్ వ్యవస్థలో ఎన్నో మార్పులొచ్చాయి. ఈ క్రమంలో చెక్‌ల క్లీయరెన్స్‌ను కూడా గంటల్లో పరిష్కరించే వ్యవస్థ అందుబాటులోకి వచ్చింది. శనివారం నుంచి ఇక చెక్ క్లీయరెన్సులు వెంటలనే అమలవుతాయి. ఏదైనా చెక్కు క్లియర్ అవ్వాలంటే ప్రస్తుతం రెండ్రోజుల సమయం పడుతోంది. ఇకపై ఈ సమయం గణనీయంగా తగ్గనుంది. అక్టోబర్ 4 నుంచి కొన్ని గంటల్లోనే చెక్కు క్లియర్ కానుంది. ఆర్‌బీఐ ఆదేశాల మేరకు బ్యాంకులు

మిగతా 2 లో

# కౌకుంట్లలో ముగిసిన దుర్గాదేవి నవరాత్రి ఉత్సవాలు

-సాంప్రదాయ రీతిలో హోమాలు, పూజలు

-ప్రతిరోజు వివిధ అలంకరణలో దర్శనమిచ్చిన అమ్మవారు

-కృష్ణా నదిలో దుర్గామాత నిమజ్జనం

**దేవరకద్ర, సమయజ్యోతి అక్టోబర్ 3**

మహబూబ్ నగర్ జిల్లా దేవరకద్ర నియోజకవర్గం లోని కౌకుంట్ల మండల కేంద్రంలో గురువారం దుర్గామాత నవరాత్రి ఉత్సవాలు వైభవంగా ముగిశాయి. ఈ సందర్భంగా దాదాపు 11 రోజులపాటు దుర్గామాత అమ్మవారిని మండల కేంద్రం వాసులు భక్తిశ్రద్ధలతో దుర్గామాతను కొలిచారు. విశేష దినోత్సవాల సందర్భంగా ప్రతిరోజు వివిధ అలంకరణలో దుర్గా మాత అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా దుర్గామాత మండపాన్ని సర్వాంగ సుందరంగా అలంకరించి ఈ వేడుకలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ప్రతిరోజు అమ్మవారి సన్నిధిలో గణపతి పూజ, దుర్గాదేవి పూజ, నవగ్రహ పూజ, గణపతి హోమం, నవగ్రహ హోమం, శ్రీదేవి హోమం, తదితర హోమాలతో పాటు వివిధ పూజా కార్యక్రమాలను నిర్వహించారు. అలాగే ప్రతిరోజు సాయంత్రం అమ్మవారి సన్నిధిలో కుంకుమార్చన మరియు విశేష మహా మంగళహారతి పూజా కార్యక్రమాలను కూడా నిర్వహించారు. అలాగే భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని కూడా నిర్వహించారు. దుర్గామాత నవరాత్రి ఉత్సవాల ముగింపు సందర్భంగా అమ్మవారిని గ్రామపురవీధుల గుండా సన్నాయి వాయిద్యాలు, ఆజా భజంత్రీలు, భక్తుల హరినామశ్చరణ, మహిళల బొడ్డెమ్మలు, యువకుల కోలాటాల మధ్య బతుకమ్మ పాటలు పాడుతూ దుర్గామాత అమ్మవారి ఊరేగింపు కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం కృష్ణా నది తీరంలోకి తీసుకెళ్లి దుర్గామాత అమ్మవారిని నిమజ్జనం చేశారు. ఈ కార్యక్రమంలో అర్చకుడు గోపన్ పల్లి మఠం సురేష్ స్వామి, రాచాల చంద్రశేఖర స్వామిల ఆధ్వరంలో ఈ పూజలు నిర్వహించారు. అలాగే పురోహితులను గ్రామస్తులు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో దుర్గామాత మండప కమిటీ సభ్యులు, మహిళలు, యువకులు, గ్రామ పెద్దలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.







# మోత్కూర్ గ్రామంలో ఘనంగా దసరా ఉత్సవాలు.....

**దోమ, సమయజ్యోతి ప్రతినిధి, అక్టోబర్ 2, 2025,**

దోమ మండలం మోత్కూర్ గ్రామంలో విజయదశమి పండుగను గ్రామస్థులు ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా సంప్రదాయానుసారం జమ్మి చెట్టుకు శమీ పూజ నిర్వహించి, ఒకరికి ఒకరు విజయదశమి శుభాకాంక్షలు తెలుపుకున్నారు.విజయదశమి పండుగ శుభకార్యాల ఆరంభానికి, సత్కార్యాల సాధనకు ప్రతీక అని, చెడుపై మేలుని సూచించే ఈ పండుగను గ్రామస్థులంతా ఐక్యంగా జరుపుకోవాలని పెద్దలు పిలుపునిచ్చారు. గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని ఆనందోత్సాహాలతో ఈ వేడుకను విజయవంతం చేశారు.....



# మహాత్మా గాంధీ జయంతికి డుమ్మా కొట్టిన పంచాయతీ సెక్రటరీ..

**దౌల్తాబాద్, సమయజ్యోతి ప్రతినిధి, అక్టోబర్, 2, 2025,**

దౌలతాబాద్ మండలం గోకాపసల్వాద్ గ్రామంలో పంచాయతీ సెక్రటరీ మహాత్మా గాంధీ జయంతి వేడుకలకు హాజరు కాకపోవడం గ్రామస్థుల్లో తీవ్ర ఆగ్రహానికి దారితీసింది. గ్రామ పాలన చూసుకోవాల్సిన సెక్రటరీ ఆనవాయితీ ప్రకారం నిర్వహించాల్సిన జయంతి కార్యక్రమానికి దూరంగా ఉండటంతో, గ్రామ పెద్దలు మరియు యువకులు కలెక్టర్‌కు ఫిర్యాదు చేయాలని నిర్ణయించారు.సెక్రటరీ సొంత పనుల కోసం పారిశుద్ధ్య కార్మికులను వినియోగిస్తూ, వారికి జయంతి నిర్వహణ బాధ్యతలను అప్పగించడం పట్ల గ్రామస్థులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు.అయితే, ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ, బీజేపీ నాయకులు, టీఆర్ఎస్ పార్టీ నాయకులు కలసి పాల్గొని గాంధీ జయంతిని విజయవంతం చేశారు. మహాత్మా గాంధీ ఆశయాలను అందరూ ఆచరణలో పెట్టాలని, గ్రామం అభివృద్ధి కోసం కలిసికట్టుగా పనిచేయాలని పిలుపునిచ్చారు....



# అందరం కలసి ఉండాలన్నదే అలయ్ బలయ్

-కులమతాలతో విడదీసి పబ్బం గడుపుకోవాలనుకుంటే కుదరదు-ఎక్కడో ఏదో జరిగిందని ..ఇక్కడా జరుగుతుందటే పొరపాటు

-భిన్నత్వంలో ఏకత్వం మన బలం అన్న వెంకయ్య -దత్తాత్రేయ, బండారు విజయలక్ష్మిలకు అభినందన

**హైదరాబాద్,అక్టోబర్ 3( సమయజ్యోతి):**

వేషభాషలు వేరయినా అందరం భారతీయులమనే భావనతో కలిసి ముందుకెళ్తున్నామని మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు అన్నారు. హరియాణా మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ కుమార్తె విజయలక్ష్మి ఆధ్వర్యంలో నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లో నిర్వహించిన 'అలయ్ బలయ్' కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రముఖులను దత్తాత్రేయ సత్కరించారు. అనంతరం పలువురు ప్రముఖులు మాట్లాడారు. తొలుత వెంకయ్యనాయుడు మాట్లాడుతూ అందరం కలిసి ఉండాలనేది అలయ్ బలయ్ ఉద్దేశమన్నారు. 20 ఏళ్లుగా బండారు దత్తాత్రేయ ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారని కొనియాడారు. కొందరు కులం, మతం, వర్ణం, వర్గం, జాతి పేరుతో ప్రజల్ని చీల్చే ప్రయత్నం చేస్తున్నారన్నారు. మన దేశంలో అలాంటి ఆశలు పెట్టుకున్నవారు నిరాశ చెందక తప్పదని చెప్పారు. చిన్నచిన్న విభేదాలు వచ్చినా భారతీయులం అనే భావనతో అందరూ కలిసి వెళ్తుంటారన్నారు. ఈ కార్యక్రమంతో ఐక్యతా సందేశాన్ని అందించడం ముదావహమని పేర్కొంటూ దత్తాత్రేయ, విజయలక్ష్మిలకు వెంకయ్యనాయుడు అభినందనలు తెలిపారు. ఇలాంటి కార్యక్రమాలతో మన సంస్కృతి, సంప్రదాయాలు ప్రజలకు తెలుస్తాయని సుప్రీంకోర్టు విశ్రాంత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎన్వీ రమణ అన్నారు. అందర్నీ ఒక్కచోట చేర్చి ఐక్యత తెచ్చేందుకు ఉపయోగపడుతుందన్నారు. సంప్రదాయాలకు అనుగుణంగా అలయ్ బలయ్ నిర్వహిస్తున్న దత్తాత్రేయ, విజయలక్ష్మిలకు ఆయన అభినందనలు తెలిపారు. మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ దత్తాత్రేయ అజాత శత్రువని అన్నారు. ప్రతి ఒక్కరూ ఆయన్ను ప్రేమిస్తారని.. అందుకే పార్టీలకు అతీతంగా పెద్ద ఎత్తున ఇక్కడికి వచ్చారని చెప్పారు. ప్రముఖ సినీనటుడు నాగార్జున మాట్లాడుతూ ఇలాంటి సత్కారం తనకు మొదటిసారి అని.. చాలా కొత్తగా ఉందని చెప్పారు. దత్తాత్రేయకు ఈ సందర్భంగా ఆయన ధన్యవాదాలు తెలిపారు. మనమంతా కలసి ఉన్నామని చెప్పడంతో పాటు ఒకరికి ఒకరమన్న ధైర్యం కల్పించిందన్నారు. 2005 నుంచి ఇప్పటి వరకు 20 ఏళ్లుగా ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నారని చెప్పారు. రాజకీయాలకు అతీతంగా జరుగుతున్న ఈ కార్యక్రమం తమకెంతో కాన్ఫిడెన్స్ ఇస్తుందన్నారు. దత్తాత్రేయతో తనకు ఎప్పటినుంచో పరిచయం ఉందని.. దీనికి ఆహ్వానించడం ఎంతో ఆనందంగా ఉందని నాగార్జున చెప్పారు. ప్రముఖ హాస్య నటుడు బ్రహ్మానందం మాట్లాడుతూ అలయ్ బలయ్ అంటే హృదయపూర్వకంగా ఒకరినొకరు ఆలింగనం చేసుకుని ప్రేమను పంచుకోవడమని చెప్పారు. శాంతి, ప్రేమ కరవైపోతున్న ప్రస్తుత పరిస్థితుల్లో ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించి పరస్పరం గౌరవించుకోవడం అవసరమన్నారు. శ్రీరాముడి కాలం నుంచి నేటి వరకు ఇది కొనసాగుతోందన్నారు.

# రష్యా వాణిజ్య మిత్రులపై ట్రంప్ పెత్తనం

భారత్ తమకు మంచి మిత్రదేశమన్న పుతిన్

అమెరికా ఒత్తిళ్లకు తలొగ్గదద్దని హితవు

మొదటిపేజీ తరువాయి

ఇంధన ధరలపై ప్రభావం పడుతుందన్నారు. యూఎస్ ఫెడరల్ రిజర్వ్ వడ్డీ రేట్లను ఎక్కువగా పెంచేలా చేస్తుందని.. దాంతో అగ్రరాజ్య ఆర్థిక వ్యవస్థ నెమ్మదిస్తుందని హెచ్చరించారు. ఈసందర్భంగా డిసెంబరులో భారత్ లో పర్యటించనున్న విషయాన్ని పుతిన్ వెల్లడించారు. ప్రధాని మోదీతో తనకు మంచి స్నేహబంధం ఉందని చెప్పారు. ఇక, అమెరికా విధించిన శిక్షాత్మక సుంకాల నేపథ్యంలో భారత్ ఎదుర్కొంటున్న నష్టాలను రష్యా నుంచి ముడిచమురు దిగుమతులు సమతుల్యం చేస్తాయన్నారు. వాణిజ్య ఇబ్బందులను తొలగించేందుకు తాము చర్యలు తీసుకోనున్నట్లు వెల్లడించారు. భారత్‌తో ఏఐ భాగస్వామ్యానికి మద్దతిస్తున్నట్లు తెలిపారు. ఆ దేశం నుంచి మరిన్ని వ్యవసాయ, ఔషధ ఉత్పత్తులు కొనుగోలు చేస్తామన్నారు. ఈసందర్భంగా అమెరికన్ మార్కెట్‌కు తాము పెద్ద మొత్తంలో యురేనియంను సరఫరా చేస్తున్నట్లు తెలిపారు. ఉక్రెయిన్‌పై యుద్ధం చేస్తున్న రష్యాను ఓ పేపర్ టైగర్ అంటూ ట్రంప్ చేసిన వ్యాఖ్యలపై కూడా పుతిన్ స్పందించారు. 'యూరప్‌లో పెరుగుతున్న రక్షణాత్మక చర్యలను తాము నిశితంగా గమనిస్తున్నామన్నారు. రష్యా ఉక్రెయిన్‌తోనే కాకుండా మొత్తం నాటో కూటమితోనే యుద్ధం చేస్తోందన్నారు. అయినా తమను కొందరు కాగితపు పులిగా పేర్కొంటున్నారు. మరి నాటో ఏంటని ట్రంప్‌నకు కౌంటర్ ఇచ్చారు.

# ట్రంప్ కొరడా

మొదటిపేజీ తరువాయి

అడ్మిషన్ సమయంలో కచ్చితంగా ప్రామాణిక పరీక్ష నిర్వహించడం వంటివి చేపడితేనే ప్రభుత్వ నిధుల కేటాయింపులో ప్రాధాన్యం లభిస్తుందని వెల్లడించింది. ఈ నిబంధనలను అంగీకరించిన విశ్వవిద్యాలయాలు ప్రభుత్వం నుంచి వచ్చే లబ్ధిని పొందవచ్చని ఆ లేఖలో వెల్లడించారు. వీటిల్లో విద్యార్థులకు ప్రభుత్వ రుణాలు, గ్రాంట్లు, కాంట్రాక్టులు, రీసెర్చి నిధులు, విదేశీ స్కాలర్స్‌కు వీసా అనుమతులు, ట్యాక్స్ కోడ్‌లో ప్రాధాన్యం వంటివి పొందవచ్చని పేర్కొంది. అమెరికాలో ఉన్నతవిద్యను పునర్ వ్యవస్థీకరించి తమ భావజాలానికి అనుకూలం గా మార్చుకోవడానికి ట్రంప్ కార్యవర్గం చేస్తున్న మరో యత్నంగా దీనిని భావిస్తున్నారు. హార్వర్డ్ విశ్వవిద్యాలయం ప్రభుత్వంతో 500 మిలియన్ డాలర్ల డీల్ చాలా దగ్గరగా ఉందని పేర్కొన్నారు. వైట్‌హౌస్ నుంచి లేఖలు అందుకొన్న వాటిలో అమెరికాలోని ఎంఐటీ సహా ప్రముఖ విశ్వవిద్యాలయాలు మొత్తం ఉన్నాయి. ఈ క్రమంలో విదేశీ వీసాలపై వచ్చే విద్యార్థుల సంఖ్య 15 శాతానికి మించి ఉండకూడదు. ఒకే దేశం నుంచి వచ్చిన విద్యార్థుల సంఖ్య 5 శాతానికి మించకూడదు. విదేశాల నుంచి అందే నిధుల వివరాలను బహిర్గతం చేయాలి. విద్యార్థుల అడ్మిషన్, ÷నాన్షియల్ ఎయిడ్ సమయంలో లింగ, జాతి, జాతీయత, రాజకీయ భావజాలం, జెండర్ ఐడెంటిటీ, లైంగిక ఆకర్షణ, మతపరమైన అంశాలు పరిగణనలోకి తీసుకోకూడదు.అండర్ గ్రాడ్యుయేట్ దరఖాస్తుదారులు కచ్చితంగా ప్రామాణిక పరీక్షను పూర్తిచేయాల్సిందే. విద్యా స్వేచ్ఛను కాపాడే విధానాలు అమలుచేయాలి. సంప్రదాయవాద ఆలోచన సరళిని ఇబ్బందిపెట్టే, దాడులకు పాల్పడే యూనిట్స్‌ను తొలగించడం వంటివి ఉన్నాయి. విద్యాలయాలను ఇబ్బందిపెట్టేలా రాజకీయ ప్రదర్శనలు, విద్యార్థులను లేదా గ్రూపులను వేధించకుండా చర్యలు చేపట్టాలి. ఉద్యోగులు అధికారిక విధుల సమయంలో రాజకీయ ప్రసంగాలు, చర్యలకు దూరంగా ఉండాలి. బాత్‌రూమ్‌లు, లాకర్ రూమ్‌లు లింగ ఆధారంగా వేర్వేరుగా ఉండాలి. హార్డ్‌సైన్స్ విద్యను అభ్యసించే విద్యార్థులకు ఉచిత ట్యూషన్ ఫీజ్, ప్రోత్సాహకం కింద 2 మిలియన్ డాలర్లు మించి ఇవ్వాలని ప్రతిపాదించారు.ఈ నిబంధనలు ఏమేరకు అమలుచేస్తున్నారనే అంశాన్ని జస్టిస్ డిపార్ట్‌మెంట్ ప్రిన్సిపల్స్‌ను సమీక్షించి తెలుసుకొంటుంది. వీటిని ఉల్లంఘిస్తే ప్రభుత్వ లబ్ధిని రెండేళ్లపాటు ఆపేస్తారు.

# ఇక వెంటనే చెక్ క్లియరెన్స్

ఆర్‌బిఐ సూచనలతో బ్యాంకుల అమలు

నేటి నుంచే అమల్లోకి కొత్త విధానం

మొదటిపేజీ తరువాయి

శనివారం నుంచి దీన్ని అమలు చేయనున్నాయి. చెక్కులు క్లియర్ చేయడానికి అయ్యే సమయాన్ని గంటల వ్యవధిలోకి తగ్గించేందుకు ఆర్‌బీఐ కంటిన్యూస్ క్లియరింగ్ వ్యవస్థను తీసుకొచ్చింది. దీంతో చెక్కు సమర్పించిన గంటల వ్యవధిలోనే క్లియర్ అవుతుంది. ఈ విధానంలో వ్యాపార వేళల్లో చెక్కుల స్కానింగ్, సమర్పణ, క్లియరింగ్ అనేవి నిరంతరాయంగా సాగుతాయి. ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 4 వరకు చెక్కులు సమర్పించవచ్చు. సాయంత్రం 7 గంటల్లోపు క్లియర్ అవుతాయి. అంటే చెక్కు ఉదయం డిపాజిట్ చేస్తే అదే రోజు సాయంత్రానికల్లా నగదు మీ బ్యాంకు ఖాతాలో జమ అయిపోతుంది. సంబంధిత చెక్కును ఆమోదించడమో, తిరస్కరించడమో ఏదైనా సరే సాయంత్రం ఏడుకల్లా జరిగిపోవాలని బ్యాంకులను ఆర్‌బీఐ ఆదేశించింది. మొత్తం రెండు దశల్లో ఈ వ్యవస్థ అందుబాటులోకి రానుంది. ఫేజ్-1లో భాగంగా సాయంత్రం 7 గంటల్లోపు గడువు నిర్దేశిరచగా.. ఫేజ్-2లో కేవలం మూడు గంటల్లోనే చెక్కు క్లియర్ చేయాల్సి ఉంటుంది. 2026 జనవరి 3 నుంచి రెండో దశ ప్రారంభమవుతుంది. అంటే బ్యాంకు పనివేళల్లో ఎప్పుడు చెక్కు సమర్పించినా మూడు గంటల వ్యవధిలోనే బ్యాంకు ఖాతాలో నగదు జమవుతుంది. అంటే ఉదయం 10 గంటలకు చెక్కు సమర్పిస్తే మధ్యాహ్నం ఒంటిగంటకల్లా దాన్ని బ్యాంకులు క్లియర్ చేయాల్సి ఉంటుందన్నమాట. దీనికోసం మునుపటిలా రోజులతరబడి వేచి చూడాల్సిన అవసరం తప్పుతుంది.

# భారత్‌లో ప్రజాస్వామ్య వ్యవస్థపై దాడి

కొలింబియా పర్యటనలో రాహుల్ వ్యాఖ్యలు

మొదటిపేజీ తరువాయి

పోరాడి 1947లో మేం స్వాతంత్ర్యం సాధించుకున్నాం. పెట్రోల్ వినియోగం పెరిగింది. ఆ క్రమంలో అమెరికన్ల పట్టుపెరిగింది. ప్రపంచం ఇప్పుడు ఎలక్ట్రిక్ మోటార్ వైపు మళు ్లతోంది. ఇప్పుడు పోటీ అమెరికా, చైనా మధ్య నెలకొని ఉంది. ఈ విషయంలో చైనానే ముందుంది. చైనాకు భారత్ పొరుగుదేశం. అమెరికాకు మిత్రదేశం. ఈ రెండు దేశాలు పోటీపడుతుంటే మధ్యలో మేం ఉన్నాం. చైనాకంటే భారత్ జనాభా ఎక్కువ. ఆ దేశంలో కేంద్రీకృత వ్యవస్థ ఉంది. ఇండియాలో వికేంద్రీకృత, వైవిధ్య వ్యవస్థ ఉంది. అది సంక్లిష్టంగా ఉంటుంది. చైనాతో పోల్చుకుంటే భారత్‌కున్న సామర్థ్యాలు భిన్నమైనవి. మా దేశం అధ్యాత్మిక, సైద్ధాంతిక సంప్రదాయాలను కలిగిఉంది. అవి ఈనాటికీ ఆచరణీయమైనవి. చైనాలాగా భారత్ తన ప్రజలను అణచి వేయదని రాహుల్ వ్యాఖ్యలు చేశారు.భారత్‌లో ఆర్థిక వృద్ధి ఉంది. అయితే మాది సేవల ఆధారిత ఆర్థిక వ్యవస్థ. కానీ ఉత్పత్తి భారీ స్థాయిలో లేకపోవడంతో ఉద్యోగాల కల్పన ఆశించినస్థాయిలో లేదు. చైనా అప్రజాస్వామిక వాతావరణంలో ఉత్పత్తి చేస్తోంది. కానీ మాకు ప్రజాస్వామ్య వ్యవస్థే ఉండాలి. అలాంటి వ్యవస్థను అభివృద్ధి చేయడమే సవాలని పేర్కొన్నారు.

# తెలంగాణలో ఆర్థిక విధ్వంసం

జిఎస్టీ వసూళ్లే ఇందుకు నిదర్శనం

కాంగ్రెస్ పాలనపై కెటిఆర్ విమర్శలు

మొదటిపేజీ తరువాయి

**హైదరాబాద్,అక్టోబర్ 3( సమయజ్యోతి):**

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ పాలనలో తెలంగాణ ఆర్థిక వ్యవస్థ సంపూర్ణ విధ్వంసానికి గురైందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్ర స్థాయిలో విమర్శించారు. తాజాగా, సెప్టెంబర్ నెలలో వస్తు, సేవల పన్ను (జీఎస్టీ) వసూళ్ల వృద్ధి రేటులో తెలంగాణ దేశంలోనే అట్టడుగున ఉండటం దారుణమని కేటీఆర్ అన్నారు. తెలంగాణ ఆర్థిక విధ్వంసానికి సంబంధించిన మరో స్పష్టమైన సూచిక ఇదేనని ఆయన పేర్కొన్నారు. సరిగ్గా రెండేళ్ల క్రితం, కేసీఆర్ సమర్థ పాలనలో తెలంగాణ రాష్ట్రం దేశంలోనే నెంబర్ వన్ స్థానంలో నిలిచిందని ఆయన గుర్తు చేశారు. జీఎస్టీ వృద్ధిలో ఈ పతనం, రేవంత్ రెడ్డి పరిపాలనలో రాష్ట్ర ఆర్థికవ్యవస్థ ఎంత విధ్వంసం పాలయ్యిందో చెప్పే ఒక నిదర్శనమని కేటీఆర్ ధ్వజమెత్తారు. గత బీఆర్ఎస్ హయాంలో వ్యవసాయం నుండి ఐటీ వరకూ అన్ని రంగాలకు రాష్ట్ర ప్రభుత్వం గట్టి దన్ను ఇవ్వడంతో ఆర్థికవ్యవస్థ పరుగులు తీసి, రికార్డులు తిరగరాసిందని కేటీఆర్ తెలిపారు. కానీ, నేడు కాంగ్రెస్ పాలనలో, పండుగ వచ్చినా, పబ్బం వచ్చినా కూడా అన్ని రంగాలూ నేలచూపులే చూస్తున్నాయని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. వ్యవసాయం నుండి రియల్ ఎస్టేట్ వరకూ అన్ని రంగాల్లోనూ దైన్యమే తాండవిస్తోందని మండిపడ్డారు. అరాచకత్వం, అవినీతి, అనుభవలేమి కలగలసిన రేవంత్ పాలనలో తెలంగాణ ఆర్థిక విధ్వంసానికి గురవుతోంది. కాంగ్రెస్ ప్రభుత్వం ఈ విధ్వంసాన్ని వెంటనే ఆపడానికి చర్యలు తీసుకోవాలని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ డిమాండ్ చేశారు.

మొదటిపేజీ తరువాయి

# కొండారెడ్డిపల్లి దసరా వేడుకల్లో సిఎం రేవంత్

స్వాగతం పలికిన నేతలు...జమ్మి పూజలో పాల్గొన్న సిఎం

**నాగర్ కర్నూల్,అక్టోబర్ 3( సమయజ్యోతి):**

దసరా ఉత్సవాలను సీఎం రేవంత్ రెడ్డి తన స్వగ్రామం కొండారెడ్డిపల్లిలో గురువారం ఘనంగా జరుపుకున్నారు. నాగర్ కర్నూలు జిల్లా వంగూర్ మండలం కొండారెడ్డపల్లికి హెలికాప్టర్‌లో కుటుంబ సభ్యులతో కలిసి ఆయన చేరుకున్నారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డికి నియోజకవర్గ ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణతోపాటు గ్రామస్తులు గజమాలతో స్వాగతం పలికి.. ఆయనపై పూల వర్షం కురిపించారు. అనంతరం ఆ గ్రామంలోని శ్రీ ఆంజనేయస్వామి దేవాలయంలో స్వామివారిని దర్శించుకుని సీఎం రేవంత్ రెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రికి ఆలయ పూజారులు తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఆ తర్వాత తన నివాసానికి రేవంత్ రెడ్డి చేరుకున్నారు. సాయంత్రం గ్రామంలోని దసరా ఉత్సవాల్లో సీఎం రేవంత్ రెడ్డి పాల్గొన్నారు. స్థానిక కట్టమైసమ్మ దేవాలయంలో ఆయన పూజలు చేశారు. అనంతరం గ్రామస్తులతో కలిసి జమ్మిచెట్టు వద్దకు చేరుకున్నారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి ప్రత్యేక పూజలు చేశారు. మరోవైపు స్వగ్రామంలో దసరా ఉత్సవాల్లో సీఎం రేవంత్ రెడ్డి పాల్గొంటున్నారని సమాచారం అందడంతో .. ఆ పరిసర గ్రామాల ప్రజలంతా కొండారెడ్డిప్లలెకు భారీగా తరలివచ్చారు. దీంతో ఆ గ్రామం జనసంద్రంగా మారింది. మరోవైపు సీఎం రేవంత్ రెడ్డి పర్యటన నేపథ్యంలో కొండారెడ్డిప్లలెలో భారీగా పోలీసులు మోహరించారు. దసరా వేడుకల్లో భాగంగా కుటుంబ సభ్యులతో కలిసి జమ్మి పూజ కార్యక్రమంలో సిఎం రేవంత్ పాల్గొన్నారు. కొండారెడ్డిపల్లిలో కుటుంబసభ్యులతో కలిసి కోట మైసమ్మ దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన సీఎం. ÷రిళిట మైసమ్మ అమ్మవారి దర్శనం అనంతరం దసరా వేడుకల్లో భాగంగా జమ్మిచెట్టు పూజా కార్యక్రమంలో గ్రామస్తులతో పాటు పాల్గొన్నారు.

# ఉపాధ్యాయ వృత్తిలోపాకాల రాజేశ్వర్ రెడ్డి సేవలు ఎనలేనివి

## ఉపాధ్యాయ ఎం ల్ సి పింగిలి శ్రీపాల్ రెడ్డి

సమయజ్యోతి ప్రతినిధి హన్మకొండ



ములుగు జిల్లా వాజేడు మండలం ధర్మవరం ప్రాథమిక పాఠశాల హెచ్ఎం పాకాల రాజేశ్వర్ రెడ్డి విజయ లక్ష్మి పదవీ విరమణసన్మాన మహెూత్సవము హన్మకొండ జిల్లా వడ్డేపల్లి మన వేదిక లో ఫిజికల్ డైరెక్టర్ ఎర్రబెల్లి ప్రభాకర్ రెడ్డి అధ్యక్షత జరగగా ముఖ్య అతిథిగా విచ్చేసిన ఉపాధ్యాయ ఎం ల్ సి శ్రీపాల్ రెడ్డి మాట్లాడుతూ అన్ని వృత్తులలో కెల్లా ఉపాధ్యాయ వృత్తి పవిత్రమైనది ఆ వృత్తిలో రాజేశ్వర్ రెడ్డి అందించిన సేవలు అమోఘమని కొనియాడారు 39 ఏళ్ల పాటు వివిధ పాఠశాలల్లో చేసి విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చి దిద్దారని అన్నారు పి ఆర్ టి యు సంఘం లో వివిధ బాధ్యతలు చేపట్టి సంఘం బలోపేతానికి కృషి చేశారని అన్నారు ఎం ఎల్ సి ఎన్నికల్లో నా గెలుపుకు కృషి చేశారని అన్నారు ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారమే పి ఆర్ టి యు ధ్యేయం అని అన్నారు నెల రోజుల లోపు అన్ని ఆసుపత్రుల్లో క్యాష్ లెస్ సేవలు అందుబాటులోని రానున్నాయని అన్నారు ఆత్మీయ అతిథి జె ఎన్ టీ యు యూనివర్సిటీ మాజీ ప్రొపెసర్ చిట్టి రెడ్డి వెంకట్ రమణ రెడ్డి మాట్లాడుతూ మాట్లాడుతూ విద్యా రంగం లో క్రమశిక్షణ గల టీచర్ గా రాజేశ్వర్ రెడ్డి తగిన గుర్తింపు పొందారని అన్నారు నా బాల్య మిత్రుడు పదవీ విరమణ పొందడం అభినందనీయం అన్నారు బాల్య స్మృతులను నెమరు వేసుకున్నారు పి ఆర్ టి యు ములుగు హన్మకొండ జిల్లాల అధ్యక్షులు వేం యాకూబ్ రెడ్డి మండల తిరుపతి రెడ్డి మాట్లాడుతూ ఉపాధ్యాయ వృత్తిలో అంకితభావం వృత్తినిబద్ధత క్రమశిక్షణ పాటించారని పి ఆర్ టీ యు సంఘం లో అంకిత భావం తో పని చేసి సంఘం బలోపేతం లో తన వంతు పాత్ర పోషించారని అన్నారు ఈ కార్యక్రమంలో పాకాల రాధమ్మ లక్ష్మా రెడ్డి అడిషనల్ డి సి పి శ్రీనివాస్ పి ఆర్ టి యు జిల్లా ప్రధాన కార్యదర్శి పలీత శ్రీహరి జాలి రాఘవ రెడ్డి చిట్యాల మాజీ జెడ్ పి టి సి సభ్యులు కే సాయిలు గెజిటెడ్ ప్రధానో పాధ్యాయులు కొమ్మిడి లక్ష్మణ్ రెడ్డి దోర్న సమ్మి రెడ్డి నూకల అంజి వర్ధన్ రెడ్డి కే సాంబ శివరావు పట్టాభి రాజేశ్వర్ రెడ్డి వియ్యంకులు బొమ్మి నేని సంజీవ రెడ్డి బండ రాజీ రెడ్డి అల్లుళ్లు కూతుళ్లు శ్యామ్ సుందర్ రెడ్డి జ్యోతి సతీష్ రెడ్డి స్వాతి బంధువులు మిత్రులు కొమ్మిడివాసు దేవ రెడ్డి కొమ్మిడి రామ్ రెడ్డి పుప్పాల ప్రభాకర్ రావు హుస్నాబాద్ సబ్ ఇన్స్పెక్టర్ పాకాల లక్ష్మా రెడ్డి పాకాలప్రకాష్ రెడ్డి కామిడి సతీష్ రెడ్డి కామిడి శ్రీధర్ రెడ్డి తీగల జగ్గయ్య గడ్డి రాజ్ కుమార్ కొట్టే శ్యామ్ పాకాల శ్రీనివాస్ రెడ్డి రామగిరి సాయి కృష్ణ కిషన్ మేరుగు రఘుపతి కంచర్ల నరసింహ రెడ్డి పాకాల వీరరెడ్డి లింగం పల్లి నర్సింగ రావు మెరుగు సారంగ పాణి బయగాని జనార్ధన్ అనిల్ రెడ్డి కాత్రేవుల దుర్గా ప్రసాద్ రాజగోపాల్ చారి సంగెం మండల పి ఆర్ టి యు అధ్యక్షులు గజ్జెల విజయ్ కుమార్ బరిగెల కాంతారావు గట్ల శ్రీనివాస్ రెడ్డి కేశవ రెడ్డి బందు మిత్రులు ఉపాధ్యాయులు తదితరులు పాల్గొని రాజేశ్వర్ రెడ్డి దంపతులను ఘనంగా సన్మానించారు

# ఆపద సమయంలో అతివలకు అండగా ఆదిలాబాద్ షి టీం బృందం.- జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్

సమయజ్యోతి న్యూస్ ఆదిలాబాద్ :

ఆపద సమయంలో అతివలకు అండగా ఆదిలాబాద్ షి టీం బృందం 24 గంటలు అందుబాటులో ఉంటూ సేవలందిస్తుందని జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ తెలియజేశారు. ఆదిలాబాద్ జిల్లాలో మహిళలు,చిన్నారుల భద్రతకై,రక్షణకై ఆదిలాబాద్ జిల్లా షీ టీం బృందం అందుబాటులో ఉంటూ సమస్యలను పరిష్కరిస్తూ ప్రజల రక్షణకై విధులను నిర్వర్తిస్తుందని తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ దుర్గా నవరాత్రి ఉత్సవాలలో రాత్రి సమయాలలో ఆకతాయిలు అల్లరి చేస్తూ మహిళలను వేధించిన సందర్భాలలో రెడ్ హ్యాండెడ్ గా ఈ నెలలో 16 కేసులు నమోదు చేసినట్లు,షీ టీం బృందం ప్రత్యేకంగా రాత్రి సమయాలలో రద్దీ ఎక్కువగా ఉండే ప్రదేశాలలో సంచరిస్తూ మహిళలను వేధిస్తున్న వారిపై దృష్టి సారించిందని తెలిపారు. జిల్లా వ్యాప్తంగా ఆదిలాబాద్ షీ టీం బృందాలు యువతులకు,విద్యార్థిని విద్యార్థులకు,పని స్థలాలలో మహిళలకు ప్రత్యేకంగా 20 అవగాహన కార్యక్రమాలు నిర్వహించి చైతన్య పరచడం జరుగుతుందన్నారు. ఈ సందర్భంగా సెప్టెంబర్ నెలలో షీ టీం బృందాల ద్వారా 24 ఈ పెట్టీ కేసులను నమోదు చేయడం జరిగిందని తెలిపారు. షీ టీం బృందాలు నెల రోజులలో జిల్లా వ్యాప్తంగా 119 హాట్స్పాట్ల లో తనిఖీ చేయడం జరిగిందని,పలు గ్రామాలలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం జరిగిందన్నారు. షి టీం బృందం సభ్యులు చాకచక్యంగా వ్యవహరిస్తూ నవరాత్రి ఉత్సవాలలో ప్రత్యేక బృందం చే మహిళలకు రక్షణగా,మహిళలు వేధింపులకు గురికాకుండా అడ్డుపడుతూ ఆకతాయిల పట్ల చట్టపరంగా వ్యవహరిస్తూ ఉందని తెలిపారు. 6 కౌన్సిలింగ్ ల ద్వారా కేసులలో పరిష్కారం చూపబడిందని తెలిపారు. ఆపత్కాల సమయంలో ఆదిలాబాద్ షి టీం బృందాల ను సంప్రదించాలంటే 8712659953 మొబైల్ నంబర్కు ఫోన్ ద్వారా సంప్రదించాలన్నారు. 5 గ్రామాలలో కార్యక్రమాలు నిర్వహించి మహిళల పట్ల జరిగే నేరాలపై,చైల్డ్ మ్యారేజ్,సైబర్ నేరాలపై,సోషల్ మీడియా నేరాలపై,చిన్నారులకు గుడ్ టచ్ మరియు బ్యాడ్ టచ్ లపై అవగాహనలు కల్పించి చైతన్యపరచడం జరిగిందని తెలియజేశారు. 9 మంది ఆకతాయిలపై మావల పోలీస్ స్టేషన్లో 9 కేసులు నమోదు చేయడం జరిగిందన్నారు. గురువారం ఒక్కరోజే దసరా సందర్భంగా రాత్రి సమయంలో దస్నాపూర్ ప్రాంతంలో మహిళలను వేధించిన,ఆకతాయి చేష్టలు చేసిన 9 మంది యువకులపై మావల పోలీస్ స్టేషన్ నందు 9 కేసులు నమోదు చేయబడినట్లు తెలిపారు. వారి వివరాలు చూస్తే,1)షిండే రాహుల్ తండ్రి రామచంద్ర,2)యోగేష్ తండ్రి గుణవంత్ రావు,3)పద్మశాలి విట్టల్ తండ్రి రాజు,4)షిండే నితిన్ తండ్రి మారుతి,5)అడలోలు నరేష్ తండ్రి సుధాకర్,6)రోహిత్ తండ్రి సేతులాల్,7)బొంపల్లి ప్రసాద్ తండ్రి పుచ్చయ్య,8)షేక్ పరవేష్ తండ్రి






మొబీన్,9)ధూత్రి పరమేశ్వర్ %ం/శీ% సంతోష్. వీరందరూ ఆదిలాబాద్ పట్టణానికి చెందిన వారిని వీరిపై మావల పోలీస్ స్టేషన్లో కేసు నమోదు అయిందని తెలిపారు. అదేవిధంగా 3 రోజుల క్రితం ఆదిలాబాద్ నుండి కేలాపూర్ వెళ్లే పాదయాత్ర సమయంలో మహిళను వేధించిన వ్యక్తి10) మడావి ధత్తు తండ్రి రాథోడ్ పై కేసు నమోదు చేయడం జరిగిందని తెలిపారు. మహిళలకు,చిన్నారులకు రక్షణగా ఆదిలాబాద్ పోలీస్ వ్యవస్థ 24 గంటలు అందుబాటులో ఉంటూ సేవలందిస్తుందని హామీ ఇచ్చారు. ఈ నెలలో మహిళల సమస్యలతో దాదాపు 31 మొబైల్ ఫోన్ కాల్స్ వచ్చినట్లు వారికి తగిన సమస్య పరిష్కారానికి కృషి చేసినట్లు తెలిపారు. షీ టీం బృంద సభ్యులు ఏఎస్ఐ బి సుశీల,హెడ్ కానిస్టేబుల్ వాణిశ్రీ,మహిళా సిబ్బంది షీ టీం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# పట్టణ పాలచెట్టు ప్రాంతంలో పండుగ పూట రెచ్చిపోయిన అల్లరిమూకలు

సమయజ్యోతి న్యూస్ ప్రతినిధి మందమర్రి

మందమర్రి పట్టణ పాలచెట్టు ప్రాంతంలో పండుగ పూట రెచ్చిపోయిన అల్లరిమూకలు రాళ్లు, కర్రలతో దాడులు పండుగ పూట స్థానికుల్లో భయాందోళన. మందమర్రి పోలీసు స్టేషన్ పరిధిలో మద్యం, గంజాయి మత్తులో పండుగని ప్రజలు బయట తిరుగుతుంటారని భయం లేకుండా అల్లరి మూకలు రెచ్చిపోయి పరస్పరం కర్రలతో దాడులు చేసుకున్నారు. ఆటోలు హారన్ కొట్టి పక్కకు తప్పుకోండి అనేసరికి మత్తులో ఉన్న దుండగులు వారిపై దాడికి పాలు పడ్డారు. ఈ విషయం పై మందమర్రి ఎస్ఐ రాజశేఖర్ వివరిస్తూ పోలీసులు పండుగ సందర్భంగా సింగరేణి మైదానంలో రావణ దహన కార్యక్రమానికి మంత్రి వివేక్ వెంకట్ స్వామి, అధిక సంఖ్యలో ప్రజలు రావడంతో అక్కడ బందోబస్తులో ఉండవలసి వచ్చిందని. ఘటన విషయం అందిన వెంటనే పోలీసులు ఘటన స్థలానికి వెళ్లి విచారించి గొడవకు పాల్పడిన వారిని అదుపులోకి తీసుకోవడం జరిగింది. అల్లరి ముఖాలు పారిపోతున్న ఆటోను సీజ్ చేసి నిందితుల పై కేసు నమోదు చేసి లోతుగా విచారించి చట్టపరమైన చర్యలు తీసుకుంటమని తెలిపారు.



# విశ్వహిందూ, భజరంగ్ దళ్ విజయదశమి వేడుకలు

సమయజ్యోతి న్యూస్ ప్రతినిధి బాల్కొండ

బాల్కొండ మండల కేంద్రంలోని మహాలక్ష్మి మందిరం వద్ద విశ్వహిందూ పరిషత్ బజరంగ్ దళ్ ఆధ్వర్యంలో విజయదశమి వేడుకల్లో భాగంగా దుర్గా పూజ, ఆయుధ పూజా, రావణా దిష్టిబొమ్మ దహనము నిర్వహించారు. విజయదశమి ఉత్సవ విశిష్టత గురించి హిందూ ధర్మం గురించి సామాజిక సామరస్యత, పర్యావరణ పరిరక్షణ, స్వదేశీ, పౌర విధులు, కుటుంబ ప్రబోధన్ గురించి వక్తలు వరంగంటి శ్రీనివాస్ వివరించారు. కార్యక్రమంలో విహెచ్పి నగర అధ్యక్షులు ఆరెపల్లి రాజేశ్వర్, మండల అధ్యక్షులు కోడిచర్ల రామకృష్ణ, జిల్లా ధర్మకార్య ప్రముఖ తౌటు రాజేష్, హరాచారి నారాయణ పంతులు, వీడిసి అధ్యక్షులు పోశెట్టి, నాగుల పవన్ గౌడ్, భజరంగ్ దళ్, విశ్వహిందూ పరిషత్ సభ్యులు, యువజన సంఘాల సభ్యులు, నాయకులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.



# నేత్రపర్వంగా విజయదశమి వేడుకలు

సమయజ్యోతి న్యూస్ ముస్తాబాద్

ఊరంతా పండుగ వాతావరణం మధ్య రాజన్న సిరిసిల్ల జిల్లా ముస్తాబాద్ మండల కేంద్రంలో దసరా వేడుకలు నేత్రపర్వంగా నిర్వహించారు. శ్రీ శివ కేశవుల ఉత్సవ మూర్తులను వాయిద్యాల మధ్య పల్లకి సేవలతో షమీ వృక్షము పూజలకు తరలించి, పూజల అనంతరం ఊరేగింపుగా ఆలయ ప్రవేశాన్ని నిర్వహించగా, మహిళలు మంగళహారతులలో నీరాజనం పలికారు. ఆలయ చైర్మన్ మిడిదొడ్డి శరయ్య, ఆలయ ప్రతినిధులు, వేడుకలను పర్యవేక్షించారు. అర్చకులు హరీష్ శర్మ పంతులు, రఘునాథ ఆచార్యులు, వందలాది భక్తులు పాల్గొన్నారు.





# శరన్నవరాత్రి ఉత్సవాల ముగింపు దిశగా..

సమయజ్యోతి న్యూస్ ముస్తాబాద్

నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా దుర్గామాత దేవత విగ్రహాలు గురువారం ఉదయం వరకు పూజలు అందుకొని అనంతరం ముగింపు ఉత్సవాలకు సంసిద్ధమైనాయి. రాజన్న సిరిసిల్ల జిల్లా ముస్తాబాద్ మండలంలో శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ప్రతిష్టించిన దుర్గామాత విగ్రహమూర్తులు, శనివారం రోజున నిమజ్జనం జరగనున్నాయి. ఈ మేరకు నిర్వాహకులు ఏర్పాట్లలో సమాయత్తం అయినారు.



GST NO: 36ACPPF9587L2ZM TELTEL/2013/5332
సమయజ్యోతి
ప్రతీ అక్షరం - ప్రజలకోసం
తెలుగు దిన పత్రిక

## సంపాదకీయం

# రాహుల్ అజ్ఞానానికి పరాకాష్ట !

విదేశాలకు వెళ్లడం..అక్కడ భారత్ పాలకులపై దుమ్మెత్తి పోయడం,ప్రజాస్వామ్యం అపహాస్యం అవు తోందని గగ్గోలు పెట్టడం కాంగ్రెస్ ఎంపి, విపక్షనేత రాహుల్ గాంధీకి బాగా అలవాటయిన కార్యక్రమం. విదేశీ గడ్డపై నుంచి దేశంపై దుమ్మెత్తి పోయడం అలవాటు చేసుకున్న నేతగా బహుళ ప్రచారం పొందు తున్నారు. విదేశీయతను పుణికి పుచ్చుకున్న అపరమేధావిగా నిరూపించుకుంటున్నారు. బిజెపిని విమర్శించినప్పుడల్లా ఆర్ఎస్ఎస్ భావజాలం అంటూ విమర్శలు చేస్తున్నారు. ఆర్ఎస్ఎస్ భావజాలం గురించి తెలిసి ఉంటే రాహుల్ ఇలా మాట్లాడరు. ఇకపోతే తమ పాలనలోనే భారతదేశం బాగా పరిఢ విల్లిందని, ఇతరుల అంటే బిజెపి పాలనలో దేశం సర్వనాశనం అవుతోందని, ఆర్ఎస్ఎస్, బిజెపిలు కలిసి దేశాన్ని నాశనం చేస్తున్నాయని ఆయన చేస్తున్న విమర్శలు అజ్ఞానానికి పరాకాష్టగా చూడాలి. నిజానికి ఈ దేశంలో రాహుల్‌కు ఉన్న అర్హత ఏమిటి. కేవలం రాజీవ్ గాంధీ తనయుడుగానే ఆయనకు స్థానం ఉంది. అంతకు మించిన రాజకీయ ప్రస్థానం ఆయనకు లేదు. వారసత్వ రాజకీయాల్లో పార్టీ అధ్యక్షుడిగా, ఎంపిగా వెలగబెడుతున్న రాహుల్ భారత్ ఔన్నత్యం, గొప్పతనం గురించి తెలియని అజ్ఞానిగా భావించాలి. అధికారం కల్ల అని తెలుసుకోవడంతో ఏదేదో మాట్లాడుతున్నారు. అడ్డగోలు విమర్శలు చేస్తున్నారు. బంగ్లాదశ్, నేపాల్ లాంటి ఆందోళనలు మనదేశం లోనూ రావాలని కోరుకుంటున్నారా అన్న అనుమానాలు కూడా కలుగుతున్నాయి. వసుదైక కుటుంబ, సర్వేజనా సుఖినో భవంతు అన్న ఆర్యోక్తి మన మట్టిలో పుట్టిన అత్యున్నత మానవాతా వాద విలువలకు అద్దంపట్టేవి.. కానీ ఇవేవీ తెలియకుంటా ఏదోఒక చిన్న దేశానికి వెళ్లడం అక్కడ భారత్‌లో పాలన సరిగా లేదని, ఇక్కడ ప్రజాస్వామ్యం భ్రష్టుపట్టి పోతోందని గొంతు చించుకుంటున్నారు. ఈ దేశంలో ప్రజలు ఎంతో ఉన్నతంగా ఆలోచించి కాంగ్రెస్‌ను ఆదరించారు. అది ఎన్ని దేశద్రోహ పనులు చేసినా వెనకేసు కొచ్చారు. ఎమర్జెన్సీతో భారత ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేసిన చరిత్ర కాంగ్రెస్ పార్టీది. అలాంటి పార్టీలో ఉంటూ ప్రజా స్వామ్యం గురించి, ఓట్ చోరీ గురించి గొంతు చించుకుంటున్నారు. అంతకు మించి ఆర్ఎస్ఎస్ గురించి అవాకులు చవాకులు పేలుతన్నారు. నిజానికి రాహుల్ భారతీయత కలిగిన నేత అయితే ఆర్ఎస్ఎస్ గరించి తెలుసుకుని ఉండేవారు. ఈదేశం కోసం, దేశ పటిష్టత కోసం, దేశం సర్వతో ముఖోన్నతి కోసం అహరహరం శ్రమిస్తున్న ఏకైక సంస్థ ఆర్ఎస్ఎస్. దాని గురించి తక్కువ మాట్లాడే వారు చరిత్ర హీనులు కాకతప్పదు. హిందూ సంస్కృతి నశిస్తే హిందూ సమాజమే ఉండదు. ప్రపంచానికి నాగరిక తను నేర్పిన దేశం కేవలం హిందూమతం, భారతదేశం మాత్రమే. ఎన్నోదాడులను, మత దురాచారా లను, మతమార్పిడులను తట్టుకుని కూడా భారత్ ఇవాళ ప్రపంచానికి వెలుగుదివిటీగా సాగుతోంది. ఆర్ఎస్ఎస్ శతవసంతాల వేళ విదేశీ గడ్డపై నుంచి ఆర్ఎస్ఎస్ గురించి చేసిన ప్రేలాపనలు ఎంతమాత్రం సహించ రానివి. ఎన్నో దాడులు, బలిదానాలు, మతమార్పిళ్ల నేపథ్యంలో హిందూ సమాజాన్ని సంఘటితం చేయడం ప్రతి హిందువు కర్తవ్యం అంటూ డాక్టర్ కేశవ బలిరాం హెడ్గేవార్ వంద సంవత్సరాల క్రితం స్థాపించిన 'రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్' నేడు భారతదేశ చరిత్రను పునర్లిఖించే క్రమంలో ఉన్నది. 1925 విజయదశమి రోజున నాగపూర్‌లో హెడ్గేవార్ స్థాపించిన ఈ సంస్థ దినదిన ప్రవర్ధమానమై దేశ ఐక్యతకు, ప్రపంచ శాంతికి పాటుపడుతోంది. 'నమస్తే సదా వత్సలే మాతృ భూమే' ఇది ఆ సంఘ్ ప్రాణగీతం.తల్లి భరతమాతను ఈ ప్రపంచానికే విశ్వగురువుగా నిలబెట్టాలన్నది ఆరెస్సెస్ ఏకైక లక్ష్యం. అందుకోసం ప్రతి భారతీయుడినీ, ముఖ్యంగా యువతను దేశ నిర్మాణంలో పాలు పంచుకునేలా చేయాలన్నదే తపనతో పనిచేస్తున్న ఏకైక సంస్థ అనడంలో ఎలాంటి అనుమానాలు లేవు. స్వాతంత్య్ర పోరాటంలో రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ పాలుపంచుకోలేదనేది చరిత్ర తెలియని దేశ వ్యతిరేకుల ఆరోపణ. స్వాతంత్య్రం కోసమే దేశ భక్తులను సంఘ్ తయారు చేసింది. హెడ్గేవార్ 1921, 1931లో జైలు నిర్బంధానికి గురయ్యారు. వార్ధాలో హెడ్గేవార్‌ను కలుసుకున్న గాంధీజీ సంఘ్ క్రమశిక్షణను ప్రశంసించిన విషయం తెలుసుకుంటే మంచింది. దేశం పెను ప్రమాదాలు, విపత్తులు ఎదుర్కొన్నప్పుడు స్వయం సేవకులు తమ ప్రాణాలు కూడా లెక్క చేయకుండా ప్రజలకు సేవలందిస్తోంది. పాక్, చైనాలతో భారత్ యుద్ధం చేసిన సమయంలో భారత సైన్యానికి అండగా నిలబడ్డ సంస్థ కూడా ఆర్ఎస్ఎస్ అని రాహుల్ తెలుసుకుంటే మంచిది. దేశ విభజన, పంజాబ్, బెంగాల్ ప్రాంతాల్లోని హింస, దోపిడీ, అత్యాచారాలను నిలువరించడం, వలస వచ్చిన శరణార్థు లకు శిబిరాల ఏర్పాటు, కరువు సమయం లో నిత్యావసర వస్తువులను అందించడం వంటి చర్యల ద్వారా సంఘ్ చరిత్ర పుటల్లో నిలిచిపోయింది. 1977 నాటి దివిసీమ ఉప్పెనకు బలైన 20వేల మంది మృతదేహాల ను, పశువుల కళేబరాలనూ ఖననం చేసిన ఘనత సంఘ కరసేవకులదే. 1975 నాటి ఎమర్జెన్సీ సమయం లో జైలుకు వెళ్లిన వారిలో అనేకులు స్వయం సేవకులు ఉన్నారు. అవివేకంతో కూడిన అభ్యాసం కంటే జ్ఞానం మేలు. జ్ఞానం కంటే ధ్యానం ఉత్తమం. ధ్యానం కంటే కర్మఫల త్యాగం మంచిది. ఆ త్యాగం వల్ల మనశ్శాంతి కలుగుతుంది.' అని భగవద్గీత శ్లోకం భావం. ప్రపంచవ్యాప్తంగా వివిధ ఆశయాలతో కూడిన అనేక సంస్థలు ఉన్నాయి. అయితే వందేళ్ల ప్రయాణం పూర్తి చేసుకున్న రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ త్యాగాలకు సాటిరాగల మరో సంస్థ లేదనే చెప్పాలి. ఎందుకంటే ఆయా సంస్థలకు స్వలాభాపేక్ష ఉంది. కానీ ఆర్ఎస్ఎస్‌కు మాత్రం దేశ హితమే స్వార్థంగా ఉంది. వేల సంవత్సరాల భారతీయ సామాజిక విలువలే ఆలంబనగా, సామాజిక జీవనంలో ఏర్పడిన లోటుపాట్లను అధిగమిస్తూ, జీవన విధానంలో దృఢత్వం, సమాజం కోసం అంకితమైన వ్యక్తిత్వం తో ఓ విలక్షణమైన కార్యదీక్ష కలిగిన క్రమశిక్షణాయుత సమూహం ఆరెస్సెస్ సొంతం. అందుకే, కాలగమ నంలో అవరోధాలను, అణచివేతలను అధిగమిస్తూ... ప్రతికూల పరిస్థితుల్లో సైతం తన ప్రాబల్యాన్ని విస్తరిస్తూ, భారతీయ సంస్కృతిలోని సనాతన మూలాల నుంచి జాతీయవాద భావనతో ఆవిర్భవించి, మానవతా వాదాన్ని ఆవిష్కరిస్తోంది. దేశభక్తి అంటే జెండా ఎగరేయడం, దేశభక్తి గీతాలు పాడడం, ఐక్యత ప్రతిజ్ఞ చేయడం కాదని, ఈ స్ఫూర్తి మన ప్రవర్తనలో ప్రతిబింబించి, సమాజంలో పరివర్తనకు బీజాలు వేయాలన్నది ఆరెస్సెస్ లక్ష్యం. సమాజంలో అన్ని వర్గాల ప్రజలతో అరమరికలు లేకుండా కలిసి పనిచేసే అలవాట్లను ఆర్ఎసెస్ నేతలు ప్రేరేపించారు. ఈ స్ఫూర్తి కారణంగానే వందలాది సంఘ్ ప్రేరేపిత సంస్థలు భారతదేశ మంతటా పనిచేస్తున్నా ఎక్కడా అవినీతి, బంధుప్రీతి ఆరోపణలు చెలరేగడం కనిపించదు. పైగా, వాటి పనితీరులో పారదర్శకత, జవాబుదారీతనం స్పష్టంగా కనిపిస్తుంది. కులం, వర్గం, మతం, ప్రాంతాలకు అతీతంగా ప్రజలు సమైక్యంగా ఉండాలని మాటలు చెప్పడం కాకుండా, ఆచరణలో ఆ విధంగా జీవించే వాతావరణం ఏర్పాటు చేయడంలో ఆరెస్సెస్‌ను మించిన మరో సంస్థ లేదని చెప్పవచ్చు. అందుకే రాజకీయాల పరిధిని మించి చూడలేని రాహుల్ లాంటి వారికి ఆరెస్సెస్ కార్యపద్ధతి అర్థం కాదు. దేశ ప్రజల శ్రేయస్సును దృష్టిలో పెట్టుకుని చూస్తేనే ఈ సంస్థ సిద్దాంతం అవగతమవుతుంది. ఆవిర్భావం నుంచి రాజకీయ అధికారం కోసం కాకుండా 'వ్యక్తి నిర్మాణం' కేంద్రంగా, ప్రజలందరి శ్రేయస్సు కోసం ఆరెస్సెస్ పనిచేస్తోంది. ప్రకృతి వైపరీత్యాల సమయంలో ప్రజలకు సహాయం చేయడానికి, సహాయ కార్యక్రమాలను నిర్వహించడానికి, పేద పిల్లలకు విద్య, వైద్య సదుపాయాలు అందించడానికి, వృద్ధులకు సేవ చేయడానికి స్వయం సేవక్‌లు అందించే సేవలలో వివక్ష మచ్చుకైనా కనిపించదు. ఇంతటి ఉదాత్త ఆశయంతో పనిచేస్తున్న ఆర్ఎస్ఎస్ పట్ల ఏహ్య భావంతో రాహుల్ నోరు పారేసుకుంటున్నారు. బిజెపితో కలిసి అని నిందిస్తున్నారు.

# ప్రపంచ గతిని నిర్దేశించిన భారతీయ సైన్స్

## వైజ్ఞానిక పునరుజ్జీవనం అవసరం

### శాస్త్ర, సాంకేతిక రంగాలలో ముందంజలో ఉండడానికి అధిక నిధులు కేటాయించాలి

**సమయజ్యోతి ప్రత్యేకం**

**గుమస్తాలను తయారుచేసే విద్యా విధానానికి చెల్లుచీటీ ఇచ్చి, శాస్త్ర సాంకేతిక విద్య అందించే విద్యా విధానానికి ప్రాధాన్యత ఇయ్యాలిభూమి తనచుట్టూ తాను తిరుగుతుందని తొలిసారిగా కనుగొన్న దేశం, దశాంశ మానం, సున్నా విలువను కనుగొని గణితశాస్త్రాన్ని మలుపుతిప్పిన దేశం, మత్తు ఇవ్వకుండానే కంటికి ఆపరేషన్ చేసిన సుశ్రుతుడు పుట్టిన దేశం మనది..**

**పుర్రెని విప్పి కంతిని తొలగించి, శస్త్రచికిత్స చేసిన భూమి భారతదేశం. గురుత్వాకర్షణ శక్తి కలదని మొదటిసారిగా చెప్పిన భాస్కరచార్యుడు పుట్టినభూమి మనది.**

**పేరు లేని రోగాలకు క్షణాల్లో మూలికా వైద్యం చేసిన చరకుడు పుట్టిన నేల మనది.**

**సాక్షాత్తు అమృత కళశాన్ని చేతబట్టిన ధన్వంతరి పుట్టిన వేదభూమి కూడా మనదే..**

**వైజ్ఞానికంగా ఉజ్వల చరిత్ర కలిగి నటువంటి భారతదేశంలో సైన్స్ పునరుజ్జీవింప చేయాలి.**

**ప్రాచీన సంస్కృతులలో వెల్లివిరిసిన సైన్స్‌లి**

**హరప్పా ,మహేంజో దారో సంస్కృతులలో భారతీయ విజ్ఞానము ఇమిడి ఉంది. కాల్చిన ఇటుకలతో భవనాలు నిర్మించారు. భూగర్భ వసతి, మురుగు కాలువలు పారిశుధ్య నిర్వహణ, యంత్రాలతో నీటి సరఫరా నియంత్రణ పద్ధతులు ఇవన్నీ ఆనాటి పట్టణాల ప్రత్యేకతలు.**

**అశోకుడి స్తూపాలు ధర్మ ప్రచారానికి మాత్రమే కాకుండా నాటి నిర్మాణ కౌశల్యానికి, పనితనానికి రుజువులు. ఈనాటి ఆధునిక కాలంలో ఎవరికీ అశోక కాలంనాటి స్తూపాలను నిర్మించడం సాధ్యం కాదని పాశ్చాత్య దేశాలు సైతం ప్రశంసించాయి.**

#### ప్రాచీన కాలంలోనే విజ్ఞాన గ్రంథాలు

క్రీస్తుశకం ఒకటి నుంచి మూడు శతాబ్దాల మధ్య కాలం నాటి వైద్య గ్రంథాలు చరక సంహిత, సుశ్రుత సంహితలు భారత వైద్య విజ్ఞానానికి అద్దంపడతాయి. శస్త్రచికిత్సలో వాడాల్సిన 100 పరికరాల గురించి సుశ్రుత సంహిత లో సవివరంగా ఉంది. సుశ్రుతుడు ప్లాస్టిక్ సర్జరీ చేశాడు. జీవకుడు అనే వైద్యుడు ఒక వ్యాపారికి మెదడుకు శస్త్రచికిత్స చేసినట్లు బౌద్ధ గ్రంధాలలో ఉంది. బింబిసారుడు జీవకుడిని బుద్ధునికి వ్యక్తిగత వైద్యునిగా నియమించాడు.
లివిదేశాలకు భారతీయ వైద్యులలి
అశోకుడు మానవతా దృక్పథంతో ఆకాలంలోనే యూరప్ దేశాలకు వైద్య బృందాలు పంపించాడు.
నలంద మహా విహారాలలో వైద్యవిద్య నిర్బంధంగా ఉండేది. ఏడు, ఎనిమిది శతాబ్దాల వరకు కూడా బాగ్దాద్ లో భారతీయ వైద్యులను శస్త్రచికిత్స నిపుణులను నియమించుకునేవారు. భారతీయ వైద్య గ్రంధాలు చైనాలో కూడా బహుళ ప్రాచుర్యం పొందాయి.

#### ప్రపంచ స్థాయి విశ్వవిద్యాలయాలకు పుట్టినిల్లు భారతదేశం

కొన్ని వేల ఏళ్ళ క్రితమే నలంద, తక్షశిల, విక్రమశిల లాంటి విశ్వవిద్యాలయాలలో వేలాది మంది విద్యార్థులకు విద్యను అందించిన దేశం మన భారతదేశం. యూరోప్ దేశాల నుండి ఇ అరబ్బు దేశాల నుండి వేలాది మంది విద్యార్థులు వచ్చి విద్యను కొనసాగించేవారు.

శాస్త్రీయంగా రూపొందించిన ప్రాచీన నిర్మాణాలు మన విజ్ఞాన నైపుణ్యానికి కుతుబ్ మీనార్ వద్ద ఉన్న మెహరోలీ ఇనుప స్తంభం మించిన ఆధారం మరొకటి ఉండదు .ఇది క్రీస్తుశకం 4వ శతాబ్దం నాటిది.ఎన్ని వందల ఏళ్లు గడిచినా చెక్కుచెదరలేదు. అజంతా చిత్రాలు కళాత్మక విలువలకు, వాటిని ఉపయోగించిన రంగులు నాణ్యతకు నిదర్శనాలు.నౌకా నిర్మాణ శాస్త్రంలోనూ దక్షిణాది ప్రజలు గొప్ప సాహసికులు. టన్నుల కొద్దీ బరువైన పెద్దపెద్ద గోడలు నిర్మించారు. విదేశాలతో వర్తక వాణిజ్యం సాగించారు. గణిత మేధావి ఆర్యభట్ట 'పై' విలువను క్రీస్తుశకం 500 నాటికే 3.1416 అని ఖచ్చితంగా చెప్పారు. భూమి తన చుట్టు తాను తిరుగుతుంది అని మొదట చెప్పిన వ్యక్తి ఆర్యభట్ట. అందుకే భారతదేశం ప్రయోగించిన మొట్టమొదటి ఉపగ్రహానికి ఆర్యభట్ట అని పేరు పెట్టారు.గణిత, ఖగోళ, వైద్య శాస్త్రంలో ఎన్నో పరిశోధనలు ఆవిష్కరణలు చేసి ప్రపంచానికి అందించిన దేశం భారతదేశం

మన ప్రాచీన శాస్త్రవేత్తలు విశ్వంలోని అణువుల మధ్య మౌన భాషను ఏనాడో గుర్తించారు.అది ఇప్పుడు పాశ్చాత్యులకు పెద్ద పరిశోధన అంశంగా మారింది.క్రీస్తు శకము ఆరవ శతాబ్దం వరకూ సాగిన భారతీయ సైన్స్ యుగము మతఛాందస ఫలితంగా మసకబారింది .క్రీస్తుశకము 6వ శతాబ్దం నుంచి 19వ శతాబ్దము బ్రిటిష్ పాలన వరకు దాదాపు 1300 సంవత్సరాలు భారతీయ వైజ్ఞానిక రంగంలో సుదీర్ఘ చీకటి అధ్యాయం సాగింది. ఒక దేశ చరిత్రలో 1300 సంవత్సరాలు చిన్న విషయం కాదు. విదేశీయుల దండయాత్రలు, బ్రిటిష్ వారి పరిపాలన తదితరాలతో భారతీయ సైన్స్ యుగంలోకి నెట్టివేయబడింది.

#### స్వాతంత్రానంతరం భారత దేశంలో సైన్స్

గత ఏడున్నర దశాబ్దాలుగా స్వతంత్ర భారత దేశంలో శాస్త్ర, సాంకేతిక రంగాలలో జరిగిన కృషి అంతంత మాత్రమే ఉంది. మొదటి,రెండవ ప్రపంచ యుద్ధాలు ప్రపంచ గతిని మార్చి వేశాయి. అగ్రరాజ్యాల మధ్య ప్రచ్ఛన్న యుద్ధం సైన్స్ కార్యకలాపాలు వేగం పెరిగేలా చేశాయి. అగ్ర రాజ్యాల మధ్య ప్రచ్ఛన్న యుద్ధం వలన ప్రపంచం రెండుగా చీలిపోయింది. ఆయుధాలు, వస్తువులను ఉత్పత్తి చేసి పశ్చిమ దేశాలు విపరీతమైన లాభాలు ఆర్జించాయి. కొత్త టెక్నాలజీల మీద పెట్టుబడులు పెట్టాయి. అదే సమయంలో భారత దేశము రెండువందల ఏళ్ల బ్రిటిష్ వారి పాలనలో నేలమట్టమైన సమాజాన్ని పునర్నిర్మించడం లో మునిగిపోయింది. బడ్జెట్లో అధిక భాగము రక్షణ రంగానికి, ఆయుధాలు సమకూర్చుకోవడానికి సరిపోయింది. సైన్స్ పాలసీలు కాగితాలకే పరిమితమయ్యాయి. శాస్త్రవేత్తలు మాట చెల్లలేదు. భారతదేశంలో సైన్స్ మరియు టెక్నాలజీ అభివృద్ధికి అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించడం కష్టతరం అయింది


మన పాఠశాలలు గల్ఫ్ దేశాలకు కూలీలను, మన ఇంజనీరింగ్ కళాశాలలు విదేశాలకు సాఫ్ట్ వేర్ రంగానికి కావాల్సిన మానవ వనరులను ఎగుమతి చేస్తున్నాయి. మనకంటూ ఒక దిశానిర్దేశం లేకపోవడంతో ఒకనాటి ఉజ్వల భారతదేశం విదేశీ వస్తువులకు ప్రస్తుతము పెద్ద మార్కెట్ గా ఉన్నది.

#### సహజ వనరులు పుష్కలంగా ఉన్న దేశం మనది

ప్రకృతి వనరులు పుష్కలంగా ఉన్న భారతదేశంలో కావలసిన వస్తు సామాగ్రిని, ఎలక్ట్రానిక్ ఉపకరణాలను మనమే తక్కువ ఖర్చుతో తయారు చేసుకునే శాస్త్ర విజ్ఞానం, సాంకేతిక పరిజ్ఞానం అత్యంత ఆవశ్యకము. ఈ దిశగా పాఠ్యప్రణాళికలో మార్పులు జరగాలి.భారతదేశం అంటే 'చౌక కార్మికులు -అతిపెద్ద మార్కెట్' అన్న భావన బహుళజాతి సంస్థలలో ఇమిడి ఉంది. బ్రిటిష్ హయాంలో వచ్చిన మెకాలే విద్యా విధానం ద్వారా చౌకగా గుమస్తాలను తయారు చేసే కర్మాగారాలుగా విద్యాలయాలు మారిపోతున్నాయి.

#### శాస్త్ర సాంకేత రంగాలపై ప్రభుత్వాల శీతకన్ను

ప్రభుత్వ ప్రాధాన్యత శాస్త్ర, సాంకేతిక రంగాల కన్నా మిగిలిన రంగాలపైనా ఉండిపోయింది. ఆధునిక శాస్త్ర విజ్ఞానంలో పోటీ పడటానికి, ప్రజల ప్రయోజనాలు మెరుగుపరచడానికి, చౌకగా పేద ప్రజలకు వివిధ వస్తువులు అందించడానికి, ఉత్పత్తి సామర్థ్యాన్ని పెంచడానికి అవసరమైన ఆవిష్కరణలు జరగలేదు. టెక్నాలజీ అభివృద్ధి చెందలేదు. దీనికి రాజకీయ కారణాలు కూడా తోడయ్యాయి. అభివృద్ధి నిధులు అధికభాగం యుద్ధానికి ఖర్చయ్యాయి. శాస్త్ర సాంకేతిక రంగాలలో పరిశోధనలకు ప్రాధాన్యతను ఇవ్వలేదు. బడ్జెట్ ఎక్కువగా కేటాయించలేదు.




#### శాస్త్ర సాంకేతిక రంగాలకు ప్రాధాన్యతనిచ్చి వైజ్ఞానిక పునరుజ్జీవనం చేయాలి

పాఠ్య ప్రణాళికల లో శాస్త్ర, సాంకేతిక రంగాలకు పెద్ద పీట వేయాలి. విద్యార్థుల విజ్ఞాన ఆలోచనలను శాస్త్రీయంగా అభివృద్ధి చెందేలా పాఠ్య ప్రణాళికను రూపొందించాలి. వైద్య, శాస్త్ర సాంకేతిక, ఆరోగ్య ,అంతరిక్ష పరిశోధనలపై దృష్టి సారించాలి. ప్రకృతి వనరులు పుష్కలంగా ఉన్న భారతదేశంలో శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానాలు తక్షణ అవసరాలు.ఈ దిశగా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఆలోచించాలి.

#### నూతన విద్యా విధానంలో శాస్త్ర సాంకేతిక విద్యకు పెద్దపీట.

ఆరవ తరగతి నుండి నైపుణ్య విద్యను ప్రవేశపెట్టబోతున్నారు. ప్రతి విద్యార్థి పాఠశాల స్థాయిలోనే ఏదో ఒక నైపుణ్యాన్ని అభివృద్ధి చేసుకునే లాగా సిలబస్ రూపొందించబోతున్నారు. వృత్తి విద్యకు ప్రాధాన్యం ఇవ్వబోతున్నారు. వివిధ పాఠశాలలు కళాశాలల్లో ప్రయోగశాలలు నిర్మించనున్నారు.

#### సైన్స్ అభివృద్ధికి తగిన నిధులు కేటాయించాలి

నూతన విద్యా విధానంలో సైన్స్ అభివృద్ధి కాగితాల వరకే పరిమితం కాకుండా తగినన్ని నిధులను కేటాయించాలి. దేశ సమగ్రాభివృద్ధికి అవసరమైనంత సైన్స్ మన దేశంలోనే రూపొందాలి. పాఠశాల స్థాయి నుండే బాల శాస్త్రవేత్తలను తయారు చేయాలి. ప్రణాళిక వేత్తలు, రాజకీయనాయకులు, ఉన్నతాధికారులు చిత్తశుద్ధితో ఆలోచించి భారతీయ సైన్స్ గతిని మార్చాలి. ఒకనాడు ప్రపంచానికి వెలుగులు పంచిన భారతదేశానికి మళ్ళీ పునర్వైభవం రావాలి అంటే కేవలం శాస్త్ర సాంకేతిక రంగాలలో అభివృద్ధి ద్వారా మాత్రమే సాధ్యమవుతుంది. భారతీయ విజ్ఞానానికి పునర్వైభవం చేకూరుతుందని ఆశిద్దాం.

**కామిడి సతీష్ రెడ్డి జయశంకర్**
**భూపాల్ పల్లి 9848445134**

## విజయదశమి వేడుకలలో పాల్గొన్న కార్పొరేటర్ పుష్పానగేష్

**సమయజ్యోతిన్యూస్ రామచంద్రాపురం**

గురువారం బాలవిహార్ పార్క్ లో ఏర్పాటు చేసిన జమ్మి పూజ లో గ్రామ పెద్దలు నాయకులు స్థానికులతో కలిసి బాణాసంచాల తో మంగళ వాయిద్యాలతో ర్యాలీ గా పాల్గొని రామచంద్రాపురం డివిజన్ శ్రీనివాస్ నగర్ కాలనీ సండే మార్కెట్ ఆవరణంలో దసరా వేడుకల కార్యక్రమంలో రావణదహణకాండ కార్యక్రమం లో స్థానిక రామచంద్రాపురం కార్పొరేటర్ బూరుగడ్డ పుష్పనగేష్ గ్రామ ప్రజల అందరి సమక్షంలో రావణదహనకాండ నిర్వహించారు సుమారు రెండు గంటల పాటు ఆకాశమంత దీపకాంతులతో రావణ దహనం జరిగింది



## దసరా ఉత్సవాల్లో భాగంగా అద్భుతంగా సాగిన రావణ సంహారం

**సమయజ్యోతి న్యూస్**
**రామచంద్రాపురం**



తెల్లాపూర్ మున్సిపాలిటీ ఈదుల నాగులపల్లి గ్రామంలో దసరా సందర్భంగా ఘనంగా రావణ దహన కార్యక్రమం జరిగింది ఈ వేడుకలో పటాన్చెరు బీఆర్ఎస్ యువనాయకుడు బాలగౌని సాయిచరణ్ గౌడ్ పాల్గొన్నారు ఈ సందర్భంగా తెల్లాపూర్ మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ రాములు గౌడ్ గ్రామ పెద్దలతో కలిసి ధ్వజారోహణం జమ్మి పూజ మరియు పాలపిట్టను ఎగురవేయడం జరిగింది చెడుపై మంచికి నిదర్శనంగా దసరా పండుగను ఉత్సాహంగా జరుపుకున్నారు

# రెడ్ బుక్, డిజిటల్ బుక్ అనే ఒక పొలిటికల్ బుక్


టిడిపి నేత లోకేశ్ రెడ్ బుక్ కి ధీటుగా వైసిపి అధినేత జగన్ డిజిటల్ బుక్ తీసుకురావడం ఆ పార్టీ అభిమానులను, కార్యకర్తలను, నాయకులను ఒకింత కలవరపాటుకు గురిచేస్తుందని చెప్పవచ్చు. దొంగలు పడ్డ ఆరునెలలకు కుక్కలు మొరిగినట్లు అనే సామెతను గుర్తుకు తెస్తుంది ఈ నిర్ణయం. ప్రస్తుత కూటమి ప్రభుత్వంలో వైసీపీ పార్టీ కార్యకర్తలకు జరిగిన అన్యాయాన్ని డిజిటల్ బుక్ లో నోట్ చేసి, 2029 లో పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత ఆ అన్యాయం చేసిన సదరు అధికారిని లేక నాయకుడుని సప్త సముద్రాల ఆవలికి పారిపోయినా కాలర్ ను పట్టి లాక్కువచ్చి న్యాయస్థానం ముందు దోషిగా నిలబెట్టి శిక్ష పడేలా చేస్తారట.అయ్యవారు వచ్చేవరకు అమావాస్య ఆగుతుందా..!! ఇక్కడ బోలెడు అనుమానాలు కార్యకర్తల మనస్సుల్లో మెదులుతాయి. మొదటగా 2029 లో పార్టీ అధికారంలోకి రావాలి.( ఇది జరగొచ్చు లేదా జరగకపోవచ్చు) పార్టీ అధికారంలోకి వస్తే, అంటే 2029 వరకు ఇక్కడ జరిగిన అన్యాయాన్ని లేదా అలా అన్యాయానికి కారణమయ్యే అధికారిని, నాయకుణ్ణి లేక వ్యవస్థ ను ప్రశ్నించే వారే ఉండరా..? 2029 లో పార్టీ అధికారంలోకి వచ్చే వరకు అన్యాయానికి గురైన సదరు వ్యక్తి న్యాయం కోసం వేచి ఉండాల్సిందేనా..? ఇది అంత ఆమోదయోగ్యమైన విధానం కాదేమో అని అనిపిస్తోంది... కూటమి అధికారం చేపట్టి 16 నెలల కాలం అయ్యింది. ఎన్నికలకు ఇంకా చాలా సమయం ఉంది. ఒకవేళ కూటమి ప్రభుత్వం కక్ష సాధింపు రాజకీయ క్రీడ మొదలు పెడితే మీ పార్టీ కార్యకర్త సహాయం కోసం మరల మీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చే వరకు డిజిటల్ బుక్ చూస్తూ బాధలను భరించాలా..!!

వైసిపి అధినేత జగన్ డిజిటల్ బుక్ వ్యవహారం పై మరోసారి ఆలోచన చేయవలసిన ఆవశ్యకత ఉంది.ఏ పార్టీ అయినా అధికారంలోకి వచ్చిన తర్వాత గత ప్రభుత్వ హయం లో జరిగిన అవినీతి వ్యవహారాలపై చట్టపరమైన చర్యలు తీసుకోవడం ఆక్షేపనీయం కాదు. కానీ అధికారమే పరమావధిగా భావిస్తూ ప్రజా సంక్షేమం మాట పక్కన పెట్టి రెడ్ బుక్, డిజిటల్ బుక్ ల చుట్టూ తిరగడం దేనికి సంకేతం ?

అసలు రాజకీయాల్లో ప్రవేశించిన ఈ బరితెగింపు వ్యవహారాలు ఏంటి? మేము అధికారంలోకి వచ్చిన తర్వాత మిమ్మల్ని ఇది చేస్తాం..ఆది చేస్తాం అని బెదిరించడం, భయపెట్టడం ప్రజాస్వామ్య బద్ధామా..?

ప్రపంచంలోనే అతి పెద్ద ప్రజాస్వామిక దేశం మాది అని రొమ్ము విరిచి చెపుతుంటాం...ఇక్కడ ప్రజలే పాలకులు, ప్రజలే పాలితులు. అయినా ఆ భావనను ప్రజల్లో కల్పించలేకపోతున్నారు నేటి రాజకీయ నేతలు. అంతా మా ఇష్టం, మేమే పాలకులం అంటూ నియంతృత్వ విధానంలో ఆలోచన చేస్తూ ఇటువంటి అరాచక నిర్ణయాలు చేస్తుంటారు. మన దేశానికి పాలనా సౌలభ్యం కోసం, వివిధ వ్యవస్థల సరైన నిర్వహణ ఆవశ్యకత కోసం రాజ్యాంగాన్ని డా బి ఆర్ అంబేద్కర్ సారథ్యంలోని రాజ్యాంగ రచనా కమిటీ రూపొందించింది. దేశంలో పౌరుల హక్కులకు, విధులకు భంగం వాటిల్లి నప్పుడు రాజ్యాంగం వారికి రక్షణ కల్పిస్తుంది. ఆ బాధ్యత అధికారంలో ఉన్న ప్రభుత్వం తీసుకుంటుంది. ఒకవేళ అధికారంలో ఉన్న ప్రభుత్వం బాధితులకు సరైన న్యాయం చేయకపోతే వారు కోర్టులను ఆశ్రయించొచ్చు. మరోవైపు బాధితుల పక్షాన పోరాటం చేయడానికి ప్రతిపక్షం నిలబడాలి, వారికి భరోసా అందించాలి. దీనిని విస్మరించి రెడ్ బుక్ అంటూ ఒకరు, డిజిటల్ బుక్ అంటూ మరొకరు పోటాపోటీగా ప్రకటనలు చేయడం, దీనిపై వేగవంతమైన నిర్ణయాలు తీసుకోవడం ప్రజా శ్రేయస్సు అనిపించుకోదు. ఆ నిర్ణయం శ్రేయస్కరం కాదు. మన దేశం మనకోసం రాజ్యాంగాన్ని ఇచ్చిన తరువాత మరో బుక్




తో మనకు పనేంటి ..? రాజకీయ నాయకులు ప్రజలను భయంకంపితులను చేస్తున్నారనడానికి ఆయా నేతలు చేస్తున్న ఈ ప్రకటనలే నిదర్శనం. ప్రజలను లేదా ఇతర పార్టీల నేతలను భయపెడుతూ రాజ్యాంగాన్ని ధిక్కరిస్తూ వ్యవహరిస్తున్న నేతలపై సుమోటు గా స్పందించి కేసులు బుక్ చేయాల్సిన అవసరం ఉందేమో అనిపిస్తుంది. రాజ్యాంగానికి కట్టుబడి పాలన కొనసాగించేలా అధినేతలు నిర్ణయాలు తీసుకోవాలని, దీనిని విస్మరించి రాజకీయ నాయకులు రెడ్ బుక్ డిజిటల్ బుక్ ల సంప్రదాయాన్ని ప్రజలపై రుద్దకుండా చూడాల్సిన అవసరం న్యాయ స్థానాలపై ఉంది.

**డా జొన్నకూటి ప్రమోద్ కుమార్ 949083310**

# కృష్ణ పోలీస్ స్టేషన్ మరియు బోర్డర్ చెక్పోస్టును ఆకస్మికంగా తనిఖీ చేసిన ఎస్పీ డాక్టర్ వినీత్

**సమయజ్యోతి న్యూస్ కృష్ణ..... నారాయణ పేట జిల్లా**

జిల్లా సరిహద్దు వద్ద శాశ్వత చెక్పోస్టుకు చర్యలు తీసుకుంటామని జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్ అన్నారు.శుక్రవారం కృష్ణ బోర్డర్ చెక్పోస్టును ఆకస్మికంగా తనిఖీ చేసి మాట్లాడుతూ చెక్‌పోస్టు వద్ద నిరంతరం వాహనాల తనిఖీలు నిర్వహించాలని అధికారులకు ఆదేశించారు. అనంతరం కృష్ణ పోలీస్ స్టేషన్‌ను తనిఖీ చేసి పరిసరాలను పరిశీలించి, పోలీస్ స్టేషన్ ఆవరణ పరిశుభ్రంగా ఉంచాలని సూచించారు. జాతీయ రహదారి పై రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవాలని తెలిపారు. పోలీస్ సిబ్బంది నిర్వహిస్తున్న విధులు, కేసుల రికార్డులు, జనరల్ డైరీ, తనిఖీ చేసి సిబంధికి ప్రతిరోజు రోల్ కాల్ తీసుకోవాలని, పక్కాగా విధులు నిర్వర్తించాలని ఆదేశించారు.100 కాల్స్ పట్ల వేగవంతంగా స్పందించాలని కోరారు. పోలీసులు క్రమశిక్షణతో పని చేస్తేనే ప్రజలలో పోలీస్ శాఖపై విశ్వాసం పెరుగుతుందని గుర్తు చేశారు. సరిహద్దుల వద్ద అనుమానాస్పద వాహనాలు వ్యక్తులపై నిఘా ఉంచి అక్రమ వ్యాపారాలు అక్రమ రవాణా వంటి కార్యక్రమాలు అరికట్టడం అత్యవసరమని పేర్కొన్నారు. అలాగే చెక్పోస్ట్ వద్ద పోలీసు బలగాలు సీసీ కెమెరాలు ఏర్పాటు వంటి సదుపాయాలు ఉండేలా చర్యలు చేపడతామని వెల్లడించారు.ఈ తనిఖీల్లో మక్తల్ సీఐ రామ్ లాల్, ఎస్సై ఎస్ఎం నవీద్, పోలీసు సిబ్బంది ఉన్నారు.






# శ్రీశ్రీశ్రీ అంబాత్రయ క్షేత్రంలో అద్భుతంగా ముగిసిన దేవి నవరాత్రి వేడుకలు ....

## సహకారం అందించిన వారికి ఆశీస్సులు ఉంటాయి

## శ్రీశ్రీశ్రీ ఆదిత్య పరాశ్రీ స్వామి



**సమయజ్యోతి న్యూస్ కృష్ణ..... నారాయణ పేట జిల్లా**

ఊట్కూర్ మండలం బీజ్వార్ లోని శ్రీ శ్రీ శ్రీ అంబాత్రయ క్షేత్రంలో ఈ సంవత్సరం దేవి శరన్నవ రాత్రులు చాలా అద్భుతంగా జరిగాయనీ శ్రీ శ్రీ శ్రీ ఆదిత్య పరాశ్రీ స్వామి ఆనందం వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమానికి అధిక సంఖ్య లో భక్తులు తమకు తోచిన విధంగ వస్తూ రూపేణ, ధన రూపేణ, శ్రమ రూపేణ ,సహక రించారని పేర్కొన్నారు. మీడియా వారి సహకారం మరువలేనిదని అమ్మవారి సేవ లో పాల్గొనడం విశేషమని అన్నారు. ఆ భక్తులందరికీ సంపూర్ణ ఆయురారోగ్యాలతో సుఖ సంతోషాలతో వర్ధిల్లాలని కోరుకుంటున్నాననీ అన్నారు. ఆలాగే అమ్మవారి ఆశీస్సులు అందరికీ ఉండాలనీ, నా ఆశీ స్సులు మీపై మీ కుటుంబం పై ఎపుడు ఉంటాయనీ పేర్కొన్నారు.

# దసరా సంబరాల్లో పాల్గొన్న ఎమ్మెల్యే జిఎంఆర్

**సమయజ్యోతి న్యూస్ రామచంద్రాపురం**

దసరా పండుగను పురస్కరించు కొని పటాన్చెరు పట్టణంలోని మైత్రి స్టేడియంలో గురువారం సాయంత్రం నిర్వహించిన దసరా సంబరాల్లో పటాన్చెరు శాసనసభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు జిహెచ్ఎంసి కార్యాలయం వద్ద నిర్వహించిన ధ్వజారోహణ కార్యక్రమంలో పాల్గొని జిహెచ్ఎంసి మల్టీపర్పస్ ఫంక్షన్ హాల్ వద్ద నిర్వహించిన శమీ పూజలో పాల్గొన్నారు అనంతరం స్థానిక ప్రజాప్రతినిధులు పురప్రముఖు లతో కలిసి మైత్రి స్టేడియంలో నిర్వహించిన రావణాసుర దహన కార్యక్రమానికి హాజరయ్యారు ఈ కార్యక్రమంలో పట్టణ పుర ప్రముఖులు పాల్గొన్నారు



# స్వగ్రామంలో కంది శ్రీనివాస రెడ్డి ఫ్యామిలీ దసరా సందడి

**సమయజ్యోతి న్యూస్ ఆదిలాబాద్ :**

హిందూ సంస్కృతీ సాంప్రదాయాలలో అత్యంత ముఖ్యమైన పండగ విజయదశమిని ఆదిలాబాద్ కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ఇంచార్జి కంది శ్రీనివాస రెడ్డి తన కుటుంబ సభ్యులతో కలిసి సంబరంగా జరుపుకున్నారు.ఆదిలాబాద్ పట్టణంలో వేడుకలకు హాజరైన అనంతరం తన స్వగ్రామం తాంసి మండలం హస్నాపూర్ గ్రామానికి చేరుకున్నారు.ఇంటి వద్ద కంది శ్రీనివాస రెడ్డి తన తల్లి దండ్రులకు శమీ పత్రి ఇచ్చి సతీమణితో కలిసి పాదాభివందనం చేసి ఆశీస్సులు తీసుకున్నారు.గ్రామస్తులు ఆయనను కలిసి పండగ శుభాకాంక్షలు తెలిపారు.అనంతరం దేవీ మండపం వద్ద గ్రామ మహిళలు,యువతులు, చిన్నారులు,కుటుంబ సభ్యులతో కలిసి బతుకమ్మ పాటలకు స్టెప్పులేసారు.



# ఆయుధ పూజ చేసిన ఎమ్మెల్యే అనిల్ జాదవ్

**సమయజ్యోతి న్యూస్ అక్టోబర్ 03 బజార్ హత్నూర్**

బోథ్ నియోజకవర్గం వ్యాప్తంగా దసరా పండుగను ఘనంగా జరుపుకుంటున్నారు.ఈ మేరకు విజయదశమి సందర్భంగా బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ నేరడిగోండ నివాసంలో కుటుంబ సమేతంగా ఆయుద పూజ నిర్వహించారు. ఈ ఆయుధ పూజ వెనుక ఒక గొప్ప సందేశం ఉందని, మనకు ఆహారం అందించే హలం, మనం ప్రయాణించే వాహనం, దేశాన్ని కాపాడే ఆయుధం సాధనం ఏదైనా అది దైవస్వరూపమే అని తెలిపారు.



# క్షతగాత్రులను ఆస్పత్రికి తరలించిన ఎమ్మెల్యే అనిల్ జాదవ్

**సమయజ్యోతి న్యూస్ అక్టోబర్ 03 బజార్ హత్నూర్**

నేరడిగొండ మండల కేంద్రంలో పోలీసు స్టేషన్ సమీపంలో కారు బోల్తాపడింది. అటుగా వస్తున్న బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ గమనించి తక్షణమే అంబులెన్స్ ను రప్పించి క్షతగాత్రులను ఆస్పత్రికి తరలించారు. రోడ్డు ప్రమాదానికి గల కారణాలను తెలుసుకొని కార్యకర్తలతో కారును పక్కకు జరిపించారు.



# అలయ్ బలయ్ సోదరభావం పెంపొందించే వేడుక ప్రశంసిస్తూ రాష్ట్రపతి ముర్ము ప్రకటన

**న్యూఢిల్లీ,అక్టోబర్3( సమయజ్యోతి):**

హర్యానా మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ ఏటా నిర్వహిస్తున్న అలయ్ బలయ్ కార్యక్రమాన్ని రాష్ట్రపతి ద్రౌపదీముర్ము ప్రశంసించారు. సోదరభావాన్ని పెంపొందించే వేడుక 'అలయ్ బలయ్' అని రాష్ట్రపతి ద్రౌపదీముర్ము అన్నారు. హైదరాబాద్‌లో నేడు ఈ పండుగ ఎంతో ఉత్సాహంగా నిర్వహించనున్నారని తెలిసి సంతోషించానని పేర్కొన్నారు. హరియాణా మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ ఏటా అలయ్ బలయ్ నిర్వహిస్తున్న సంగతి తెలిసిందే. ఈనేపథ్యంలో తెలంగాణ ప్రజలకు అభినందనలు తెలుపుతూ రాష్ట్రపతి సందేశమిచ్చారు. తెలంగాణ ఆచారాలను పునరుజ్జీవింప జేయడానికి బండారు దత్తాత్రేయ అలయ్ బలయ్ పండుగను ప్రారంభించారు. ఇది సోదరభావాన్ని పెంపొందించే వార్షిక సాంస్కృతిక ఉత్సవం. అన్నివర్గాల ప్రజలను ఒక్కచోట చేర్చి తెలంగాణకు చెందిన గొప్ప సంస్కృతిని ప్రదర్శిస్తోంది. ప్రజల్లో ఐక్యత, సమాజ విలువలను వ్యాప్తి చేసేందుకు ఓ సామాజిక సమావేశంగా ఇది ఉపయోగపడుతోంది. అలయ్ బలయ్ వేడుకలు ఘనంగా జరగాలని కోరుకుంటున్నానని రాష్ట్రపతి పేర్కొన్నారు.

పాక్ ఉగ్రవాదాన్ని ఎగదోస్తే గట్టి సమాధానం

# స్థానిక ఎన్నికల్లో సత్తా చాటుతాం

## -కాంగ్రెస్, బిఆర్ఎస్‌లకు బుద్ధి చెబుతాం-కరీంనగర్, సిరిసిల్లలపై బిజెపి జెండా ఎగరేస్తాం

## -కేంద్రమంత్రి బండి సంజయ్ ధీమా

**కరీంగనర్,అక్టోబర్3( సమయజ్యోతి):**

స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలను ప్రజలు గట్టిగా ఓడించేందుకు ఎదురు చూస్తున్నారని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ స్పష్టం చేశారు. కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోని మండలాధ్యక్షులు, జడ్పీటీసీ ప్రభారీలతో జరిగిన సమావేశంలో ఆయన పాల్గొని కీలక వ్యాఖ్యలు చేశారు. కరీంనగర్ జిల్లా పరిషత్ పీఠంపై కాషాయ జెండా ఎగరేయడం ఖాయమని, సిరిసిల్ల జడ్పీ పీఠం కూడా ఈసారి బీజేపీ ఖాతాలో చేరబోతోందని ధీమా వ్యక్తం చేశారు. ఈ ఎన్నికలు జరగాలని ప్రజలు ఎంతగానో ఎదురుచూస్తున్నారని సంజయ్ తెలిపారు. 'కాంగ్రెస్, బీఆర్ఎస్ పాలనలో పంచాయతీలు నిర్వీర్యమయ్యాయి. నిధులేమీ లేక అభివృద్ధి పనులు ఆగిపోయాయి. గ్రామాల్లో సర్పంచులు అప్పులపాలై ఆత్మహత్యలు చేసుకోవాల్సిన దుస్థితి ఏర్పడింది. చాలా మంది అప్పులు తీరచేయలేక ఊళ్లను వదిలి నగరాలకు వలస వెళ్ళారు. ప్రజలు కాంగ్రెస్, బీఆర్ఎస్ లపై తీవ్ర ఆగ్రహంతో ఉన్నారు. ఇప్పుడు బీజేపీని అధికారంలోకి తెచ్చి అభివృద్ధి దిశగా నడిపించేందుకు ప్రజలంతా కసరత్తు చేస్తున్నారని అన్నారు. మహిళలు, రైతులు, విద్యార్థులు, నిరుద్యోగులు, వృద్ధులు, తాజా మాజీ సర్పంచులు, ఉద్యోగులే ఈసారి బీజేపీ బ్రాండ్ అంబాసిడర్లుగా నిలుస్తారని బండి సంజయ్ పేర్కొన్నారు. కాంగ్రెస్ పాలనలో ఈ వర్గాలందరికీ అన్యాయం జరిగింది. హామీలు ఇచ్చి ఒక్కటినీ అమలు చేయలేదు. మహిళలకు నెలనెలా 2500 రూపాయలు, వృద్ధులకు పెన్షన్ పెంపు, రైతులకు రైతు భరోసా, నిరుద్యోగులకు ఉద్యోగాలు, విద్యార్థులకు భరోసా కార్డులు ? అన్నీ మోసమే అయ్యాయి. ఈసారి ఈ వర్గాలే కాంగ్రెస్ కు బుద్ధి చెప్పబోతున్నారని మండిపడ్డారు. అభ్యర్థుల టిక్కెట్ల విషయంలో బీజేపీ ప్రత్యేక శ్రద్ధ చూపుతోందని, రాష్ట్ర నాయకత్వం సర్వేలు నిర్వహిస్తోందని సంజయ్ తెలిపారు. గెలిచే అవకాశం ఉన్న వారికే టిక్కెట్లు ఇస్తాం. టిక్కెట్ రాకపోయినా బాధపడొద్దు. పార్టీ పదవుల రూపంలో గౌరవం, సహాయం అందిస్తాం. కానీ పార్టీ నిర్ణయించిన అభ్యర్థుల గెలుపు కోసం అందరూ కష్టపడాలి. పార్టీకి వ్యతిరేకంగా పనిచేయడం కన్నతల్లికి ద్రోహం చేసినట్లే. అలాంటి వారిపై కఠినంగా వ్యవహరిస్తామని హెచ్చరించారు.గ్రామాల్లో జరుగుతున్న అన్ని అభివృద్ధి కార్యక్రమాలు కేంద్ర నిధులతోనే సాధ్యమయ్యాయని సంజయ్ గుర్తుచేశారు. ఉపాధి హామీ పనులు, ప్రధాని సడక్ యోజన, సీఐఆర్ఎఫ్ నిధులతో రహదారులు, కమ్యూనిటీ హాళ్లు, బోర్లు ఇవన్నీ మోదీ ప్రభుత్వం ఇచ్చిన నిధుల వల్లే సాధ్యమయ్యాయి. కాంగ్రెస్ పాలనలో పంచాయతీలకు ఒక్క పైసా కూడా రాలేదు. బీఆర్ఎస్ గెలిచినా పరిస్థితి మారదు. గ్రామాల అభివృద్ధి బీజేపీతోనే సాధ్యం అని ధీమా వ్యక్తం చేశారు. ఈ



సమావేశంలో పాల్గొన్న స్థానిక నాయకులు, సిరిసిల్ల జిల్లా నాయకుడు సురేందర్ రావు సహా పలువురు నేతలు బండి సంజయ్ నాయకత్వంపై విశ్వాసం వ్యక్తం చేశారు.

# అలయ్ బలయ్‌కు ప్రముఖుల రాక

## తెలంగాణ వంటకాలతో రుచి

**హైదరాబాద్,అక్టోబర్ 3( సమయజ్యోతి):**

హైదరాబాద్ నాంపల్లి ఎగ్జిబిషన్ మైదానంలో హరియాణా మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ కుమార్తె విజయలక్ష్మి ఆధ్వర్యంలో 'అలయ్ బలయ్' ప్రారంభమైంది. ఏటా దసరా మర్నాడు ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నారు. దీనికి పలువురు ప్రముఖులు హాజరయ్యారు.మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు, తెలంగాణ గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ, మాజీ గవర్నర్ విద్యాసాగర్‌రావు, మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, సుప్రీంకోర్టు విశ్రాంత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎన్వీ రమణ, భాజపా ఎంపీ లక్ష్మణ్, ప్రముఖ సినీనటులు నాగార్జున, బ్రహ్మానందం, ఎమ్మెల్యే సుజనాచౌదరి, సీపీఐ నేత నారాయణ, తెజస నేత ప్రొఫెసర్ కోదండరామ్, మాజీ ఎంపీ వి.హనుమంతరావు, ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకుడు మందకృష్ణ మాదిగ, కల్వకుంట్ల కవిత తదితరులు హాజరయ్యారు. దత్తాత్రేయ వారికి కండువాలు వేసి స్వాగతం పలికారు. తెలంగాణ ఉద్యమ సమయంలో రాజకీయ నాయకుల మధ్య ఐక్యత కోసం దత్తాత్రేయ ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. తెలంగాణ సంస్కృతి, ఆహారపు అలవాట్లను చాటిచెప్పేలా అలయ్ బలయ్ మొదలైంది. ఎంతో ఉత్సాహంగా సాగింది. తెలంగాణ వంటలను ఆహుతులకు రుచి చూపించారు.

# మద్యం విక్రయాలకు దసరా కిక్కు

## పండగతో భారీగా అమ్మకాలు

**హైదరాబాద్,అక్టోబర్ 3( సమయజ్యోతి):**

తెలంగాణలో మద్యం విక్రయాలు భారీగా పెరిగాయి. దసరా కిక్కు ఇచ్చింది. అక్టోబర్ 2న దసరా రావడంతో ముందస్తుగానే 30, 1 తేదీల్లో భారగా మద్యం విక్రాయలు జరిగాయి. ఈ ఏడాది సెప్టెంబరులోనే రూ.3,046 కోట్ల మేర మద్యం అమ్మకాలు జరిగాయని ఎక్సైజ్ అధికారులు తెలిపారు. ఈ ఏడాది సెప్టెంబరు 29న రూ.278 కోట్లు, 30న రూ.333 కోట్లు, అక్టోబర్ 1న రూ.86.23 కోట్ల మద్యం అమ్మకాలు జరిగాయి. గతేడాదితో పోలిస్తే ఈ 3 రోజుల్లోనే 60 నుంచి 80శాతం వరకు అమ్మకాలు పెరిగాయి. ఈ ఏడాది ఇప్పటి వరకు.. రాష్ట్ర వ్యాప్తంగా 29.92 లక్షల కేసుల లిక్కర్, 36.46 లక్షల కేసుల బీర్లు విక్రయించారు. గతేడాదితో పోలిస్తే 7శాతానికిపైగా మద్యం విక్రయాలు పెరిగాయి. మద్యం సేల్స్ పెరగడంతో ఎక్సైజ్ శాఖకు రాబడి పెరిగింది.

# రక్షణశాఖ భూములు అప్పగించండి

## -హైదరాబాద్ అభివృద్ధికి అవే కీలకం-కంటోన్మెంట్ బకాయిలు కూడా చెల్లించండి

## -కేంద్రమంత్రి రాజ్‌నాథ్ సింగ్‌కు పొన్నం వినతి

**హైదరాబాద్,అక్టోబర్3( సమయజ్యోతి):**

హైదరాబాద్ నగరంలోని రక్షణశాఖ భూములను రాష్ట్ర ప్రయోజనాల కోసం ఉపయోగించేందుకు అనుమతివ్వాలని మంత్రి పొన్నం ప్రభాకర్.. కేంద్ర రక్షణశాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్‌ను కోరారు. జీహెచ్ఎంసీ మేయర్ గద్వాల విజయలక్ష్మి, రాజ్యసభ సభ్యుడు అనిల్ కుమార్ యాదవ్, సికింద్రాబాద్ కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణెళిశ్ సంతకాలతో కూడిన వినతిపత్రాన్ని హైదరాబాద్‌లో రాజ్‌నాథ్ సింగ్‌కు మంత్రి పొన్నం అందజేశారు. హైదరాబాద్‌కు వచ్చిన రాజ్‌నాథ్‌కు ఆయన ఘనంగా స్వాగతం పలికారు. అదే సమయంలో వినతి పత్రాన్ని పరిశీలించి తగు నిర్ణయం తీసుకుంటారని పొన్నం ఆశాభావం వ్యక్తం చేశారు. జంట నగరాల్లో ప్రజలకు కీలకమైన మౌలిక సదుపాయాలు కల్పించడంలో రక్షణ శాఖ భూములు ఎంతో ఉపయోగపడతాయని, కంటోన్మెంట్ నుంచి తెలంగాణ ప్రభుత్వానికి యూజర్ ఛార్జీల కింద వచ్చే దాదాపు రూ.వెయ్యి కోట్లు పెండింగ్‌లో ఉన్నాయని రక్షణమంత్రి దృష్టికి తీసుకెళ్లారు. ఆ బకాయిలను సకాలంలో విడుదల చేయడం వల్ల రక్షణ శాఖ పరిధిలో అభివృద్ధి చెందుతున్న ప్రాంతాలలో ప్రజలకు మౌలిక సదుపాయాలు కల్పించడం, అవసరమైన పౌర సేవలు కొనసాగించడంలో రాష్ట్ర ప్రభుత్వానికి మద్దతు లభిస్తుందని పొన్నం వివరించారు. ప్రజా వినియోగం కోసం




కొన్ని రక్షణ భూములను ఇవ్వడానికి అంగీకరించినందుకు భారత ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలుపుతున్నట్లు పేర్కొన్న మంత్రి పొన్నం.. ఈ భూములను అప్పగించే ప్రక్రియను వేగవంతం చేయాలని కోరారు. సికింద్రాబాద్ కంటోన్మెంట్ బోర్డు ఎన్నికలు వీలైనంత త్వరగా నిర్వహించేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని రాజ్‌నాథ్ సింగ్‌కు అందించిన వినతి పత్రంలో పొన్నం అభ్యర్థించారు. మంత్రి పొన్నం తన లేఖలో రక్షణ శాఖ భూములను ప్రజా ప్రయోజనాల కోసం తెలంగాణ ప్రభుత్వానికి కేటాయించేందుకు కేంద్రం సానుకూలంగా ముందుకు రావడంపై ధన్యవాదాలు తెలిపారు. భూమి అప్పగింపు ప్రక్రియను వేగవంతం చేయాలని కోరారు. నగరాభివృద్ధి, పౌర సౌకర్యాల కోసం జరుగుతున్న మౌలిక సదుపాయాలు, మొబిలిటీ ప్రాజెక్టులకు ఈ భూమార్పిడి అత్యవసరమని గుర్తు చేశారు. అదే విధంగా, గత కొంతకాలంగా సికింద్రాబాద్ కంటోన్మెంట్ బోర్డు ఎన్నికలు జరగకపోవడంపై ఆందోళన వ్యక్తం చేస్తూ, ప్రజాస్వామ్య పరిరక్షణ దృష్ట్యా ఎన్నికలు త్వరితగతిన నిర్వహించాలంటూ రక్షణ మంత్రిని అభ్యర్థించారు. హైదరాబాద్ అభివృద్ధి దిశలో రక్షణ శాఖ అవసరమైన చర్యలు తీసుకుంటుందనే విశ్వాసం తనకుందని మంత్రి పొన్నం ప్రభాకర్ లేఖలో పేర్కొన్నారు.

# పెదనాన్న లైంగిక వేధింపులు.. యువతి ఆత్మహత్య

**మేడ్చెల్,అక్టోబర్ 3( సమయజ్యోతి):**

మేడ్చల్ మల్కాజ్ గిరి జిల్లా కుత్బుల్లాపూర్ మండలంలో పెద్దనాన్న లైంగికంగా వేధించడంతో ఇంటర్ విద్యార్థిని ఆత్మహత్య చేసుకుంది. కొంపల్లిలోని పోచమ్మగడ్డలో ఓ విద్యార్థిని ఇంటర్ సెకండియర్ చదువుతోంది. సొంత పెద్దనాన్న నుంచి లైంగిక వేధింపులు ఎక్కువ కావడంతో ఆ యువతి సూసైడ్ నోట్ రాసి ఆత్మహత్య చేసుకుంది. పేట్ బషీరాబాద్ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# అందుబాటులోకి ఫలక్‌నుమా ఆర్‌వోబి

## మేయర్‌తో కలసి ప్రారంభించిన మంత్రి పొన్నం

**హైదరాబాద్,అక్టోబర్3( సమయజ్యోతి):**

హైదరాబాద్ నగరంలో మరో వంతెన అందుబాటులోకి వచ్చింది. ఫలక్‌నుమా ఆర్వోబీని మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రారంభించారు. రూ. 52.03 కోట్లతో ఫలక్‌నుమా ఆర్వోబీని ప్రభుత్వం నిర్మించింది. కార్యక్రమంలో ఎంపీ అసదుద్దీన్, మేయర్ విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు. చాంద్రాయణగుట్ట నియోజకవర్గంలో, హైదరాబాద్‌లోని పాతబస్తీ వాసుల ట్రాఫిక్ కష్టాలను తీరుస్తూ ఫలక్‌నుమా రోడ్ ఓవర్ బ్రిడ్జి అందుబాటులోకి వచ్చింది. ఫలక్‌నుమా రైల్వే ట్రాక్‌పై ఇదివరకు ఉన్న పాత బ్రిడ్జి ఇరుకుగా మారడం, దానిపై ట్రాఫిక్ రద్దీ విపరీతంగా పెరగడంతో జీహెచ్ఎంసీ దీనికి సమాంతరంగా కొత్తగా మరో బ్రిడ్జిని నిర్మించింది. రూ. 52 కోట్ల 3 లక్షల వ్యయంతో, 360 మీటర్ల పొడవుతో రెండు లైన్లుగా ఈ కొత్త రోడ్ ఓవర్ బ్రిడ్జి నిర్మాణం పూర్తయింది. మొదట నిర్మించిన ఆర్‌ఓబీ కేవలం రెండు లైన్లు మాత్రమే ఉండడంతో ఏర్పడే ట్రాఫిక్ జామ్‌లను తగ్గించేందుకు బల్దియా ఈ రెండు కొత్త లైన్లను నిర్మించింది. ఈ బ్రిడ్జిని ప్రారంభించడంతో, కొంతకాలంగా ఫలక్‌నుమా నుంచి చాంద్రాయణ గుట్టతో సహా ఇతర ప్రాంతాలకు వెళ్లే పాతబస్తీ ప్రయాణికులకు ఊరట లభించింది. ఫలక్‌నుమా కరెంట్ ఆఫీస్ నుంచి కొత్తగా అందుబాటులోకి వచ్చిన ఈ రోడ్ ఓవర్ బ్రిడ్జి వల్ల చాంద్రాయణ గుట్ట జంక్షన్ నుంచి ఫలక్ నుమా బస్ డిపో వరకు ట్రాఫిక్ రద్దీ గణనీయంగా తగ్గే అవకాశం ఉంది.





# ప్రపంచపటంలో పేరు లేకుండా చేస్తాం

## ఆర్మీ చీఫ్ జనరల్ ఉపేంద్ర ద్వివేది హెచ్చరిక

**న్యూఢిల్లీ,అక్టోబర్3( సమయజ్యోతి):**

ఉగ్రవాదాన్ని పెంచి పోషిస్తున్న దాయాది దేశం పాకిస్థాన్ కు ఆర్మీ చీఫ్ జనరల్ ఉపేంద్ర ద్వివేది శుక్రవారం నాడు దిమ్మతిరిగే వార్నింగ్ ఇచ్చారు. భారత్‌లో ఉగ్రవాదాన్ని స్పానర్స్ చేసే చర్యలను పాక్ మానుకోకుంటే ఆ దేశం ప్రపంచ పటం నుంచి కనుమరుగవుతుందని హెచ్చరించారు. భారత బలగాలు ఆపరేషన్ సిందూర్లో చూపించిన సంయమనాన్ని ప్రతిసారీ చూపించలేవని అన్నారు. ఈసారి నిర్ణయాత్మక, అత్యంత శక్తివంతమైన సమాధానం ఇస్తుందని చెప్పారు. 'ఆపరేషన్ సిందూర్ 1.0లో చూపిన సంయమనాన్ని ఈసారి చూపించం. ప్రపంచ పటంలో ఉండాలనుకుంటోందో, లేదో తేల్చుకునేలా ఈసారి పాకిస్థాన్‌కు గట్టి సమాధానం ఉంటుంది. ప్రపంచ పటంలో పాక్ ఉండదలిస్తే మాత్రం ఉగ్రవాదాన్ని స్పాన్సర్ చేయడం ఆపితీరాలి' అని జనరల్ ద్వివేది అన్నారు. బికనీర్ మిలట్రీ స్టేషన్‌తో సహా పలు ఫార్వార్డ్ ఏరియాల్లో శుక్రవారం నాడు ఉపేంద్ర ద్వివేది పర్యటించారు. బలగాల సన్నద్ధతను అంచనా వేసేందుకు ఆయన ఈ పర్యటన చేపట్టారు. మిలట్రీ సీనియర్ అధికారులు, వెటరన్స్, సివిల్ డిగ్నటరీలతో ఆయన సమావేశం అయ్యారు. ఆధునికీకరణ, యుద్ధ సన్నాహకాలు, అడ్వాన్సింగ్ టెక్నలాజికల్ సామర్థ్యాలు, ఆపరేషనల్ ఎక్స్‌లెన్స్‌కు ఆర్మీ కృతనిశ్చయంతో ఉందని ఈ సందర్భంగా ఆయన పేర్కొన్నారు

# ఉత్తరాంధ్రలో భారీ వర్షాలు, వరద పరిస్థితులు

## కలెక్టర్లతో సమీక్షించిన సిఎం చంద్రబాబు

## నలుగురు మృతి..పరిహారం ప్రకటించిన బాబు

**అమరావతి,అక్టోబర్3( సమయజ్యోతి):**

ఉత్తరాంధ్రలో భారీ వర్షాలు, వరద పరిస్థితులపై ముఖ్యమంత్రి చంద్రబాబు సమీక్ష నిర్వహించారు. శ్రీకాకుళం, విజయనగరం, విశాఖ తదితర జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ప్రస్తుతం జిల్లాల్లో ఉన్న పరిస్థితులను సీఎం అడిగి తెలుసుకున్నారు. గొట్టా బ్యారేజీకి 1.89 లక్షల క్యూసెక్కులు, తోటపల్లికి 44 వేల క్యూసెక్కుల వరద వస్తోందని శ్రీకాకుళం కలెక్టర్ వివరించారు. ఒడిశాలోని వివిధ ప్రాంతాల్లో పడిన భారీ వర్షాల కారణంగా వంశధారకు 1.05 లక్షల క్యూసెక్కుల నీరు వస్తోందన్నారు. భారీ వర్షాలు, ప్రమాదాల కారణంగా నలుగురు మృతి చెందినట్లు అధికారులు సీఎం దృష్టికి తీసుకురాగా.. ఆయన విచారం వ్యక్తం చేశారు. విశాఖ నగరం కంచరపాలెంలో ఒకరు, శ్రీకాకుళం జిల్లా మందసలో ఇద్దరు, పార్వతీపురం మన్యం జిల్లా కురుపాంలో ఒకరు మృతి చెందినట్లు తెలిపారు. బాధిత కుటుంబాలకు రూ.4 లక్షల చొప్పున పరిహారం ఇవ్వాలని అధికారులను సీఎం ఆదేశించారు. ప్రస్తుతం ఉత్తరాంధ్ర జిల్లాల్లో వర్షం లేదని, ఎగువ నుంచి వస్తున్న ప్రవాహాలతో నదుల్లో వరద ఉందన్నారు. భారీ వర్షాల కారణంగా కొన్ని చోట్ల చెట్లు కూలాయని, ఇప్పటికే 90 శాతం కూలిన చెట్లను తొలగించామని చెప్పారు. ఉత్తరాంధ్ర జిల్లాల్లో దాదాపు 90 శాతం మేర విద్యుత్ సరఫరాను పునరుద్ధరించామని ఈపీడీసీఎల్ అధికారులు వెల్లడించారు. ఇవాళ సాయంత్రం లోగా అన్ని ప్రాంతాల్లోనూ విద్యుత్ సరఫరా పునరుద్ధరించాలని సీఎం అధికారులను ఆదేశించారు

# సిఎం బందోబస్తుకు వెళుతుండగా డీఎస్పీకి ప్రమాదం

జడ్చర్ల,అక్టోబర్ 3( సమయజ్యోతి):

తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పర్యటన నేపథ్యంలో బందోబస్తుకు వెళ్తుండగా మహబూబ్‌నగర్ డీఎస్పీ వెంకటేశ్వర్లు ప్రమాదానికి గురయ్యారు. ఈ ఘటనలో డీఎస్పీ స్వల్ప గాయాలతో బయటపడగా.. ఆయన డ్రైవర్‌కు తీవ్ర గాయాలయ్యాయి. జడ్చర్ల మండలం గంగాపూర్ సమీపంలో డీఎస్పీ వాహనాన్ని లారీ ఢీకొట్టింది. దీంతో, పోలీస్ వాహనంలో ప్రయాణిస్తున్న డీఎస్పీ, డ్రైవర్ గాయపడ్డారు. ఈ ఘటనలో పోలీసు వాహనం ధ్వంసమైంది. జడ్జర్ల ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న డీఎస్పీని ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి పరామర్శించారు. తీవ్ర గాయాలపాలైన కానిస్టేబుల్ ను మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌లోని ఆస్పత్రికి తరలించారు.

# ఏడుపాయలలో తగ్గని మంజీరా ఉధృతి

మెదక్,అక్టోబర్ 3( సమయజ్యోతి):

మెదక్ జిల్లా ఏడుపాయలలో మంజీరా నది ఉధృతి కొనసాగుతోంది. దీంతో వన దుర్గామాత ఆలయాన్ని ఆనుకుని భారీగా వరదనీరు ప్రవహిస్తోంది. రాజగోపురంలో అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని ఏర్పాటు చేసి నిత్య పూజలు చేస్తున్నారు. వనదుర్గ ఆనకట్ట నుంచి 1.09లక్షల క్యూసెక్కుల వరదనీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. దసరా సందర్భంగా భక్తులు రాకుండా కట్టడి చేశారు. నది పరివాహకం నుంచే భక్తులు దండాలు పెట్టుకుని వెళ్లారు.

# దాండియా వద్ద రెండు గ్రూపుల ఘర్షణ

## పలువురు యువకులకు కత్తి గాయాలు

కామారెడ్డి,అక్టోబర్ 3( సమయజ్యోతి):

జిల్లా కేంద్రంలో అర్ధరాత్రి కత్తిపోట్ల కలకలం రేపాయి. స్థానికంగా ఏర్పాటు చేసిన శాస్త్రి దుర్గామాత దాండియా వద్ద రెండు గ్రూపుల మధ్య ఘర్షణ చోటుచేసుకుంది. ఈ నేపథ్యంలో మద్యం మత్తులో ఉన్న యువకులు ఒకరిపై ఒకరు పరస్పరం కత్తులతో దాడి చేసుకున్నారు. ఈ దాడిలో ఐదుగురు యువకులకు చేతులు, పొట్ట, వీపు భాగలలో గాయాలయ్యాయి. వెంటనే స్థానికులు పోలీసులకు సమచారం అందించారు. సమాచారం అందుకన్న పోలీసులు వెంటనే సంఘటనా స్థలానికి చేరుకుని రెండు గ్రూపులను చెదరగొట్టారు. అనంతరం గాయపడిన యువకులను చికిత్స నిమిత్తం కామారెడ్డి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. గాయపడ్డ వారిని రాహుల్, మణిరాజు, మణికంఠ, కిరణ్, బాలాజీలుగా గుర్తించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు వెల్లడించారు. ఈ ఘటన స్థానికంగా తీవ్ర కలకలం రేపింది. దీంతో స్థానికులు.. భయాందోళనకు గురయ్యారు.

# దామోదర్ రెడ్డికి సిఎం రేవంత్ నివాళి

## కాంగ్రెస్ పెద్ద నాయకుడిని కోల్పోయిందని వెల్లడి

హైదరాబాద్,అక్టోబర్ 3( సమయజ్యోతి):

మాజీ మంత్రి రాంరెడ్డి దామోదర్‌రెడ్డి భౌతికకాయానికి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, పలువురు కాంగ్రెస్ నాయకులు నివాళులు అర్పించారు. హైదారాబాద్‌లోని ఏఐజీ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ దామోదర్‌రెడ్డి బుధవారం రాత్రి మృతిచెందారు. ప్రజల సందర్శనార్థం ఇవాళ జూబ్లీహిల్స్‌లోని ఆయన నివాసంలో భౌతికకాయాన్ని ఉంచారు.దామోదర్‌రెడ్డి భౌతికకాయానికి నివాళులు అర్పించి, ఆయన కుటుంబ సభ్యులను సీఎం పరామర్శించారు. నివాళులర్పించిన వారిలో సీఎం సలహాదారు వేం నరేందర్ రెడ్డి, రైతు కమిషన్ ఛైర్మన్ కోదండ రెడ్డి తదితరులు ఉన్నారు. దామోదర్ రెడ్డి, తాను ఒకేసారి ఎమ్మెల్యేలుగా ఎన్నికై అసెంబ్లీలో అడుగుపెట్టామని, ప్రజా సమస్యలపై అలుపెరగని పోరాటం చేశారని కోదండరెడ్డి కొనియాడారు. చిన్న చిన్న ఆరోగ్య సమస్యలు ఉన్నాయని... కోలుకుని తిరిగి పార్టీలో ఉంటారని తాము భావించామన్నారు. ఆయన మృతి ఉమ్మడి నల్గొండ జిల్లాకే కాదు తెలంగాణ రాష్ట్రానికి తీరని లోటని పేర్కొన్నారు. గత కొంతకాలంగా అనారోగ్యంతో చికిత్స పొందుతున్న ఆయన హైదరాబాద్‌లోని ఒక ప్రైవేట్ ఆస్పత్రిలో బుధవారం రాత్రి తుదిశ్వాస విడిచారు. ఖమ్మం జిల్లా, లింగాల గ్రామంలో జన్మించిన దామోదర్ రెడ్డి ఉమ్మడి రాష్ట్రంలో నల్గొండ జిల్లా, తుంగతుర్తి నియోజకవర్గం నుంచి నాలుగు పర్యాయాలు ఎంఎల్‌ఏగా ఎన్నికయ్యారు. సూర్యాపేట నుంచి ఒక పర్యాయం ఎంఎల్‌ఏగా విజయం సాధించారు. 2023 చివరలో జరిగిన ఎన్నికల్లో సూర్యాపేట నియోజకవర్గంలో నుంచి పోటీ చేసి స్వల్ప తేడాతో ఓటమిపాలయ్యారు. దామోదర్‌రెడ్డిని ఆయన అభిమానులు 'టైగర్' అని ముద్దుగా పిలుచు కుంటారు. ఆయన అంత్యక్రియలు తుంగతుర్తి నియోజకవర్గం కేంద్రంలో ఈ నెల 4వ తేదీన నిర్వహించనున్నట్లు కాంగ్రెస్ వర్గాలు వెల్లడించాయి. దామోదర్ రెడ్డి పార్థివదేహాన్ని కడసారి సందర్శించేందుకు సూర్యాపేటలోని ఆయన నివాసంలో ఏర్పాటు చేస్తున్నారు. దామోదర్ రెడ్డి మరణం పట్ల సిఎం రేవంత్‌రెడ్డి దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తూ, ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు. ఆయన మరణం కాంగ్రెస్ పార్టీకి తీరని లోటని అన్నారు.



# వాయుగండ ప్రభావంతో వంశధారాకు భారీగా వరద

## మూడో ప్రమాద హెచ్చరిక జారీచేసినట్లు కలెక్టర్ వెల్లడి

శ్రీకాకుళం,అక్టోబర్ 3( సమయజ్యోతి):

తీవ్ర వాయుగుండం కారణంగా కురుస్తున్న వర్షాలతో వంశధార నదిలోకి వరదనీరు భారీగా చేరుతోంది. శ్రీకాకుళం జిల్లా హిరమండలంలోని గొట్టా బ్యారేజీ వద్ద వంశధార ఉధృతంగా ప్రవహిస్తోంది. ఒడిశాలోని అరబంగి, బడనాలా రిజర్వాయర్ల నుంచి నీరు విడుదల చేయడంతో నదిలోకి వరద భారీగా వస్తోంది. గొట్టా బ్యారేజీ నుంచి 1.04లక్షల క్యూసెక్కుల వరదనీరు దిగువకు ప్రవహిస్తోంది. ఈ నేపథ్యంలో మూడో ప్రమాద హెచ్చరికను జారీ చేసినట్లు జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ తెలిపారు. నదీపరివాహక ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ సూచించారు. ఎప్పటికప్పుడు సమాచారాన్ని అధికారులు తెలియజేయాలని ఆయన ఆదేశించారు. మరోవైపు జిల్లాలోని పాతపట్నం వద్ద మహేంద్రతనయ నదిలో నీటి ప్రవాహం పెరుగుతోంది. దీంతో పట్టణంలోని ఆర్టీసీ కాంప్లెక్స్ శివారు మహేంద్రనగర్ వీధిలోకి వరదనీరు చేరింది. పాతపట్నంలో చేపట్టాల్సిన చర్యలపై అధికారులకు జిల్లా కలెక్టర్ ఆదేశాలు జారీ చేశారు. వంశధార నదిలో పెరిగిన వరద కారణంగా భామిని మండలం కీసరలో 300ఎకరాల్లో పంటలు నీటమునిగాయి. బూర్జ మండలంలో నారాయణపురం, చిన్నలంకాం పరిధిలో చాలా చోట్ల పంటపొలాలు ముంపులో ఉన్నాయి.

# బాపూఘాట్ వద్ద గాంధీజయంతి వేడుకలు

## నివళి అర్పించిన గవర్నర్, సిఎం తదితరులు

హైదరాబాద్,అక్టోబర్ 3( సమయజ్యోతి):

జాతిపిత మహాత్మా గాంధీ జయంతి సందర్భంగా హైదరాబాద్ లంగర్ హౌస్ లోని బాపూఘాట్ వద్ద గవర్నర్ జిష్ణు దేవ్ వర్మతో కలిసి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పుష్పాంజలి ఘటించారు. బాపూఘాట్ వద్ద నివాళులు అర్పించిన వారిలో శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్, టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, తదితరులు ఉన్నారు. ఈ సందర్భంగా బాపూఘాట్ వద్ద సర్వమత ప్రార్థనల్లో గవర్నర్ పాల్గొన్నారు. దసరా రోజు కూడా కావడంతో గవర్నర్ తదితరులు పాల్గొని శుభకాంక్షలు తెలిపారు.





# మారుతున్న కాలనుగుణంగా కొత్త చట్టాలు

## - కీలకం కానున్న రానున్న మూడేళ్లు-కేంద్రమంత్రి కిషన్ రెడ్డి వెల్లడి





హైదరాబాద్,అక్టోబర్3( సమయజ్యోతి):

మారుతున్న సమాజానికి అనుగుణంగా చట్టాలు తీసుకుని వచ్చే ఆలోచనలో ప్రధాని మోడీ ఉన్నారని, పాతచట్టాలకు పాతరేయాల్సి ఉందని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి వ్యాఖ్యానిం చారు. ఇంకా బ్రిటిష్ కాలం నాటి చట్టాలు కొనసాగడం దురదృష్టకరమన్నారు. కేంద్ర ప్రభుత్వానికి వచ్చే మూడేళ్లు చాలా కీలకమని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి వ్యాఖ్యానించారు. ప్రతి శాఖ అనేక సంస్కరణలు తీసుకువస్తోందని చెప్పుకొచ్చారు. కొత్త సమస్యలు వచ్చే అవకాశం ఉందని... వాటిని సమర్థవంతంగా ఎదుర్కొవాలని సూచించారు. బ్రిటిష్ చట్టాలు ఇప్పటికీ అమలు అవుతున్నాయని తెలిపారు. వర్తమాన ప్రజల ఆలోచనలకు అను గుణంగా చట్టాలు తేవాలని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఆలోచిస్తున్నారని చెప్పు కొచ్చారు. శుక్రవారం హైదరాబాద్‌లోని బీజేపీ స్టేట్ ఆఫీస్‌లో ఆ పార్టీ స్టేట్ లీగల్ సెల్ సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా కేంద్ర న్యాయ శాఖ మంత్రి అర్జున్ రామ్ మేఘవాల్, కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి హాజరయ్యారు. ఈ సమావేశంలో బీజేపీ తెలంగాణ చీఫ్ రాంచందర్ రావు, ఎంపీలు కె.లక్ష్మణ్, రఘునందన్ రావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కిషన్‌రెడ్డి మాట్లాడారు. అర్జున్ రామ్ మేఘవాల్ ఐఏఎస్‌గా ఉన్నప్పటికీ రాజీనామా చేసి కేంద్ర మంత్రి స్థాయికి ఎదిగారని ప్రశంసించారు. బీజేపీ శ్రేణులు కేంద్ర ప్రభుత్వ ఇమేజ్ పెంచే ప్రయత్నం చేయాలని దిశానిర్దేశం చేశారు. కేంద్రం పాలసీలకు అనుగుణంగా కోర్టుల్లో మనం వాదిస్తామనేది చాలా కీలకమని తెలిపారు. రానున్న మూడేళ్లు మోదీ ప్రభుత్వానికి చాలా కీలకమని ఉద్ఘాటించారు. అందుకు ప్రత్యేకమైన శిక్షణ తరగతులు నిర్వహించాలని మార్గనిర్దేశంచేశారు. కేంద్ర ప్రభుత్వ స్టాండ్ బలంగా వినిపించేందుకు ఎఫర్ట్ పెట్టాలని సూచించారు. తెలంగాణలో అధికారంలోకి బీజేపీ రావాలంటే అందరం కలసికట్టుగా పని చేయాలని కిషన్‌రెడ్డి దిశానిర్దేశం చేశారు. కాలం చెల్లిన చట్టాలను ప్రధానమంత్రి నరేంద్రమోదీ రద్దు చేశారని బీజేపీ ఎంపీ కె.లక్ష్మణ్ తెలిపారు. దేశాన్ని ఆర్థికంగా విచ్ఛిన్నం చేసేందుకు ఇతర దేశాలు కుట్రలు పన్నుతున్నాయని విమర్శించారు. ప్రధాని మోదీ విజనరీ లీడర్ కాబట్టి వేగంగా స్పందిస్తున్నారని చెప్పుకొచ్చారు. జీఎస్టీ తగ్గింపుతో దీపావళి వెలుగులను పేదల ఇళ్లల్లో మోదీ నింపుతున్నారని వివరించారు. అగ్రదేశాలు అడ్డగోలు టారిఫ్‌లతో భారతదేశాన్ని ఉక్కిరిబిక్కిరి చేయాలని చూస్తున్నాయని ధ్వజమెత్తారు. ఇండియా ఎదుగుదలను చాలా దేశాలు జీర్ణించుకోలేక పోతున్నాయని అయ్యారు. స్వదేశీ వస్తువుల వినియోగించడం ద్వారా.. భారతదేశ ఆదాయం ఇతర దేశాలకు వెళ్లకుండా ఉంటుందని వెల్లడించారు. దీని ద్వారా పెట్టుబడులు పెరుగుతాయని... ఇతరులకు ఉపాధి కలుగుతోందని ఎంపీ లక్ష్మణ్ పేర్కొన్నారు. ప్రజలకు త్వరితగతిన న్యాయం దక్కాలని గత చట్టాలను రద్దు చేసి.. భారత న్యాయ సంహిత చట్టాలను మోదీ సర్కార్ తెచ్చిందని బీజేపీ తెలంగాణ అధ్యక్షుడు రాంచందర్ రావు తెలిపారు. హైదరాబాద్ నడి రోడ్డుపై గతంలో ఓ న్యాయవాది దంపతులను నరికి చంపారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కేసు వేసిన వాళ్లను వెనక్కి తీసుకోకపోతే హత్య చేశారని చెప్పుకొచ్చారు. ఈ కేసులో సీబీఐ దర్యాప్తు ప్రస్తుతం జరుగుతోందని వివరించారు. న్యాయవాదులకు భద్రత కల్పించే చట్టాలు దేశంలో రావాలని రాంచందర్ రావు ఆకాంక్షించారు.

# యంగ్ ఇండియా స్కూల్‌లో అడ్మిషన్లు 1నుంచి 6 వతరగతి వరకు ప్రారంభం

హైదరాబాద్,అక్టోబర్3( సమయజ్యోతి):

నగరంలోని ప్రముఖ విద్యాసంస్థలలో ఒకటైన యంగ్ ఇండియా పోలీస్ స్కూల్ ప్రస్తుతం 1వ తరగతి నుండి 6వ తరగతి వరకు అడ్మిషన్లు ప్రారంభించినట్టు ప్రకటించింది. మంచిరేవులలో ఇటీవలే సిఎం రేవంత్ దీనిని ప్రారంభించారు. విద్యార్థుల భవిష్యత్తును బహుముఖంగా తీర్చిదిద్దే లక్ష్యంతో ఈ స్కూల్ విద్యా ప్రణాళికను రూపొందించింది. ఇక్కడ చదువుతో పాటు క్రీడలు, విలువలతో కూడిన బోధన, నైపుణ్యాల అభివృద్ధి, వ్యక్తిత్వ వికాసం వంటి అంశాలకు ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తున్నారు. ఈ విద్యాసంస్థలో విద్యార్థులు కేవలం పాఠ్యాంశాలకే పరిమితం కాకుండా, క్రీడలు, కో-కరిక్యులర్ కార్యకలాపాలలో కూడా ప్రతిభ చూపే అవకాశాన్ని పొందుతారు. పిల్లలలో సృజనాత్మకతను వెలికితీయడం, క్రమశిక్షణను అలవరచడం, సమాజంపై బాధ్యతగల పౌరులుగా తీర్చిదిద్దడం స్కూల్ ప్రధాన లక్ష్యం. అదేవిధంగా, నాయకత్వ నైపుణ్యాలు, వ్యక్తిత్వ వికాసంపై కూడా ప్రత్యేక దృష్టి పెట్టడం ద్వారా విద్యార్థుల భవిష్యత్తుకు బలమైన పునాది వేసేలా బోధన వ్యవస్థను అమలు చేస్తున్నారు. ఈ స్కూల్‌లో అకడమిక్ ప్రోగ్రాంలతో పాటు స్పోర్ట్స్ మరియు ఇతర కార్యకలాపాలను సమన్వయంతో నిర్వహిస్తున్నారు. ఆధునిక బోధన పద్ధతులు, విలువల ఆధారిత విద్యా విధానంతో విద్యార్థులు సమగ్ర అభివృద్ధి చెందేలా స్కూల్ ప్రత్యేక శ్రద్ధ చూపుతుంది. తమ పిల్లలకు మంచి విద్యా వాతావరణం కల్పించాలని కోరుకునే తల్లిదండ్రులు అడ్మిషన్ల కోసం వెబ్‌సైట్‌ను సందర్శించవచ్చు లేదా 9059196161 నంబర్‌ను సంప్రదించవచ్చు. మొత్తం మీద, యంగ్ ఇండియా పోలీస్ స్కూల్ విద్యార్థుల చదువుతో పాటు వారి నైపుణ్యాలు, వ్యక్తిత్వం, విలువలను అభివృద్ధి చేస్తూ భవిష్యత్తులో సమాజానికి ఆదర్శవంతమైన పౌరులుగా తీర్చిదిద్దే దిశగా ముందుకు సాగుతోంది.

# అలయ్ బలయ్ తెలంగాణ ఆత్మ బండారు దత్తాత్రేయ వెల్లడి

హైదరాబాద్,అక్టోబర్3( సమయజ్యోతి):

అలయ్ బలయ్ ఒక సంప్రదాయం మాత్రమే కాదని.. తెలంగాణ ఆత్మని ఈ కార్యక్రమం నిర్వాహకులు, హర్యానా మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ అభివర్ణించారు. స్వదేశీ భావనతో ముందుకు వెళ్లాలని ప్రజలకు ఆయన పిలుపునిచ్చారు. సేంద్రీయ వ్యవసాయం వైపు అడుగులు వేయాలంటూ రైతులకు ఆయన పిలుపునిచ్చారు. తెలంగాణ చరిత్రలో ప్రతీ మార్పులో యువత కీలకపాత్ర పోషించిందని ఈ సందర్భంగా ఆయన గుర్తు చేశారు. పరస్పర సహకారంతో ముందుకు వెళ్లాలని తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రులకు బండారు దత్తాత్రేయ సూచించారు. కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి మాట్లాడుతూ.. పరిపాలన సౌలభ్యం కోసమే రాష్ట్రాల విభజన జరిగినట్లు పేర్కొన్నారు. ప్రాంతాలకు అతీతంగా కలిసికట్టుగా ఉండాలంటూ తెలుగు రాష్ట్రాల ప్రజలకు పిలుపు నిచ్చారు. యువత సనాతన ధర్మం వైపు చూస్తుందన్నారు. మనకు దసరాతోపాటు జీఎస్టీ పండగ వచ్చిందని తెలిపారు. పెరిగిన ధరలు తగ్గించి ప్రధాని మోదీ రికార్డు సృష్టించారని చెప్పారు. దసరా రోజు అందరి నుంచి ఆశీర్వాదం తీసుకోవడం ఆనవాయితీగా వస్తుందని పేర్కొన్నారు. అయితే బయట రాజకీయ నేతలు చాలెంజ్‌లు విసురుకుంటారు.. కానీ పండగ పూట ఒకే వేదికపైకి తీసుకు వచ్చి కలుసుకునే విధంగా ఏర్పాటు చేసిన కార్యక్రమమే అలయ్ బలయ్ అని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి వివరించారు.

# రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకుల దుర్మరణం

సూర్యాపేట,అక్టోబర్3( సమయజ్యోతి):

తుంగతుర్తి మండలం బండరామారం వద్ద రోడ్డు ప్రమాదం చోటు చేసుకుంది. బైకు అదుపుతప్పి కిందపడటంతో.. బైక్‌పై ఉన్న ఇద్దరు యువకులు అక్కడికక్కడే మృతి చెందారు. స్థానికుల ద్వారా సమాచారం అందుకున్న పోలసులు సంఘటనా స్థలాని చేరుకున్నారు. అనంతరం ఘటనా స్థలాన్ని పరశీలించారు. మృతి చెందిన వారిని తిరుమలగిరి మండలం మాలిపురం గ్రామానికి చెందిన వేముల నాగరాజు (26), వేముల కార్తీక్ (24)గా గుర్తించారు. మృతులిద్దరు అన్నదమ్ములుగా పోలీసులు చెప్పారు. నాగరాజు హైదరాబాద్‌లో కానిస్టేబుల్‌గా పనిచేస్తున్నట్లు తెలిపారు. తుంగతుర్తిలో అమ్మమ్మ ఇంటికి దసరాకు వచ్చి తిరిగి వెళ్తుండగా రోడ్డు ప్రమాదంలో జరిగినట్లు పేర్కొన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు వెల్లడించారు. అన్నదమ్ముల మృతితో మాలిపురం గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

# విండోస్ 10కు కాలం చెల్లినట్లే

## -14 నుంచి అందుబాటులోకి విండోస్ 11 వర్షన్

## -కొనసాగించాలనుకునే వారికి సెక్యూరిటీ కోడ్ ఉండదని హెచ్చరిక

న్యూఢిల్లీ,అక్టోబర్ 3( సమయజ్యోతి):

కంప్యూటర్‌లో విండోస్ 10 వాడుతున్న వారికి ఇదో హెచ్చరిక. విండోస్ 10 వాడుతున్న వారికి త్వరలో మైక్రోసాఫ్ట్ సపోర్ట్ నిలిపివేయనుంది. అక్టోబర్ 14 నుంచి ఎలాంటి సెక్యూరిటీ అప్‌డేట్స్ విడుదల చేయబోమని స్పష్టంచేసింది. ఒకవేళ ఇప్పటికీ ఈ ఆపరేటింగ్ సిస్టమ్‌నే వాడుతుంటే 11కు అప్‌డేట్ అవ్వాల్సిందే. విండోస్ 10కు సపోర్ట్ నిలిపివేయనున్నట్లు దాదాపు రెండేళ్ల క్రితమే మైక్రోసాఫ్ట్ ప్రకటించింది. ఆ గడువు మరికొన్ని రోజుల్లో ముగియనుంది. విండోస్ 10కు మైక్రోసాఫ్ట్ సపోర్ట్ నిలిపివేసినా ఎప్పటిలానే ఓఎస్ పని చేస్తుందని మైక్రోసాఫ్ ప్రతినిధి తెలిపారు. అయితే, సెక్యూరిటీ అప్‌డేట్స్ మాత్రం రావని స్పష్టంచేశారు. దీనివల్ల భద్రతా పరమైన రిస్కులు, మాల్‌వేర్, కంపాటబిలిటీ వంటి సమస్యలు ఎదుర్కోవాల్సి ఉంటుందన్నారు. ముఖ్యంగా ఆన్‌లైన్‌లో బ్రౌజింగ్ చేసే వారికి రిస్క్ పొంచి ఉంటుందని పేర్కొన్నారు. అయితే, సెక్యూరిటీ ఇంటెలిజెన్స్ అప్‌డేట్స్ మాత్రం 2028 అక్టోబర్ వరకు కొనసాగుతాయని మైక్రోసాఫ్ట్ స్పష్టంచేసింది. ఇది ప్రాథమిక స్థాయిలో భద్రతను మాత్రమే అందించగలదు. అలాగే, ఆపరేటింగ్ సిస్టమ్ సెక్యూరిటీ అప్‌డేట్స్‌తో పోలిస్తే యాంటీ వైరస్‌లు ఇచ్చే భద్రత అంతంతమాత్రమేనని పేర్కొంది. ఒకవేళ పూర్తి స్థాయిలో భద్రత కోరుకునేవారైతే ఎక్స్‌టెండెడ్ సెక్యూరిటీ అప్‌డేట్స్ ప్రోగ్రామ్‌ను ఎంపిక చేసుకోవచ్చని మైక్రోసాఫ్ట్ సూచించింది. దీనికి కొంతమొత్తం చెల్లించాల్సి ఉంటుంది. అక్టోబర్ 15 నుంచి డివైజ్ సెట్టింగ్స్‌లో సబ్‌స్క్రిప్షన్ ఆప్షన్‌ను అందుబాటులో ఉంటుంది. మైక్రోసాఫ్ట్ విండోస్ 10ను లక్షలాది మంది వినియోగిస్తున్నారు. వారంతా 11కు అప్‌గ్రేడ్ అయ్యేలా చూడాలన్నది మైక్రోసాఫ్ట్ భావిస్తోంది. అందుకే విండోస్ 11కు అప్‌గ్రేడ్ అవ్వకపోతే సెక్యూరిటీ అప్‌డేట్స్ నిలిపివేస్తామంటోంది. ఏదైనా కారణం చేత విండోస్ 10లోనే కొనసాగాల్సి వస్తే.. డబ్బులు పెట్టి ఎక్స్‌టెండెడ్ సెక్యూరిటీ అప్‌డేట్స్ ప్రోగ్రామ్ కింద సబ్‌స్క్రిప్షన్ తీసుకోవాల్సి ఉంటుంది. అంతేకాదు ఈ ఈఎస్‌యూ ప్రోగ్రామ్‌లో కేవలం సెక్యూరిటీ అప్‌డేట్స్ మాత్రమే లభిస్తాయి. కొత్త ఫీచర్లు గానీ, డిజైన్ మార్పిడి రిక్వెస్టులు గానీ, నాన్ సెక్యూరిటీ రిక్వెస్టులు గానీ అందించదు.

# దేశ ఔన్నత్యం నిలబెడుతున్న మోడీ

## విదేశాల్లో భారత్ పరువు తీస్తున్న రాహుల్

## రాహుల్ వ్యాఖ్యలపై మండిపడ్డ బిజెపి ఎంపి కంగనా

న్యూఢిల్లీ,అక్టోబర్2( సమయజ్యోతి):




ప్రజాస్వామ్యంపై జరుగుతోన్న దాడి భారత్‌కు పొంచిఉన్న ముప్పు అని కొలంబియా పర్యటనలో కాంగ్రెస్ ఎంపీ రాహుల్ గాంధీ చేసిన వ్యాఖ్యలపై భారతీయ జనతా పార్టీ ఘాటుగా స్పందించింది. ఇతర దేశాల్లో భారత్‌ను అవమానించడమే రాహుల్ పనని..దేశ ప్రజలను నిజాయితీ లేనివారిగా ఆయన చిత్రీకరిస్తున్నారని బాలీవుడ్ నటి, భాజపా ఎంపీ కంగనా రనౌత్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎప్పుడూ భారత్‌ను విమర్శించే కాంగ్రెస్ నేతను చూసి.. దేశ ప్రజలు అవమానకరంగా భావిస్తున్నారని అన్నారు. ప్రధాని మోదీ విదేశాల్లో దేశ ఖ్యాతిని పెంచుతుంటే..దానిని ఎలా తగ్గించాలా అని రాహుల్ విశ్వ ప్రయత్నాలు చేస్తున్నారని విమర్శించారు. ఇటువంట పనులు చేయడం వల్ల ప్రజలకు వారిపై ఉన్న నమ్మకం పోయిందన్నారు. భాజపా నేత ప్రదీప్ భండారీ సైతం రాహుల్ వ్యాఖ్యలపై మండిపడ్డారు. భారతదేశాన్ని, దాని పురోగతిని ద్వేషించే వ్యక్తి మాత్రమే విదేశాలకు వెళ్లి దేశాన్ని అవమానిస్తాడని అన్నారు. ఇదే మనస్తత్వంతో గత 70 ఏళ్లుగా కాంగ్రెస్ పాలకులు దేశ అభివృద్ధిని అడ్డుకున్నారని అన్నారు. ప్రధాని మోదీ నాయకత్వంలో భారత్ నాలుగో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా మారడం చూసి..అసూయతో రాహుల్ ఈ విధంగా ప్రవర్తిస్తున్నారని దుయ్యబట్టారు. ఆయన ఎప్పటికీ భారత్‌ను వ్యతిరేకించే నేతగానే మిగిలిపోతారన్నారు. ప్రస్తుతం కొలంబియా పర్యటనలో ఉన్న రాహుల్ ఈఐఏ యూనివర్సిటీలో ఇంజినీరింగ్ విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు.

# మనదేశ వాయుసేన సత్తా ఏమిటో చూపాం

## పాక్ మిగ్‌లను కూల్చేశాం

## : ఎయిర్ చీఫ్ మార్షల్

న్యూఢిల్లీ,అక్టోబర్ 3( సమయజ్యోతి):

ఆపరేషన్ సిందూర్ సమయంలో భారత వాయుసేన సత్తా ఎలాంటిదో ప్రపంచం చూసిందని వాయుసేన అధిపతి ఏపీ సింగ్ తెలిపారు. శత్రువుల స్థావరాలను గురిచూసి కచ్చితంగా కొట్టామని.. ఆ సమయంలో భారత్ శక్తిని ప్రపంచ దేశాలు చూశాయన్నారు. త్రివిధ దళాల సమన్వయంతో పాక్‌కు చెందిన పది ఫైటర్ జెట్ విమానాలను ధ్వంసం చేశామన్నారు. వాటిలో ఎఫ్-16, ఎఫ్ -17 యుద్ధ విమానాలు ఉన్నట్లు తెలిపారు. పాక్‌లోని దాదాపు 300 కి.మీ.ల లక్ష్యాలను ఛేదించినట్లు ఆ దేశాన్ని మోకాళ్లపై కూర్చొనేలా చేశామన్నారు. ఆపరేషన్ సమయంలో కేంద్రం సైన్యానికి పూర్తి స్వేచ్ఛనివ్వడంతో మన సైన్యం శత్రుదేశానికి చుక్కలు చూపించిందని పేర్కొన్నారు. ఇతర దేశాలతో ఘర్షణలు తలెత్తిన సమయాల్లో వాటిని ఎదుర్కోవాలి, పరిష్కరించుకోవాలనే విషయాలను భారత్ నుంచి నేర్చుకోవాలని ప్రపంచ దేశాలకు సూచించారు. భవిష్యత్తు సవాళ్లను అధిగమించేందుకు రక్షణరంగంలో స్వావలంభన కోసం 'సుదర్శన చక్ర'ను తయారుచేస్తున్నట్లు తెలిపారు. దీనికోసం ఇప్పటికే త్రివిధ దళాలు పనిని ప్రారంభించాయని తెలిపారు. ఇకపోతే మనం ఆపరేషన్ సిందూర్ తరవాత ఇప్పుడు వ్యూహాత్మకంగా అడుగులు వేస్తున్నామని అన్నారు. భవిష్యత్ సవాళ్లను ఎదుర్కనేందుకు కూడా సన్నద్ధంగా ఉన్నామన్నారు. మన అస్త్రశస్త్రాలు అన్నీ గేమ్ ఛేంజర్‌లేనని అన్నారు. స్వయంసహాయక శక్తితో భారత్ తిరుగులేని సామర్థ్యం సాధించిందని అన్నారు. మన ఆయుధ సంపత్తి తిరుగులేని దన్నారు.

# బ్రహ్మోస్ ను మించి ధ్వని క్షిపణి

## తయారీకి డిఆర్‌డిఎ రంగం సిద్ధం

న్యూఢిల్లీ,అక్టోబర్ 3( సమయజ్యోతి):

బ్రహ్మోస్ ను మించి ధ్వని క్షిపణి తయారీకి డిఆర్‌డిఎ రంగం సిద్ధం అవుతున్నట్లు సమాచారం. రక్షణ రంగంలో స్వయంసమృద్ధి సాధిస్తున్న భారత్.. మరింతగా అభివృద్ధిపై దృష్టి సారించింది. ఇటీవలి ఆపరేషన్ సిందూర్ తరవాత తమ దృష్టిని పెంచింది. స్వదేశీ అధునాతన ఆయుధాల ఉత్పత్తికి పెద్దపీట వేస్తోంది. అధునాతన క్షిపణి వ్యవస్థలు, ఫైటర్ జెట్లు, డ్రోన్ల ప్రాజెక్టులపై దృష్టి సారిస్తోంది. ఈ క్రమంలో హైపర్‌సోనిక్ క్షిపణి ప్రయోగాలను ముమ్మరం చేస్తోంది. ఇందులో భాగంగా హైపర్‌సోనిక్ గ్లైడ్ వెహికల్ 'ధ్వని' పరీక్షలను ఈ ఏడాది చివరి నాటికి పూర్తి చేయాలని డీఆర్‌డీఓ ప్రయత్నిస్తున్నట్లు తెలుస్తోంది. ఆపరేషన్ సిందూర్‌లో దడ పుట్టించిన బ్రహ్మోస్ కంటే ఈ క్షిపణులు భీకరంగా పనిచేస్తాయని అంచనా. అత్యంత వేగంగా ప్రయాణిస్తూ సుదూర లక్ష్యాలను నిమిషాల్లో ఛేదించగల సామర్థ్యం హెచ్‌జీవీల సొంతం. శబ్ద వేగానికి ఐదారు రెట్ల కంటే అధిక వేగంతో ఈ క్షిపణులు ప్రయాణించగలవు. డీఆర్‌డీఓ సిద్ధం చేస్తోన్న హెచ్‌జీవీ (ఆరలజీనితి) సుమారు గంటకు 7వేలకుపైగా కిలోమీటర్ల వేగంతో దూసుకెళ్లేలా రూపొందిస్తున్నట్లు తెలుస్తోంది. 1500 నుంచి 2వేల కిలోమీటర్ల దూరంలో ఉన్న లక్ష్యాలను ఛేదించగలదని అంచనా. వేగంతో పాటు దిశను మార్చుకునే సామర్థ్యం ఉండడంతో శత్రుదేశాల గగనతల రక్షణ వ్యవస్థలకు స్పందించే సమయం కూడా ఇవ్వదని రక్షణ రంగ నిపుణులు చెబుతున్నారు. హైపర్‌సోనిక్ క్రూజ్ క్షిపణులకు భిన్నంగా ఈ నూతన గ్లైడ్ వెహికల్ ఉంటుంది. రాకెట్ సాయంతో అత్యంత ఎత్తుకు వెళ్లి.. అక్కడ నుంచి విడిపోయి హైపర్‌సోనిక్ వేగంతో లక్ష్యంవైపు దూసుకెళ్తుంది. శత్రువుల గగనతల నిరోధక వ్యవస్థలకు చిక్కకుండా లక్ష్యాలను ఛేదించే సామర్థ్యమున్న ఈ హెచ్‌జీవీ పరీక్షలను డీఆర్‌డీఓ ముమ్మరం చేసింది. ఇప్పటికే ఎయిర్‌ఫ్రేమ్ ఏరోడైనమిక్స్, థర్మల్ మేనేజిమెంట్, స్క్రామ్‌జెట్ ఇంజిన్ పనితీరు, గైడెన్స్ వ్యవస్థకు సంబంధించి క్షేత్రస్థాయి, వైమానిక పరీక్షలు చేసింది. ఈ ఏడాది చివరి నాటికి 'ధ్వని' పూర్తి స్థాయి పరీక్షలు జరిపేందుకు సిద్ధమవుతున్నట్లు సమాచారం.

# ఐసన్ హోవర్ కత్తిపై ట్రంప్ కన్ను

## మ్యూజియం నిబంధనలకు

## విరుద్ధంగా ఇవ్వాలని ఆదేశం

## ఇవ్వనని మొండికేసిన ఉద్యోగికి వేధింపులు

వాషింగ్టన్,అక్టోబర్ 3( సమయజ్యోతి):

అమెరికా అధ్యక్షుడిగా డొనాల్డ్ ట్రంప్ ఆగ్రహానికి గురయితే అంతే సంగతులు అన్నది నిరూపిస్తున్నారు. తాజాగా ఓ మ్యూజియం ఉద్యోగిపై వేటు వేశారు. ఆయన కన్ను ఓ మ్యూజియంలోని పురాతన కత్తిపై పడింది. దానిని ఐరోపాలోని ఓ రాజుకు బహూకరించాలనుకొని.. కత్తి పంపించమని ఆ మ్యూజియంకు కబురుపెట్టారు. ఆ మ్యూజియం నిర్వాహకుడు అది అమెరికా చారిత్రక సంపద అని, తాను ఇవ్వనని తేల్చిచెప్పాడు. అంతే.. ఉద్యోగంలో ఉంటావా.. పీకిపారేయాలా అని ట్రంప్ కార్యవర్గం నుంచి ఫోనొచ్చింది. అయినా సరే నిర్వాహకుడు ఆ కత్తి కోసం తన ఉద్యోగాన్నే వదులు కొన్నాడు. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ గత నెల బ్రిటన్ పర్యటనకు వెళ్లారు. ఈసందర్భంగా అక్కడి రాజు చార్లెస్‌కు బహూకరించేందుకు ప్రెసిడెంట్ డ్వైట్ డి ఐసన్‌హోవర్ లైబ్రరీ అండ్ మ్యూజియంలో పురాత ఖడ్గాల కలెక్షన్ నుంచి ఒక దానిని రాజుకు ఇవ్వాలని భావించారు. దీంతో విదేశాంగశాఖ రంగంలోకి దిగి ఆ కత్తిని అప్పగించాలని కోరింది. వాస్తవానికి ఆయన కోరిన ఖడ్గం ఐసన్‌హోవర్‌కు 1947లో బహుమతిగా లభించింది. అప్పట్లో ఆయన అమెరికాకు చీఫ్ ఆఫ్ ది ఆర్మీగా పనిచేసేవారు. అప్పటి హాలెండ్ రాణి విల్‌హెల్మిన దానిని బహూకరించారు. దీంతో ఆ ఖడ్గాన్ని ట్రంప్‌నకు అప్పగించేందుకు లైబ్రరీ నిరాకరించింది. అది అమెరికా ప్రజల ఆస్తి అని తేల్చిచెప్పింది. దీంతో చేసేదిలేక.. మెలానియా ట్రంప్ అలాంటి ఖడ్గం నమూనాను బ్రిటన్ రాజు చార్లెస్ కు బహూకరించారు. ఆ పర్యటనను ముగించి తిరిగివచ్చాక సదరు లైబ్రరీ డైరెక్టర్ టోడ్డ్ ఆరింగ్టన్‌కు వేధింపులు మొదలయ్యాయి. ట్రంప్ కార్యవర్గానికి వ్యతిరేకంగా వ్యాఖ్యలు చేసినట్లు ఆయనపై ఆరోపణలు చెలరేగాయి. దీనిని ఆరింగ్టన్ ఖండించారు. తాను తప్పుగా ఎప్పుడూ మాట్లాడలేదన్నారు. అయితే ఇటీవల ఆయనకు ఉన్నతాధికారులు ఫోన్ చేసి రాజీనామా చేయాలని లేకపోతే తొలగిస్తామని తేల్చిచెప్పారు. దీంతో ఆరింగ్టన్ రాజీనామా చేశారు. తనకు చరిత్ర, ఉద్యోగం అంటే చాలా ఇష్టమని ఆయన వాపోయారు. ఐసన్‌హోవర్ రెండో ప్రపంచ యుద్ధ సమయంలో మిత్ర సేనలకు ఐరోపాలో సుప్రీం కమాండర్‌గా వ్యవహరించారు. 1953 నుంచి 1961 వరకు అమెరికా అధ్యక్షుడిగా పనిచేశారు.

# పాక్ ఆక్రమి కాశ్మీర్‌లో మిన్నంటిన నిరసనలు

## ప్రత్యేక దేశం కోసం ప్రజల డిమాండ్

## 8మందితో కమిటీ వేసిన పాక్ ప్రభుత్వం

న్యూఢిల్లీ,అక్టోబర్ 3( సమయజ్యోతి):

పాక్ ఆక్రమిత కశ్మీర్ తీవ్ర ఉద్రిక్తతలతో అల్లకల్లోలంగా మారింది. లోయంతా ప్రత్యేక దేశం డిమాండ్లు పెల్లుబికుతున్నాయి. పరిస్థితి తీవ్రతను గుర్తించిన పాకిస్తాన్ ప్రభుత్వం హుటాహుటీన ఒక ప్రత్యేక కమిటీని నియమించింది. పాక్ ప్రధాని షెహబాజ్ షరీఫ్ 8 మంది సభ్యులతో కమిటీని ముజఫరాబాద్‌కు పంపారు. ప్రస్తుత పరిస్థితుల్లో చర్చల మార్గమే మంచిదని షెహబాజ్ ఈ నిర్ణయానికి వచ్చినట్టు సమాచారం. బృందంలో అహసన్ ఇక్బాల్, అమిర్ ముఖ్తార్, రాజా పర్వేజ్ అష్రఫ్‌లు కీలక సభ్యులుగా ఉన్నారు. పాక్ పాలిత కశ్మీర్లో లా అండ్ ఆర్డర్ పరిస్థితి మీద తీవ్ర ఆందోళన వ్యక్తం చేసిన ప్రధాని షరీఫ్, పారదర్శక పరిశోధనకు ఆదేశించారు. ఈ అల్లర్లు ఆర్థిక అసంతృప్తి, రాజకీయ అణచివేతలకు వ్యతిరేకంగా ఈ స్థితికి చేరాయని ప్రధాని నమ్ముతున్నట్టు తెలుస్తోంది. ఇలా ఉండగా, పాక్ దళాలతో జరిగిన తాజా ఘర్షణల్లో ఇప్పటి వరకూ 10 మందికి పైగా స్థానిక ప్రజలు మరణించారు. డజన్ల కొద్దీ జనం తీవ్రంగా గాయపడ్డారు. ఈ నేపథ్యంలోనే నిన్న ముజఫరాబాద్‌లో సివిల్ సొసైటీ అలయన్స్‌తో ప్రభుత్వ బృందం ఉన్నత స్థాయి చర్చలు జరిపింది. శుక్రవారం కూడా చర్చలు కొనసాగుతున్నాయి.

# ఆర్థోపెడిక్ పాలి క్లినిక్ ను ప్రారంభించిన దేవరకద్ర ఎమ్మెల్యే జీఎంఆర్

దేవరకద్ర, సమయజ్యోతి అక్టోబర్ 3

మహబూబ్ నగర్ జిల్లా దేవరకద్ర నియోజకవర్గ కేంద్రంలో గురువారం ఆర్థోపెడిక్ పాలిక్ క్లినిక్ ను దేవరకద్ర ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి ప్రారంభించారు. అలాగే ఎస్ ఎల్ ఎన్ కిచెన్ అండ్ రెస్టారెంట్ ను కూడా ఎమ్మెల్యే మధుసూదన్ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా రెస్టారెంట్ నిర్వాహకులకు ఎమ్మెల్యే మధుసూదన్ రెడ్డి శుభాకాంక్షలు తెలిపారు. అలాగే దేవరకద్ర నియోజకవర్గం పరిధిలోని భూత్పూర్ మండలం వెలికిచర్లలో గురువారం హెచ్ పి శ్రీనివాస పెట్రోల్ పంప్ ను కూడా దేవరకద్ర ఎమ్మెల్యే మధుసూదన్ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా పెట్రోల్ పంప్ నిర్వాహకులకు ఎమ్మెల్యే శు భాకాంక్షలు తెలిపారు. అలాగే కొత్త మొల్గర గ్రామంలో మణికంఠ హోటల్ ను కూడా ఎమ్మెల్యే మధుసూదన్ రెడ్డి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు పాల్గొన్నారు.





# కరూర్ తొక్కిసలాట ఘటన

## సిబిఐ విచారణకు

## తిరస్కరణసిట్ విచారణకు

## హైకోర్టు ఆదేశం

చెన్నై,అక్టోబర్ 3( సమయజ్యోతి):

తమిళనాడులోని కరూర్‌లో తొక్కిసలాట జరిగి 41 మంది మృతి చెందిన విషయం సంచలనంగా మారిన సంగతి తెలిసిందే. ఈ తొక్కిసలాట ఘటనపై సీబీఐ విచారణ చేపట్టాలని మద్రాస్ హైకోర్టులో టీవీకే పిటిషన్ దాఖలు చేసింది. అయితే, ఈ పిటిషన్‌పై మద్రాస్ హైకోర్టు మదురై బెంచ్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది.విచారణ ప్రారంభ దశలోనే సీబీఐ దర్యాప్తు కోరడం సరికాదని కోర్టు వ్యాఖ్యానించింది. న్యాయస్థానాలను రాజకీయ వేదికలుగా మార్చకూడదని హెచ్చరించింది. ప్రభుత్వాలతో పాటు ప్రజలకూ అవగాహన, బాధ్యత ఉండాలని సూచించింది. ముఖ్యంగా ఇలాంటి పెద్ద సమావేశాలకు హాజరుకావడానికి ముందుగా ఆలోచించి, జాగ్రత్తలు తీసుకోవాలని కోర్టు స్పష్టం చేసింది. రూర్ ఘటనపై ఇప్పటికే విచారణ ప్రారంభమైందని, అవసరమైతే తదుపరి దశలో సరైన చర్యలు తీసుకోవచ్చని కోర్టు అభిప్రాయపడింది. ప్రజల ప్రాణాలకు భంగం కలిగించే సంఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వాలు ముందస్తు చర్యలు తీసుకోవాలని కూడా హైకోర్టు ఆదేశించింది. అలాగే ఘటనపై సిట్ విచారణకు ఆదేశించింది.

# కెనడాలో భారతీయ సినిమాల నిలిపివేత

## థియేటర్లపై వరుస దాడులతో నిర్ణయం

టోరంటో,అక్టోబర్ 3( సమయజ్యోతి):

వరుస దాడులు జరుగుతోన్న నేపథ్యంలో కెనడాలోని ఓ థియేటర్‌లో భారతీయ సినిమాల ప్రదర్శనను నిలిపివేశారు. భారతీయ సినిమాలు ప్రదర్శితమవుతోన్న సమయంలోనే ఈ దాడులు జరుగుతున్నాయని అందుకే వాటి ప్రదర్శనను రద్దు చేస్తున్నామని థియేటర్ యాజమాన్యం తెలిపింది. కెనడాలోని ఓక్‌విల్లే ప్రాంతంలో ఫిల్మ్.కా థియేటర్‌లో వారం రోజుల వ్యవధిలోనే రెండుసార్లు దాడులు జరిగాయి. దీంతో భారతీయ సినిమాల ప్రదర్శనను నిలిపివేసింది. ఆ సినిమాల్లో 'కాంతార చాప్టర్ 1', 'ఓజీ' కూడా ఉండడంతో వాటిని కూడా ప్రదర్శించడం లేదని యాజమాన్యం తెలిపింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సెప్టెంబర్ 25న మొదటిసారి దాడి జరిగింది. ఇద్దరు అనుమానితులు హాలుకు నిప్పు అంటించే ప్రయత్నం చేశారు. అప్రమత్తమైన సిబ్బంది వెంటనే మంటలను ఆర్పారు. దీంతో పెద్దగా నష్టం జరగకపోవడంఓ ఊపిరి పీల్చుకున్నారు. తాజాగా అక్టోబర్ 2న మరో దాడి జరిగింది. తెల్లవారుజాము ప్రాంతంలో ఒక అనుమానితుడు థియేటర్ ప్రవేశద్వారం వద్ద కాల్పులు జరిపాడు. దీంతో యాజమాన్యం సినిమాలను నిలిపివేసింది. ఈ దాడుల వెనక ఖలిస్థానీ ఉగ్రవాదుల హస్తం ఉన్నట్లు థియేటర్ యాజమాన్యం అనుమానిస్తోంది. అయితే పోలీసులు మాత్రం ఈ విషయాన్ని నిర్ధరించలేదు. కెనడాలోని ఖలిస్థానీ ఉగ్రవాదులు వాంకోవర్‌లోని భారత్ కాన్సులేట్‌ను సీజ్ చేస్తామంటూ ఇటీవల బెదిరింపులకు పాల్పడిన విషయం తెలిసిందే. దీంతో ఈ థియేటర్ దాడుల వెనక కూడా వారి హస్తం ఉండి ఉండొచ్చని అనుమానిస్తున్నారు.

## ముఖ్యమంత్రి కి దసరా శుభాకాంక్షలు తెలిపిన దేవరకద్ర ఎమ్మెల్యే జిఎంఆర్

దేవరకద్ర, సమయజ్యోతి అక్టోబర్ 3

తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్వగ్రామం కొండారెడ్డిపల్లి లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి గురువారం మహబూబ్ నగర్ జిల్లా దేవరకద్ర ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి (జిఎంఆర్) దసరా శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా ఆయనకు పూలమాలవేసి శాలువా కప్పి ఘనంగా సన్మానించారు.



## ఎంబిబిఎస్ విద్యార్థినికి ఆర్థిక సహాయం అందజేసిన దేవరకద్ర ఎమ్మెల్యే జీఎంఆర్

దేవరకద్ర, సమయజ్యోతి అక్టోబర్ 3

మహబూబ్ నగర్ జిల్లా దేవరకద్ర నియోజకవర్గ ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి (జిఎంఆర్) శుక్రవారం ఎంబిబిఎస్ విద్యార్థినికి పై చదువుల కోసం ఆర్థిక సహాయం అందజేశారు. చిన్నచింతకుంట మండలం కేంద్రానికి చెందిన సి.సామెల్ కూతురు జొన రెచాల్ కష్టపడి చదివి డిఆర్. పట్నం మహేందర్ రెడ్డి మెడికల్ కాలేజీలో ఎంబీబీఎస్ సీటు సాధించింది. అయితే ఆమె కుటుంబం ఆర్థిక పరిస్థితి తీవ్ర ఇబ్బందుల్లో ఉన్నందున వారి కుటుంబ సభ్యులు ఆ విద్యార్థిని కాలేజీ ఫీజు కోసం దేవరకద్ర ఎమ్మెల్యేను ఆశ్రయించారు. దీంతో వెంటనే ఎమ్మెల్యే మధుసూదన్ రెడ్డి స్పందించి ఆ విద్యార్థి పై చదువుల కోసం రూ. 50 వేల ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ఇకముందు కూడా భవిష్యత్తులో ఆ విద్యార్థినికి పై చదువుల విషయంలో అండగా ఉంటామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా తమ కూతురు పై చదువులకు ఆర్థిక సహాయం అందజేసిన ఎమ్మెల్యే మధుసూదన్ రెడ్డికి ఆ విద్యార్థి కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. .





## దేవరకద్రలో ఘనంగా విజయదశమి వేడుకలు

దేవరకద్ర, సమయజ్యోతి అక్టోబర్ 3

మహబూబ్ నగర్ జిల్లా దేవరకద్ర నియోజకవర్గం ప్రజలు గురువారం దసరా విజయదశమి పండుగ వేడుకలను అత్యంత ఘనంగా నిర్వహించారు. నియోజకవర్గంలోని ప్రతి గ్రామంలో దసరా పండుగ వేడుకలను ప్రతి ఏడాది అత్యంత ఘనంగా నిర్వహించడం ఆనవాయితీగా వస్తుంది. అందులో భాగంగానే సంప్రదాయ రీతిలో భక్తిశ్రద్ధలతో ఈ పండుగ వేడుకలను ఆనందోత్సాహాల మధ్య జరుపుకున్నారు. ఈ సందర్భంగా దేవరకద్రలో జమ్మి పూజ కార్యక్రమాన్ని సాంప్రదాయంగా అనాదిగా వస్తున్న ఆచారం ప్రకారం నిర్వహించారు. ఈ పూజా కార్యక్రమానికి పట్టణ ప్రజలు అధిక సంఖ్యలో హాజరయ్యారు. పూజ అనంతరం ఒకరినొకరు జమ్మి ఆకులను (బంగారం) ఇచ్చిపుచ్చుకొని పండుగ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. ఈ కార్యక్రమంలో పట్టణ ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.





## మందడి సరోజ్ రెడ్డికి కలిసిన అభిమానులు

దేవరకద్ర, సమయజ్యోతి అక్టోబర్ 3

మహబూబ్ నగర్ జిల్లా దేవరకద్ర నియోజకవర్గానికి చెందిన బిఆర్ఎస్ యువ నాయకుడు, హైకోర్టు న్యాయవాది మందడి సరోజ్ రెడ్డిని శుక్రవారం నియోజకవర్గం లోని ఆయా గ్రామాలకు చెందిన ఆయన అభిమానులు కలిశారు. ఈ సందర్భంగా ఆయనకు దసరా పండుగ శుభాకాంక్షలు తెలిపారు..



## మన్యంకొండ దేవస్థానంలో ఘనంగా దసరా వేడుకలు

### -సాంప్రదాయ రీతిలో జమ్మి చెట్టుకు పూజలు..

దేవరకద్ర, సమయజ్యోతి అక్టోబర్ 3

మహబూబ్ నగర్ జిల్లా లోని ప్రధాన దేవాలయమైన మన్యం కొండ శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర స్వామి దేవస్థానంలో గురువారం రాత్రి దసరా విజయదశమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. దేవస్థానంలో ప్రతి ఏడాది విజయదశమి వేడుకలను సాంప్రదాయ రీతిలో నిర్వహించడం ఆనవాయితీగా వస్తుంది. అందులో భాగంగానే ఈ వేడుకలను దేవస్థానంలో భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా జమ్మి చెట్టుకు దేవస్థానం చైర్మన్, వంశపారంపర్య ధర్మకర్త అళహరి మధుసూదన్ కుమార్, అళహరి రామకృష్ణల ఆధ్వర్యంలో పలు పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం ఈఓ. శ్రీనివాసరాజు, పాలకమండలి సభ్యులతో పాటు ప్రధాన పూజారులు రాజేష్, నరసింహయ్య పర్యవేక్షకుడు నిత్యానందచారి, దేవాలయం పురోహితులు, సిబ్బంది వివిధ ప్రాంతాల నుండి తరలివచ్చిన భక్తులు తదితరులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.





## బిఆర్ఎస్ పార్టీ నుండి కాంగ్రెస్ పార్టీలో చేరికలు

### -పార్టీ కండువా కప్పి స్వాగతం పలికిన ఎమ్మెల్యే జీఎంఆర్

దేవరకద్ర, సమయజ్యోతి అక్టోబర్ 3

మహబూబ్ నగర్ జిల్లా దేవరకద్ర నియోజకవర్గ పరిధిలోని మదనాపురం మండలం దుప్పల్లి గ్రామానికి చెందిన బిఆర్ఎస్ పార్టీ నాయకులు శుక్రవారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. దుప్పల్లి గ్రామ నాయకులైన గౌడ సంఘం అధ్యక్షులు ఎ. జనార్ధన్ గౌడ్, గౌడ సంఘం కార్యదర్శి బలరాం గౌడ్, గౌడ సంఘం ఉపాధ్యక్షులు పుల్లయ్య గౌడ్, కోశాధికారి లచ్చ గౌడ్, నాయకులు తిరుపతి గౌడ్, బాలా గౌడ్, మన్నెం గౌడ్, గణేష్ గౌడ్, నరేష్ గౌడ్ నాయకులు, గ్రామానికి చెందిన పలువురు బిఆర్ఎస్ కార్యకర్తలు శుక్రవారం దేవరకద్ర ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి (జిఎంఆర్) సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా వారికి కాంగ్రెస్ కండువా కప్పి ఎమ్మెల్యే మధుసూదన్ రెడ్డి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా పార్టీలో కలిసిన నాయకులు మాట్లాడుతూ ఎమ్మెల్యే జిఎంఆర్ గారు చేస్తున్న అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలకు ఆకర్షితులై కాంగ్రెస్ పార్టీలో చేరామని తెలిపినట్లు కాంగ్రెస్ పార్టీ నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.






## పి ఆర్ టి యు టి ఎస్ జిల్లా బాధ్యుల సేవలు అభినందనీయం

### -రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు లయన్ అశ్విని చంద్రశేఖర్

దేవరకద్ర, సమయజ్యోతి అక్టోబర్ 3



పి ఆర్ టి యు టి ఎస్ మహబూబ్ నగర్ జిల్లా బాధ్యులను ఆ యూనియన్ నాయకులు శుక్రవారం ఘనంగా సత్కరించారు. పి ఆర్ టి యు టి ఎస్ జిల్లా అధ్యక్షులు గా జి.మదన్ మోహన్ యాదవ్, ప్రధాన కార్యదర్శిగా జి .సుధాకర్ రెడ్డి, గౌరవ అధ్యక్షులుగా వి.బుచ్చా రెడ్డి లు బాధ్యతలు స్వీకరించి దిగ్విజయంగా ఏడాది పాలనను పూర్తిచేసుకున్న సందర్భంగా మహబూబ్ నగర్ లో ఏర్పాటు చేసిన ఒక కార్యక్రమంలో యూనియన్ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు లయన్ అశ్విని చంద్రశేఖర్ తో పాటు పలువురు జిల్లా, మండల నాయకులు శాలువాలతో సన్మానించి అభినందించారు. ఈ సందర్భంగా రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు లయన్ అశ్విని చంద్రశేఖర్ మాట్లాడుతూ ఉపాధ్యాయ లోకానికి పి ఆర్ టి యు టి ఎస్ జిల్లా నాయకత్వం అందిస్తున్న సేవలు అభినందనీయం అన్నారు. ఇటు మండల అటు రాష్ట్ర నాయకుల సమన్వయంతో ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి జిల్లా అధ్యక్షులు మదన్ మోహన్ యాదవ్, ప్రధాన కార్యదర్శి సుధాకర్ రెడ్డి, గౌరవ అధ్యక్షులు బుచ్చారెడ్డి లు సమిష్టిగా చేస్తున్న కృషి అభినందనీయం అన్నారు. ఉపాధ్యాయులకు, కార్యకర్తలకు ఎల్లవేళల అందుబాటులో ఉంటూ తమదైన శైలి లో సేవలందించడం ప్రశంసనీయం అన్నారు. పి ఆర్ టి యు సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని అత్యంత పకడ్బందీగా నిర్వహించడం, జిల్లా చరిత్రలో ఎన్నడు లేని విధంగా ప్రభుత్వ పాఠశాలల్లో పదవ తరగతి చదివి మండల స్థాయిలో ప్రతిభ చాటినవారి ని గుర్తించి ప్రతిభా పురస్కారాలు ప్రదానం చేయడం, ఉత్తమ ఫలితాలు సాధించిన ఆయా పాఠశాలల హెచ్ యం లు, మండల విద్యాధికారులను సముచితమైన గుర్తింపు , గౌరవం ఇచ్చి సత్కరించడం వంటి అద్భుతమైన కార్యక్రమాలు నిర్వహించి అందరి ప్రశంసలు అందుకున్న ఘనత పి ఆర్ టి యు జిల్లా నాయకత్వానికి దక్కిందన్నారు. ముఖ్యంగా సి పీ ఎస్ ను రద్దు చేసి పాత పెన్షన్ ను పునరుద్ధరించాలని డిమాండు చేస్తూ రాష్ట్ర శాఖ ఇచ్చిన పిలుపు మేరకు పాఠశాల, మండల, జిల్లా, రాష్ట్ర స్థాయిల్లో నిర్వహించిన ఆందోళన కార్యక్రమాలు విజయవంతం చేయడంలో జిల్లా నాయకత్వం ఎనలేని కృషి చేసిందని పేర్కొన్నారు. కాగా సన్మాన గ్రహీత లైనా పి ఆర్ టి యు టి ఎస్ జిల్లా అధ్యక్షులు మదన్ మోహన్ యాదవ్, ప్రధాన కార్యదర్శి సుధాకర్ రెడ్డి, గౌరవ అధ్యక్షులు బుచ్చారెడ్డి లు మాట్లాడుతూ ఉపాధ్యాయుల సంక్షేమానికి మరింతగా కృషి చేస్తామని అన్నారు. ఉపాధ్యాయుల ఉన్నతికి , యూనియన్ పటిష్టతకు సహకారం అందిస్తున్న ప్రతి ఒక్కరికి ఈ సందర్భంగా వారు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పి ఆర్ టి యు టి ఎస్ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు లయన్ అశ్విని చంద్రశేఖర్, కృష్ణ సాగర్,మహబూబ్ నగర్ అర్బన్ అధ్యక్షులు అత్తార్ అహ్మద్, దేవరకద్ర, కోయిల కొండ మండలాల ప్రధాన కార్యదర్శులు శ్రీకాంత్ యాదవ్, తిరుమల రాఘవేందర్, బి.ఆర్.రవి కుమార్, రాజశేఖర్ రావు తదితరులు పాల్గొన్నారు.

# ఆటో, క్యాబ్ డ్రైవర్లకు రూ.15వేల ఆర్థిక సాయం

## విజయవాడ సింగ్ నగర్‌లో నేడు సిఎం చంద్రబాబుశ్రీకారం
## అమరావతిలో ఇక భూ సేకరణ ద్వారా భూముల సమీకరణ
## జలవనరుల శాఖ పనులకు కేబినేట్ గ్రీన్ సిగ్నల్

అమరావతి,అక్టోబర్3( సమయజ్యోతి):

ఆటో, క్యాబ్ డ్రైవర్లకు రూ.15వేల ఆర్థిక సాయం అందించే పథకాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబు శనివారం లాంఛనంగా ప్రారంభించనున్నారు. విజయవాడ సింగ్ నగర్‌లోని మాకినేని బసవపున్నయ్య స్టేడియంలో ఈ పథకాన్ని సీఎం ప్రారంభిస్తారు. ఈ మేరకు పథకం ప్రతిపాదనలకు రాష్ట్ర మంత్రివర్గం ఆమోదం తెలిపింది. అమరావతి సచివాలయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు అధ్యక్షతన కేబినెట్ సమావేశమై 20 అజెండా అంశాలపై చర్చించింది. ల్యాండ్ ఇన్సెంటివ్ ఫర్ టెక్నికల్ హబ్స్ (లిఫ్ట్) పాలసీ 2024-29 అనుబంధ ప్రతిపాదనలకు మంత్రివర్గం ఆమోదం తెలిపింది. జలవనరుల శాఖకు సంబంధించి వివిధ పనులకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. కారవాన్ పర్యాటకానికి, అమృత్ పథకం 2.0 పనులకు మంత్రివర్గం ఆమోదం తెలిపింది. రాజధాని అమరావతికి భూసేకరణ విషయంలో కేబినెట్ కీలక నిర్ణయం తీసుకుంది. ల్యాండ్ పూలింగ్ ద్వారా ఇవ్వని భూములను భూసేకరణ ద్వారా తీసుకునేందుకు ఆమోదం తెలిపింది. అమరావతిలో వివిధ పనుల వేగవంతానికి స్పెషల్ పర్పస్ వెహికల్ (ఎస్‌పీవీ) ఏర్పాటుకు ఆమోదముద్ర వేసింది. అమరావతి సహా రాష్ట్రవ్యాప్తంగా పలు సంస్థలకు భూకేటాయింపుల ప్రతిపాదనలకు ఆమోదం తెలిపింది. కుష్ఠు వ్యాధి పదం తొలగించేందుకు వీలుగా చట్టసవరణ చేయాలని నిర్ణయించింది. విద్యుత్ శాఖకు సంబంధించి పలు ప్రతిపాదనలకు, కార్మిక చట్టాల్లో పలు సవరణల ప్రతిపాదనలను మంత్రివర్గం ఆమోదించింది. అలాగే, రాజధాని నిర్మాణం లో మరో కీలక ముందడుగు పడింది.రాజధాని అమరావతి కోసం భూ సేకరణ కోసం ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఏపీ క్యాబినెట్ ఆమోదం తెలిపింది. భూములు ఇవ్వని కొందరు రైతుల నుంచి భూసేకరణ చట్టం 2013 ద్వారా భూములు తీసుకోవాలని కేబినెట్. లో నిర్ణయం తీస్కున్నారు మేరకు ఏపీ క్యాబినెట్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. అమరావతిలో పనుల కోసం ఎస్‌పీవీ ఏర్పాటుకు ఆమోదం లభించింది. పలు సంస్థలకు భూ కేటాయింపులు చేసేందుకు కేబినెట్ ఆమోదించింది. అలాగే, కార్మిక చట్టాల్లో పలు సవరణల ప్రతిపాదనలకు సైతం మంత్రి మండలి ఆమోదం లభించింది.

----



# అమరావతి నిర్మాణంలో కీలక ముందడుగు

### -భూసేకరన ద్వారా అవసరమైన భూముల సేకరణ-అమిడ్యాల లిఫ్ట్ స్కీమ్ పనులకు కేబినెట్ ఆమోదం
### -ప్రకాశం బ్యారేజీ , దివిసీమ వద్ద వీక్ బండ్స్ మరమ్మత్తులు -కేబినేట్ వివరాలు వెల్లడించిన మంత్రి పార్థసారథి

అమరావతి,అక్టోబర్3( సమయజ్యోతి):

రాజధాని అమరావతి నిర్మాణంలో మరో కీలక ముందడుగు పడింది. అమరావతి నిర్మాణం కోసం ల్యాండ్ పూలింగ్ ద్వారా సీఆర్డీఏకి ఇవ్వని భూములను భూసేకరణ ద్వారా తీసుకునేందుకు కేబినెట్ ఆమోదం తెలిపింది. అయితే, రాజధాని అమరావతికి ల్యాండ్ పూలింగ్ కోసం కొందరు రైతులు భూములు ఇవ్వలేదు. వారి నుంచి భూసేకరణ చట్టం 2013 ద్వారా భూములు తీసుకోవాలని కేబినెట్‌లో నిర్ణయం తీసుకున్నారు. ఈ మేరకు ఏపీ కేబినెట్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. కేబినేట్ వివరాలను మంత్రి పార్థసారథి మీడియాకు వివరించారు. హంద్రీనీవా ప్రాజెక్టులో అమిద్యాల లిఫ్ట్ స్కీమ్ పనులకు కేబినెట్ ఆమోదం తెలిపిందని పౌర సంబంధాల, గృహ నిర్మాణ శాఖా మంత్రి కొలుసు పార్థసారథి తెలిపారు. ప్రకాశం బ్యారేజ్- దివిసీమ ప్రాంతాల్లో వరదనష్టం నివారణ పనులు చేసేందుకు గత సంవత్సరమే ప్రభుత్వం అనుమతులు ఇచ్చిందని.. ఇందుకోసం రూ.107 కోట్లు ప్రభుత్వం విడుదల చేసిందని గుర్తుచేశారు. ప్రకాశం బ్యారేజీ వద్ద, దివిసీమ వద్ద వీక్ అయిన బండ్స్‌ను రూ.4.49కోట్లతో పనులు చేయడానికి మంత్రిమండలి ఆమోదం తెలిపిందని అన్నారు. వైఎస్సార్ కడప జిల్లాలో మైలవరం రిజర్వాయర్‌ని 1981- 1982లో నిర్మాణం చేశారని తెలిపారు. 2021లో వచ్చిన భారీ వరదలను పట్టించుకోకపోవడంతో రూ.3కోట్లతో రిపేర్లు చేయించడానికి కేబినెట్ ఆమోదం తెలిపిందని చెప్పుకొచ్చారు. లక్షా 15 వేల ఎకరాలకు నీరు అందించడం, తిరుపతి, తిరుమలకు తాగునీరు అందించేందుకు 2017-2018లో టెండర్లని ఎన్‌సీసీకి ఇచ్చారని గుర్తుచేశారు. ఈ ప్రాజెక్టును గత జగన్ ప్రభుత్వం మూలన పడేసిందని విమర్శించారు. తిరుపతిలో ప్రతి సంవత్సరం ఎ÷-లోటింగ్ పాపులేషన్ పెరుగుతూనే ఉందని తెలిపారు. ఈ అవసరాలను దృష్టిలో పెట్టుకుని అవసరమైన పనులు చేయాలని కేబినెట్ నిర్ణయం తీసుకుందని మంత్రి కొలుసు పార్థసారథి పేర్కొన్నారు. అనంతపురం- ఉరవకొండ వజ్రకరూరు కొత్త లిఫ్ట్ స్కీమ్ కు కేబినెట్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చిందని మంత్రి కొలుసు పార్థసారథి తెలిపారు. దీని ద్వారా 10వేల 500 ఎకరాలకు సాగు, తాగునీరు వస్తుందని వివరించారు. ఈ పనులకు మంత్రి మండలి ఆమోదం తెలిపిందని చెప్పారు. ఏపీ టూరిజం పాలసీలో క్యారవాన్ టూరిజం, హోమ్‌స్టే ప్రోత్సాహకాలు చేర్చామని వెల్లడించారు. పెన్నా నదిపై మిడ్ పెన్నా రిజర్వాయర్‌ని 1962లో నిర్మించారని గుర్తుచేశారు. గత ఐదేళ్లు వైసీపీ ప్రభుత్వంలో నిర్వాహణ చేయకపోవడంతో చాలా ఇబ్బందులు వచ్చాయని తెలిపారు. ఏపీలో స్త్రీ శక్తి పథకాన్ని 10 కోట్ల మంది మహిళలు వినియోగించుకున్నారని వివరించారు. ప్రతి జిల్లాలో రూ.15వేల చొప్పున ఆటోడ్రైవర్లకు 'ఆటోడ్రైవర్ల సేవలో' పథకం అమలు చేస్తున్నామని ప్రకటించారు. ఈ పథకం ద్వారా 2,90,669 మందికి లబ్ది చేకూరనుందని తెలిపారు. ఆంధ్రప్రదేశ్ పర్యాటక విధానం 2024-2029కి క్యారవాన్ పార్కులు, క్యారవాన్లకి కేబినెట్ ఆమోదం తెలిపిందని అన్నారు. క్యారవాన్లు పెట్టేవారికి లైఫ్ ట్యాక్స్ , పార్కులు ఏర్పాటు చేసేవారికి స్టాంప్ డ్యూటీ మినహాయింపు ఇస్తున్నామని స్పష్టం చేశారు. బదిలీల్లో వందశాతం ఇన్సెంటివ్ ఉంటుందని వివరించారు. మొదటిగా వచ్చిన 25 క్యారవాన్లకు 100శాతం లైఫ్ ట్యాక్స్ మాఫీ ఉంటుందని... ఆ తర్వాత వచ్చే వాటికి ఇన్సెంటివ్‌లు ఉంటాయని తెలిపారు. హోంస్టేలకు సంబంధించి టూరిజం పాలసీని మంత్రి మండలి ఆమోదించిందని తెలిపారు. 1 నుంచి 6 రూములు హోంస్టేల కిందకు వస్తాయని.. అంతకు మించితే హోటల్‌గా పరిగణిస్తామని చెప్పుకొచ్చారు. ఈ హోంస్టేలలో ఓనర్లు కూడా అందులో నివాసం ఉండాలనే నిబంధన తప్పనిసరి చేశామని మంత్రి కొలుసు తెలిపారు. సీఆర్డీఏలో అమరావతి అభివృద్ధిలో భాగంగా ఎస్‌పీవీలు ఏర్పాటుకు ఆమోదం తెలిపాం. వీటికి గ్రీన్ ఫీల్డ్ ఎయిర్‌పోర్టు, రివర్ ఫ్రంట్ డెవలప్‌మెంట్ వంటివి టైమ్ టూ టైమ్ అందిస్తాం. ఏపీ సీఆర్డీఏ యాక్ట్ 2014లో 37,916 ఎకరాలను సేకరించాలని ప్రతిపాదించాం. అయితే 34,385 ఎకరాలు మాత్రమే తీసుకున్నాం. 3,500 ఎకరాల భూమిని రైతులు పూలింకి ఇవ్వలేదు. 2101.5 ఎకరాలు దీనిలో 191.62 ఎకరాల అక్విజేషన్‌కి అవార్డు పాస్ చేశాం. 369.23 ఎకరాలు పూలింగ్‌కి ఇస్తాం. 1,197 ఎకరాలను వైసీపీ విత్ డ్రా చేసుకుంది. ఇంకా 343 ఎకరాలు ల్యాండ్ అక్విజేషన్ నుంచి విత్ డ్రా చేసుకోవాల్సి ఉంది. ఎక్కడైనా రోడ్డు నిర్మాణానికి భూమి అడ్డు ఉంటే అక్కడ ల్యాండ్ అక్విజేషన్‌కి నోటిఫై చేసి తీసుకోవచ్చని నిర్ణయించాం. ఎస్‌వీయూకు




గుంటూరులో కేటాయించిన భూమిని ఏపీ హైకోర్టు ఆదేశాల మేరకు రద్దు చేస్తూ నిర్ణయం తీసుకున్నాం' అని మంత్రి పార్థసారథి స్పష్టం చేశారు. 'నేషనల్ కో ఆపరేటివ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ నుంచి రూ.1000 కోట్లు అదనపు రుణంగా తీసుకునేందుకు, దాన్ని సివిల్ సప్లయీస్ కార్పొరేషన్‌కి బదలాయించడానికి నిర్ణయం తీసుకున్నాం. ఏపీ రిఫరెన్స్ స్టేషన్ నెట్‌వర్క్‌ని నేషనల్ నెట్‌వర్క్ స్టేషన్‌తో అనుసంధానించడానికి ఎంఓయూ చేసుకున్నాం. ఏపీ ట్రాన్స్ కో డిపార్టుమెంట్ ఉత్తర్వుల్లోని కొన్ని నిబంధనలు సవరించడానికి ఇంధన శాఖ ప్రతిపాదనలకు ఆమోదించాం. జేఎస్‌డబ్ల్యూ న్యూ ఎనర్జీ జలదుర్గం వద్ద ఏర్పాటు చేసిన ఎ÷-లాంట్ ద్వారా వచ్చే విద్యుత్‌ని అక్కడ నిర్మించే స్టీల్ ఎ÷-లాంట్‌కి వాడుకోవడానికి చేసిన ప్రతిపాదనను ఆమోదించాం. ఏపీని గ్రీన్ హైడ్రోజన్ వ్యాలీగా డెవలప్ చేయాలని నిర్ణయించాం. దీనికి ఒక సలహామండలి నిర్మాణానికి ఆమోదించాం. ఏపీ అసైన్‌ల్యాండ్ 1977ని సవరణకు నిర్ణయం తీసుకున్నాం. ఆంధ్రప్రదేశ్ అసైన్‌ల్యాండ్‌ని కౌలుకు ఇచ్చేలా అవకాశం కల్పిస్తూ చేసిన ప్రతిపాదనకి మంత్రి మండలి నిర్ణయం తీసుకుంది' అని మంత్రి కొలుసు పార్థసారథి పేర్కొన్నారు.

# అరకు కాఫీకి ఛేంజ్ మేకర్ అవార్డు

## జిఐ ట్యాగ్‌తో బ్రాండ్‌గా మారిందన్న చంద్రబాబు

అమరావతి,అక్టోబర్3( సమయజ్యోతి):



జీఐ ట్యాగ్ పొందిన తర్వాత అరకు కాఫీ అంతర్జాతీయ స్థాయిలో ప్రముఖ బ్రాండ్‌గా మారిందని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు వ్యాఖ్యానించారు. అరకు కాఫీకి ఛేంజ్ మేకర్ అవార్డుపై సీఎం చంద్రబాబు అభినందనలు తెలిపారు. సీఎంను కలిసి అవార్డు, ప్రశంసా పత్రంను మంత్రి సంధ్యారాణి, జీసీసీ ఎండీ అందజేశారు. అరకు కాఫీ ద్వారా జాతీయ స్థాయిలో బిజినెస్ లైన్ ఛేంజ్ మేకర్ అవార్డును గిరిజన సహకార సంస్థ దక్కించుకుంది. అరకు వ్యాలీ కాఫీకి ఫైనాన్షియల్ ట్రాన్స్‌ఫర్మేషన్ విభాగంలో అవార్డు దక్కడంపై గిరిజన శాఖ మంత్రి గుమ్మిడి సంధ్యారాణి, జీసీసీ ఎండీ కల్పన కుమారికి ముఖ్యమంత్రి ప్రశంసించారు.బిజినెస్ లైన్ నుంచి స్వీకరించిన అవార్డును, ప్రశంసా పత్రాన్ని పరిశీలించారు సీఎం. ఏజెన్సీ ప్రాంతంలో సేంద్రీయ విధానంలో సాగు అవుతున్న అరకు కాఫీ స్వచ్ఛత, సువాసనలతో పాటు ప్రత్యేక రుచిని కలిగి ఉందని చెప్పుకొచ్చారు. ఈ విశిష్టత కారణంగా అరకకు మంచి బ్రాండ్ అనే పేరు వచ్చిందని తెలిపారు. కాఫీ సాగు ద్వారా అరకులోని గిరిజనుల జీవన శైలిలో మార్పు వచ్చిందని వెల్లడించారు. ఇటీవల జీసీసీ-టాటా కన్స్యూమర్ ప్రొడెక్ట్స్ లిమిటెడ్ మధ్య కుదిరిన అవగాహన ఒప్పందంతో దేశంలో తొలిసారిగా ఆర్గానిక్ సాల్యూబుల్ కాఫీ ఉత్పత్తి కానుందని వివరించారు. నర్సీపట్నం సమీపంలోని మాకవరపాలెం గ్రామంలో ఆధునిక సాంకేతికతతో కూడిన ఇంటిగ్రేటెడ్ కాఫీ ప్రాసెసింగ్ యూనిట్ ఏర్పాటు అయ్యిందని తెలిపారు. తద్వారా విలువ ఆధారిత ఉత్పత్తిగా బీన్ టు కప్ మోడల్ అభివృద్ధి కానుందని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు.

# కారేపల్లి మాజీ సర్పంచ్ కాంగ్రెస్‌కు రాజీనామా

ఖమ్మం,అక్టోబర్ 3( సమయజ్యోతి):

ఖమ్మం జిల్లా వైరా నియోజకవర్గ పరిధిలోని సింగరేణి(కారేపల్లి)మండలంలో అధికార కాంగ్రెస్ పార్టీకి చెందిన కారేపల్లి గ్రామపంచాయతీ మాజీ సర్పంచ్ అదెర్ల స్రవంతి కాంగ్రెస్ పార్టీకి రాజీనామా చేసినట్టు ప్రకటించారు. మండల కేంద్రంలోని నివాసంలో శుక్రవారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీలో వర్గవిభేదాలు,ఆధిపత్య పోరు,స్థానిక నాయకత్వ సమన్వయ లోపం కారణమన్నారు. అలాగే పార్టీ కార్యక్రమాలకు ఆహ్వానం లేకపోవడం,రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ముఖ్య అనుచరులలో తాను ఒకదానినని కాబట్టి తనకు సరైన గుర్తింపు లేకపోవడంతో కాంగ్రెస్ పార్టీలో ఇమడలేక పోతున్నానని ఆవేదన వ్యక్తం చేశారు. ఐదేళ్లపాటు బీఆర్ఎస్ ప్రభుత్వంలో సింగరేణి మండలంలో మేజర్ గ్రామపంచాయతీ ఐన కారేపల్లి సర్పంచ్ గా పంచాయతీ అభివృద్ధికి నా వంతు కృషి చేశానన్నారు. ముఖ్యంగా మండల కాంగ్రెస్ పార్టీలో వర్గ విభేదాల వల్లే తాను పార్టీ మారుతున్నట్టు పేర్కొన్నారు. భవిష్యత్తులో ఏ పార్టీలో చేరేది మరి కొద్ది రోజుల్లో చెప్తానని వెల్లడించారు.

# సిద్దిపేట మట్టిలోనే సేవాగుణం

## అమర్‌నాథ్ సేవా సమితి భవనం భూమి పూజలో హరీష్ రావు


సిద్దిపేట,అక్టోబర్ 3( సమయజ్యోతి):

సిద్దిపేట అంటే సేవకు పెట్టింది పేరని, సిద్దిపేట నుంచి ప్రారంభమైన అన్నదానం ఎల్లలు దాటి అమర్‌నాథ్ అయోధ్య వరకు సాగుతుందంటే సిద్దిపేట మట్టి మహిమ అని మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు అన్నారు. సిద్దిపేట పట్టణంలోని కరీంనగర్ రోడ్డు అయ్యప్ప దేవాలయ సమీపంలో నిర్మించ తలపెట్టిన అమర్‌నాథ్ సేవా సమితి భవనం భూమి పూజ కార్యక్రమంలో మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా హరీశ్‌రావు మాట్లాడుతూ అమర్ నాథ్ సేవా సమితి సర్వజన హితం అని, సిద్దిపేటలో ఆరంభించిన ఈ కార్యక్రమం ఎల్లలు దాటి విశ్వ వ్యాప్తమైందన్నారు. అమర్ నాథ్ సేవా సమితి స్ఫూర్తితో కేదార్ నాథ్, అయోధ్య వరకు సిద్దిపేట అన్నం భక్తులకు అందుతుండడటం ఎంతో సంతోషంగా ఉందన్నారు. సిద్దిపేట అంటే సేవకు సామాజిక, ధార్మిక ఆధ్యాత్మికతకు నిలయంగా మారిందన్నారు. తన వంతు సహకారం ఎల్లప్పుడూ ఉంటుందన్నారు.

# ఎమ్మెల్యేలు ఇష్టం వచ్చినట్లుగా మాట్లాడరాదు

## వారిని నియంత్రించే పని మంత్రులదే
## కేబినేట్ భేటీ ముగిసాక పలు అంశాలపై బాబు వివరణ

అమరావతి,అక్టోబర్3( సమయజ్యోతి):



అసెంబ్లీలో కొందరు ఎమ్మెల్యేలు ఇష్టారీతిన మాట్లాడారు.. వారిని నియంత్రించాల్సిన బాధ్యత ఇన్‌ఛార్జి మంత్రులదేనని సీఎం చంద్రబాబు అన్నారు. ఎమ్మెల్యేలు, ఇన్‌ఛార్జి మంత్రుల మధ్య సమన్వయం ఉండాలని సూచించారు. కేబినెట్ సమావేశం ముగిసిన తర్వాత పలు అంశాలపై మంత్రులతో సీఎం చంద్రబాబు చర్చించారు. శాఖాపరంగా ఎలాంటి విమర్శలొచ్చినా గట్టిగా స్పందించాలి. చరిత్రలో తొలిసారి 93శాతం రిజర్వాయర్లు నింపాం. విజన్-2047లోని 10 సూత్రాల్లో ఇదో కీలక పరిణామం. పూర్వోదయ పథకం ద్వారా ఉద్యాన, ఆక్వా రంగాల్లో రాష్ట్రానికి రూ.65వేల కోట్లు వచ్చే అవకాశముంది. అన్ని ప్రాంతాల్లోనూ విజయవాడ ఉత్సవ్ తరహాలో ఈవెంట్లు పెట్టాలి. స్థానిక పండుగలను ప్రోత్సహించేలా నెలకో ఈవెంట్ పెట్టాలి. కడపలో జిందాల్ ఉక్కు పరిశ్రమను 2028లోపు పూర్తి చేస్తాం. ఈ నెల 16న ప్రధాని కర్నూలు పర్యటనను విజయవంతం చేయాలని సీఎం సూచించారు.అయితే, చామ్ విధానంలో పట్టణాభివృద్ధి చేపట్టిన నిర్మాణాలు ఇతర శాఖలు అందిపుచ్చుకోవాలని సీఎం చంద్రబాబు తెలిపారు. పూర్వోదయ పథకంలో ఏపీకి స్థానం లభించిన విషయాలు మంత్రులతో పంచుకున్నారు. ఏ పథకం ద్వారా దాదాపు రూ. 65 వేల కోట్లు ఉద్యాన, ఆక్వా రంగాలకు వచ్చే అవకాశం ఉంది. యానిమల్ హాస్టళ్ల ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలి.. విజయవాడ ఉత్సవ్ తరహాలో నెలకో ఈవెంట్ రాష్ట్రంలో స్థానిక పండుగల్ని ప్రోత్సహించేలా అన్ని ప్రాంతాల్లో చేపట్టాలి అన్నారు. కర్నూల్ లో ఈ నెల 16వ తేదీన ప్రధాని మోడీ పర్యటన విజయవంతం చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు చెప్పుకొచ్చారు.

# ఎపిలో ఇంటర్ పరీక్షల షెడ్యూల్ విడుదల

## ఫిబ్రవరి 23 నుంచి ఫస్ట్ ఇయర్, 24నుంచి సెకండ్ ఇయర్ పరీక్షలు

అమరావతి,అక్టోబర్3( సమయజ్యోతి):

ఏపీలో ఇంటర్ పరీక్షలకు షెడ్యూల్ విడుదలైంది. వచ్చే ఏడాది ఫిబ్రవరి 23 నుంచి మార్చి 24వ తేదీ వరకు ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు ఈ పరీక్షలు జరుగుతాయని ఇంటర్ బోర్డు ఓ ప్రకటనలో వెల్లడించింది. ఫిబ్రవరి 23 నుంచి ప్రథమ సంవత్సరం, ఫిబ్రవరి 24 నుంచి ద్వితీయ ఇంటర్ పరీక్షలు ప్రారంభమవుతాయని పేర్కొంది. జనరల్ కోర్సులకు ప్రాక్టికల్ పరీక్షలు ఫిబ్రవరి 1 నుంచి 10వ తేదీ వరకు; ఒకేషనల్ కోర్సులకు జనవరి 27 నుంచి ఫిబ్రవరి 10 వరకు రెండు సెషన్లలో ఉంటాయని తెలిపింది. ప్రాక్టికల్ పరీక్షలు ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు మొదటి సెషన్, మధ్యాహ్నం 2గంటల నుంచి సాయంత్రం 5గంటలవరకు (ఆదివారాల్లో సహా) రెండో సెషన్ ఉంటాయని తెలిపింది. అయితే, ఇది తాత్కాలిక షెడ్యూల్ మాత్రమేనని.. పండుగల్లో సెలవుల దృష్ట్యా అవసరమైతే ఈ షెడ్యూల్‌లో కొన్ని మార్పులు ఉండే అవకాశం ఉందని ఇంటర్ బోర్డు కార్యదర్శి డా.నారాయణ భరత్ గుప్తా తెలిపారు.

# బాంబు బెదరింపు మెయిల్స్ తిరుపతిలో బాంబ్ స్క్వాడ్ తనిఖీలు

తిరుపతి,అక్టోబర్3( సమయజ్యోతి):

ఇటీవల బాంబు బెదిరింపు ఘటనలతో తిరుపతి పోలీసులు అలర్ట్ అయ్యారు. తిరుపతిలో భక్తుల రద్దీ ఎక్కువగా ఉండే రైల్వేస్టేషన్, లింకు బస్టాండ్, విష్ణునివాసం తదితర ప్రాంతాల్లో ప్రత్యేక బాంబు స్క్వాడ్, డాగ్ స్క్వాడ్‌లతో పోలీసులు తనిఖీలు చేపట్టారు. శుక్రవారం ఉదయం దాదాపు రెండు గంటలపాటు తనిఖీలు చేశారు. తమిళనాడులోని పలు రాజకీయ, సినీ ప్రముఖులకు బాంబు బెదిరింపు మెయిల్స్‌లో తిరుపతి పేరు ఉన్నట్లు అక్కడి పోలీసులకు సమాచారం అందింది. ఈ నేపథ్యంలో ముందు జాగ్రత్తగా తిరుపతిలోని పోలీసు ప్రత్యేక విభాగం అప్రమత్తమైంది. తిరుమల, శ్రీకాళహస్తి, తిరుచానూరు ఆలయాల్లో విస్తృతంగా తనిఖీలు చేపట్టారు. అవాంఛనీయ సంఘటనలు తలెత్తకుండా రెండు బృందాలుగా ఏర్పడి తనిఖీలు చేపట్టారు. నగరంలోని ఆరు ప్రాంతాల్లో క్షుణ్ణంగా జల్లెడ పట్టే కార్యక్రమం చేపట్టారు. తనిఖీల్లో ఎలాంటి ప్రమాదకర వస్తువులు లభించలేదని పోలీస్ శాఖ అనధికారికంగా తెలిపింది.



# చరిత్ర సృష్టించిన జస్‌ప్రీత్ బుమ్రా..

టీమిండియా స్టార్ పేసర్ జస్‌ప్రీత్ బుమ్రా చరిత్ర సృష్టించాడు. టెస్ట్‌ల్లో సొంతగడ్డపై అత్యంత వేగంగా 50 వికెట్లు పడగొట్టిన భారత బౌలర్‌గా జవగళ్ శ్రీనాథ్‌తో సమంగా బుమ్రా నిలిచాడు. ఈ క్రమంలో అతను కపిల్ దేవ్ రికార్డ్‌ను అధిగమించాడు. వెస్టిండీస్‌తో అహ్మదాబాద్ వేదికగా గురువారం ప్రారంభమైన తొలి టెస్ట్‌లో మూడు వికెట్లు తీయడం ద్వారా బుమ్రా ఈ ఫీట్ సాధించాడు.బుమ్రా, జవగళ్ శ్రీనాథ్ 24 ఇన్నింగ్స్‌ల్లో సొంతగడ్డపై 50 టెస్ట్ వికెట్లు సాధించారు. కపిల్ దేవ్ 25 ఇన్నింగ్స్‌లో ఈ ఘనతను అందుకున్నాడు. అయితే సొంతగడ్డపై బుమ్రాదే అత్యుత్తమ యావరేజ్ కావడం విశేషం. 17 యావరేజ్‌తో బుమ్రా 50 వికెట్లు పడగొట్టగా.. రిచీ బెనాడ్ 18.38 యావరేజ్‌తో బుమ్రా తర్వాతి స్థానంలో ఉన్నాడు. డబ్ల్యూటీసీ చరిత్రలో 200 వికెట్ల మైలురాయి అందుకునేందుకు బుమ్రా దూసుకెళు తున్నాడు. ప్రస్తుతం అతను 173 వికెట్లతో నిలిచాడు. డబ్ల్యూటీసీ 2027 ఎడిషన్‌లో అతను ఈ మైలురాయి అందుకునే అవకాశం ఉంది.ఈ మ్యాచ్‌లో ముందుగా బ్యాటింగ్ చేసిన వెస్టిండీస్ తొలి ఇన్నింగ్స్‌లో 44.1 ఓవర్లలో 162 పరుగులకు కుప్పకూలింది. వెస్టిండీస్ బ్యాటర్లలో జస్టిన్ గ్రీవ్స్(48 బంతుల్లో 4 ఫోర్లతో 32), షైహోప్(36 బంతుల్లో 3 ఫోర్లతో 26), రోస్టన్ ఛేజ్(43 బంతుల్లో 4 ఫోర్లతో 24) టాప్ స్కోరర్లుగా నిలిచారు. భారత బౌలర్లలో మహమ్మద్ సిరాజ్ నాలుగు వికెట్లు తీయగా.. జస్‌ప్రీత్ బుమ్రా మూడు వికెట్లు పడగొట్టాడు. కుల్దీప్ యాదవ్ రెండు వికెట్లు తీయగా.. వాషింగ్టన్ సుందర్‌కు ఒక వికెట్ దక్కింది. భారత బౌలర్ల ధాటికి వెస్టిండీస్ ఇన్నింగ్స్ రెండు సెషన్లలోనే ముగిసింది.

# ధోనీ సరసన జడేజా..

## టెస్టుల్లో అరుదైన ఘనత



భారత సీనియర్ ఆల్ రౌండర్ రవీంద్ర జడేజా అరుదైన ఘనతను దక్కించుకున్నాడు. టెస్టుల్లో లెజెండరీ వికెట్ కీపర్ ఎంఎస్ ధోనీ సరసన నిలిచాడు. ఈ ఫార్మాట్లో అత్యధిక సిక్సర్లు బాదిన క్రికెటర్లలో ధోనీ సరసన జడ్డూ చేరాడు. తాజాగా అహ్మదాబాద్ లో జరుగుతున్న తొలి టెస్టులో 5 సిక్సర్లు కొట్టిన జడేజా.. తన కెరీర్లో 78వ సిక్సర్ ను సాధించాడు. దీంతో ధోనీ సరసన నిలిచాడు. ఈ మ్యాచ్ లో జడేజా అజేయ సెంచరీ (176 బంతుల్లో 104 బ్యాటింగ్, 6 ఫోర్లు, 5 సిక్సర్లు)తో సత్తా చాటిన సంగతి తెలిసిందే. ఇక క్లాసిక్ ఫార్మాట్ లో అత్యధిక సిక్సర్లు బాదిన రికార్డు వికెట్ కీపర్ బ్యాటర్ రిషభ్ పంత్, మాజీ విధ్వంసక ఓపెనర్ వీరేంద్ర సెహ్వాగ్ పేరిట ఉంది. వీరిద్దరూ కెరీర్లో 90 సిక్సర్లు బాది అగ్రస్థానంలో నిలిచారు. వారి తర్వాత స్థానంలో మాజీ కెప్టెన్ రోహిత్ శర్మ 88 సిక్సర్లతో నిలిచాడు. ఇక తొలి స్థానంలో ఉన్న పంత్ గురించి తెలిసిందే. పరిస్థితులు ఎలా ఉన్న తనదైన శైలిలో ధనాధన్ ఆటతీరుతో అభిమానులను అలరిస్తాడు.

# భారీ ఆధిక్యం దిశగా భారత్

## చరిత్ర సృష్టించిన సిరాజ్



భారత్– వెస్టిండీస్ మధ్య అహ్మదాబాద్ వేదికగా జరుగుతున్న తొలి టెస్టు మ్యాచ్‌లో టీమ్ఇండియా స్టార్ పేసర్ మహ్మద్ సిరాజ్ చరిత్ర సృష్టించాడు. టాస్ నెగ్గి బ్యాటింగ్ ఎంచుకున్న వెస్టిండీస్?ను భారత్ బౌలర్లు తీవ్రంగా దెబ్బకొట్టారు. తొలి ఇన్నింగ్స్‌లో సిరాజ్ నాలుగు కీలక వికెట్లు పడగొట్టి, కరేబియన్ జట్టు టాప్ ఆర్డర్‌ను చాప చుట్టేశాడు. ఈ అద్భుత ప్రదర్శనతో 2025 క్యాలెండర్ ఇయర్‌లో అత్యధిక వికెట్లు (31 వికెట్లు) సాధించిన బౌలర్‌గా రికార్డు సృష్టించాడు. ఆస్ట్రేలియా బౌలర్లు మిచెల్ స్టార్క్ (29 వికెట్లు), నాథన్ లైయన్ (24 వికెట్లు), వెస్టిండీస్ పేసర్ షామర్ జోసెఫ్ (22 వికెట్లు)లను వెనక్కి నెట్టాడు. సిరాజ్ ఇటీవలి కాలంలో టీమ్ఇండియా బౌలింగ్ దళంలో కీలక ఆటగాడిగా మారాడు. కొత్త బంతితో ప్రత్యర్థి బ్యాటర్లను ఆటలోకి రానీయకుండా చేయడంలోనూ, క్రీజులో స్థిరపడిన ఆటగాళ్లను తన వేగవంతమైన బౌ లింగ్‌తో పెవిలియన్‌కు చేర్చడంలోనూ సిద్ధహస్తుడిగా నిరూపించుకున్నాడు. జస్‌ప్రీత్ బుమ్రా గైర్హాజరీలో బౌలింగ్ బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహిస్తూ జట్టును ముందుండి నడిపిస్తున్నాడు. ఇటీవల ఇంగ్లాండ్‌తో జరిగిన టెస్టు సిరీస్‌లో సిరాజ్ అసాధారణ ప్రదర్శన కనబరిచాడు. ముఖ్యంగా ఐదో టెస్టులో జట్టు విజయం సాధించి సిరీస్‌ను సమం చేయడంలో అతడి పాత్ర కీలకంగా నిలిచింది. ప్రస్తుత వెస్టిండీస్ సిరీస్‌లోనూ తన నాలుగు వికెట్లతో మ్యాచ్‌ను భారత్ వశం చేసుకునేలా చేశాడు. రెడ్ బాల్ క్రికెట్‌లో సిరాజ్ తన స్థాయిని మరోసారి చాటాడు. టీమ్ ఇండియాకు టెస్టు ఫార్మాట్‌లో విజయాలను అందిస్తూ బౌలింగ్ రీతిలో కొత్త ఒరవడిని సృష్టిస్తున్నాడు.

# కేఎల్ రాహుల్ కొత్త మైలురాయి

భారత టెస్ట్ జట్టు ఓపెనర్ కేఎల్ రాహుల్ తన అద్భుతమైన ఫామ్‌ను మరోసారి నిరూపించుకున్నాడు. అహ్మదాబాద్‌లో వెస్టిండీస్‌తో జరుగుతున్న తొలి టెస్ట్ మ్యాచ్‌లో నిలకడగా రాణించడం ద్వారా 2025లో టెస్ట్ క్రికెట్లో ఓపెనర్‌గా అత్యధిక పరుగులు చేసిన ఆటగాడిగా కొత్త మైలురాయిని చేరుకున్నాడు. ఈ సెంచరీతో కేఎల్ రాహుల్ ఇంగ్లాండ్‌కు చెందిన బెన్ డకెట్‌ను వెనక్కి నెట్టేశాడు.ఈ ఏడాది టెస్ట్ క్రికెట్‌లో ఇంగ్లాండ్ ఓపెనర్ బెన్ డకెట్, కేఎల్ రాహుల్ ఇద్దరూ పరుగుల వేటలో పోటీ పడ్డారు. అహ్మదాబాద్ టెస్ట్ ప్రారంభానికి ముందు 2025లో అత్యధిక పరుగులు చేసిన ఓపెనర్ల జాబితాలో డకెట్ 602 రన్స్‌తో మొదటి స్థానంలో ఉన్నాడు. అయితే వెస్టిండీస్‌పై రాహుల్ అద్భుతమైన సెంచరీ సాధించడంతో, అతను మొత్తం 649 పరుగులతో అగ్రస్థానాన్ని కైవసం చేసుకున్నాడు. ఈ ప్రదర్శనతో రాహుల్ ఈ ఏడాది అత్యుత్తమ టెస్ట్ ఓపెనర్ అనిపించుకున్నాడు.అహ్మదాబాద్ టెస్ట్‌లో మొదటి రోజు ఆట ముగిసే సమయానికి కేఎల్ రాహుల్ 114 బంతుల్లో 6 బౌండరీలతో 53 పరుగులతో క్రీజులో ఉన్నాడు. రెండో రోజు ఆటలోనూ అద్భుతంగా ఆడిన కేఎల్ రాహుల్, తన కెరీర్‌లో 11వ టెస్ట్ సెంచరీని పూర్తి చేసుకున్నాడు.కేఎల్ రాహుల్, యువ ఓపెనర్ యశస్వి జైస్వాల్‌తో కలిసి తొలి వికెట్‌కు 68 పరుగులు జోడించి భారత్‌కు శుభారంభం అందించాడు. జైస్వాల్ 54 బంతుల్లో 7 బౌండరీలతో 36 పరుగులు చేసి ఔటయ్యాడు.ఓపెనర్‌గానే కాకుండా 2025 సంవత్సరంలో టెస్ట్ క్రికెట్‌లో అత్యధిక పరుగులు చేసిన ఆటగాళ్ల జాబితాలో కూడా కేఎల్ రాహుల్ మూడో స్థానంలో ఉన్నాడు. ఈ జాబితాలో భారత కెప్టెన్ శుభ్‌మన్ గిల్, జింబాబ్వేకు చెందిన సీన్ విలియమ్స్ మొదటి రెండు స్థానాల్లో ఉన్నారు. ఈ ఏడాది ఇంగ్లాండ్‌తో జరిగిన సిరీస్‌లో లీడ్స్‌లో 137 పరుగులు, లార్డ్స్‌లో సెంచరీ సాధించిన కేఎల్ రాహుల్.. తన అద్భుతమైన ఫామ్‌ను కొనసాగించడం భారత టెస్ట్ జట్టుకు గొప్ప బలంగా మారింది.అత్యధిక పరుగులు చేసిన ఓపెనర్లు (2025):

1.కేఎల్ రాహుల్-649(భారత్)2.బెన్ డకెట్ -602(ఇంగ్లాండ్)
3.యశస్వి జైస్వాల్ -479(భారత్)4.ఉస్మాన్ ఖవాజా-461 (ఆస్ట్రేలియా)5.జాక్ క్రాలీ -414 (ఇంగ్లాండ్)



## - రాహుల్, జురేల్, జడేజా సెంచరీలు- విండీస్ పై పూర్తి ఆధిపత్యం
## - 162 పరుగులకే విండీస్ ఆలౌట్
## - అహ్మదాబాద్‌లో వెస్టిండీస్‌తో తొలి టెస్ట్
## - వెస్టిండీస్‌పై నిప్పులు చెరిగిన సిరాజ్..

ఈ మ్యాచ్‌లో జడ్డు సెంచరీతో అదరగొట్టాడు. ఇటీవల ఇంగ్లాండ్ పర్యటనలో అదరగొట్టిన జడ్డూ, మరోసారి తన ఫామ్ చాటుకున్నాడు. ఈ క్రమంలోనే అరుదైన ఘనత సాధించాడు. టెస్ట్ క్రికెట్‌లో అత్యధిక సిక్స్?లు బాదిన భారత బ్యాటర్లలో రవీంద్ర జడేజా, ఎంఎస్ ధోనిని అధిగమించాడు. ఈ మ్యాచ్‌లో కరేబియన్ బౌలర్ జోమెల్ వారికన్ వేసిన బంతి, జడేజా అద్భుతమైన సిక్స్?గా మలిచాడు. ఇది అతని టెస్ట్ కెరీర్‌లో 78వ సిక్స్. ఎంఎస్ ధోని కూడా టెస్టుల్లో 78 సిక్సర్లే సాధించాడు. ఆ తర్వాత మరో సిక్స్?తో ధోనిని అధిగమించాడు. ప్రస్తుతం జడ్డూ 79 సిక్స్?లతో ఉన్నాడు. భారత బ్యాటర్లలో రోహిత్ శర్మ (88 సిక్స్?లు), రిషభ్ పంత్ (90 సిక్స్?లు), వీరేంద్ర సెహ్వాగ్ (91 సిక్స్?లు) మాత్రమే జడేజా కంటే ముందున్నారు. వీరిలో రిషభ్ పంత్ ఒక్కడే ఇప్పటికీ టెస్ట్ క్రికెట్ ఆడుతున్నాడు. అయితే, ఇంగ్లాండ్‌తో జరిగిన టెస్ట్ సిరీస్‌లో గాయపడిన పంత్, ప్రస్తుత వెస్టిండీస్ సిరీస్‌లో ఆడటం లేదు. ఓపెనర్ కేఎల్ రాహుల్ అద్భుత శతకంతో సత్తా చాటాడు. మొదటి రోజు అర్ధశతకం పూర్తి చేసిన అతడు, రెండో రోజు లంచ్‌కు కొద్ది నిమిషాల ముందు 100 పరుగుల మార్క్ అందుకున్నాడు. 190 బంతుల్లో అతడు సెంచరీ సాధించాడు. ఈ ఇన్నింగ్స్?లో 12 ఫోర్లు ఉన్నాయి. టెస్టుల్లో అతడికిది 11వ సెంచరీ. కానీ స్వదేశంలో మాత్రం రెండో శతకమే. ఇంతకుముందు 2016లో చెన్నైలో ఇంగ్లాండ్‌పై సెంచరీ నమోదు చేశాడు. అయితే, లంచ్ తర్వాత బ్యాటింగ్‌కు తిరిగి వచ్చిన రాహుల్, ఒక్క పరుగు కూడా జోడించకుండా పెవిలియన్‌కు చేరాడు. అంతకుముందు, కెప్టెన్ శుభ్‌మన్ గిల్ 100 బంతుల్లో 50 పరుగులు చేశాడు. అంతకుముందు టాస్ నెగ్గిన విండీస్ బ్యాటింగ్ ఎంచుకుంది. కానీ భారత బౌలర్లు తొలి ఇన్నింగ్స్?లో విండీస్ బ్యాటర్లకు చుక్కలు చూపించారు. దీంతో విండీస్ 162 పరుగులకు ఆలౌట్ అయ్యింది. జస్టిన్ గ్రేవ్స్ (32 పరుగులు) టాప్ స్కోరర్. ఓపెనర్లు జాన్ కాంమెల్ (8), చందర్?పాల్ (0) స్వల్ప స్కోర్లు చేశారు. అలిక్ (12), బ్రెండన్ కింగ్ (13), రోస్టన్ ఛేజ్ (24), షయ్ హోప్ (26), పెర్రి (11), వారికన్ (8), లేన్ (1) అందరూ స్వల్ప స్కోర్లకే వెనుదిరిగారు. టీమ్ఇండియా బౌలర్లలో మహ్మద్ సిరాజ్ 4, జస్ప్రీత్ బుమ్రా 3, కుల్దీప్ 2, వాషింగ్టన్ సుందర్ 1 వికెట్లు దక్కించుకున్నారు.మిండియా స్టార్ పేసర్, హైదరాబాద్ డీఎస్పీ మహమ్మద్ సిరాజ్ నిప్పులు చెరిగాడు. టాస్ ఓడి బౌలింగ్‌కు దిగిన టీమిండియాకు అదిరిపోయే ఆరంభాన్ని అందించాడు. తన తొలి స్పెల్‌లోనే సిరాజ్ 3 వికెట్లు పడగొట్టి విండీస్ పతనాన్ని శాసించాడు. దాంతో సిరాజ్‌పై నెటిజన్లు ప్రశంసల జల్లు కురుస్తోంది. సిరాజ్ ధాటికి వెస్టిండీస్ 90 పరుగులకే ఐదు వికెట్లు కోల్పోయింది. సిరాజ్‌తో పాటు కుల్దీప్ యాదవ్, బుమ్రా చెరో వికెట్ తీసారు. ఈ మ్యాచ్ ఆరంభంలోనే తేజ్‌నారాయణ్ చందర్‌పాల్(0)ను సిరాజ్ కీపర్ క్యాచ్‌గా పెవిలియన్ చేర్చాడు. ఆ వెంటనే జాన్ కాంప్‌బెల్(8)ను జస్‌ప్రీత్ బుమ్రా కీపర్ క్యాచ్‌గా ఔట్ చేశాడు. క్రీజులోకి వచ్చిన బ్రాండన్ కింగ్(13)ను స్టన్నింగ్ డెలివరీతో క్లీన్ బౌల్డ్ చేసిన సిరాజ్.. ఆచితూచి ఆడిన అలిక్ అథనాసియస్(12)ను క్యాచ్ ఔట్‌గా వెనక్కిపంపాడు. అతను కొట్టిన షాట్ నేరుగా స్లిప్‌లో ఉన్న కేఎల్ రాహుల్ చేతిలో పడింది.దాంతో వెస్టిండీస్ 42 పరుగులకే నాలుగు వికెట్లు కోల్పోయింది. ఈ పరిస్థితుల్లో క్రీజులోకి వచ్చిన కెప్టెన్ రోస్టన్ ఛేజ్(22 బ్యాంటింగ్) షైహోప్(26) ఆచితూచి ఆడుతూ జట్టును ఆదుకునే ప్రయత్నం చేశారు. 48 పరుగుల భాగస్వామ్యంతో క్రీజులో సెట్ అయిన ఈ జోడీని విడదీసేందుకు కెప్టెన్ శుభ్‌మన్ గిల్ స్పిన్నర్లను రంగంలోకి దించాడు. కెప్టెన్ నమ్మకాన్ని నిలబెట్టుకున్న కుల్దీప్ యాదవ్ తన రెండో ఓవర్‌లోనే షైహోప్‌ను క్లీన్ బౌల్డ్ చేశాడు.

# ప్రపంచ ఛాంపియన్‌షిప్‌లో మీరాబాయి



వెయిట్ లిఫ్టింగ్ ప్రపంచ ఛాంపియన్ షిప్?లో భారత స్టార్ మహిళా వెయిట్‌లిఫ్టర్ మీరాబాయి చాను అద్భుత ప్రదర్శన చేసింది. 48 కిలోల విభాగంలో మీరాబాయి చాను రజత పతకాన్ని గెలుచుకుంది. నార్వేలో జరిగిన ప్రతిష్టాత్మక పోటీలో మీరాబాయి చాను మొత్తం 199 కిలోల( స్నాచ్ లో 84 కిలోలు, క్లీన్ అండ్ జర్క్‌లో 115 కిలోలు) బరువు ఎత్తింది. గతంలో రెండు సార్లు మెడల్ సాధించిన ఈ టోర్నమెంట్?లో ఇప్పుడు మరోసారి అదరగొట్టింది. మహిళల 48 కిలోల విభాగంలో స్వర్ణాన్ని కోల్పోయి, వెండి పథకంతో ముగించింది. మీరాబాయి స్నాచ్‌లో తన మొదటి ప్రయత్నంలోనే 84 కిలోలు ఎత్తింది. అయితే, తర్వాత రెండు లిఫ్ట్‌లను 87 కిలోల వద్ద తడబడింది. దీంతో ఆమె పోడియం ఫినిషింగ్ కోసం పోటీలో ఉండటానికి క్లీన్ అండ్ జెర్క్‌లో 110 కిలోలకు పైగా వెయిట్? చేయాల్సి వచ్చింది. అయితే మీరాబాయి క్లీన్ అండ్ జెర్క్‌లో రాణించింది. 109 కిలోల బరువుతో ప్రారంభించి, 112 కిలోలకు మెరుగుపడి, 115 కిలోల లిఫ్ట్‌తో ముగించింది. ఈవిధంగా ఆమె మొత్తం 199 కిలోల బరువు ఎత్తి సిల్వర్? సొంతం చేసుకుంది. ఉత్తర కొరియాకు చెందిన రి సాంగ్-గమ్ 213 కిలోలు ఎత్తి వరల్డ్ రికార్డు సాధించి, గోల్డ్? మెడల్?ను గెలుచుకుంది. మీరాబాయికి 2022 ఎడిషన్‌లో విజయం తర్వాత ప్రస్తుతమిది రెండో సిల్వర్? మెడల్?. మొత్తం మీద, ఈ ఈవెంట్‌లో ఇది మీరాబాయ్?కు మూడో పతకం. 2017లో జరిగిన ఈ ఈవెంట్‌లో ఆమె బంగారు పతకాన్ని సాధించింది. ఓవరాల్‌గా ఆమెకు ఇది 14వ ఇంటర్?నెష్నల్? మెడల్?. తన ఖాతాలో 2021 టోక్యో ఒలింపిక్స్‌లో రజతం, కామన్వెల్త్ క్రీడల్లో మూడు పతకాలు (2018, 2022లో స్వర్ణం, 2014లో రజతం), కామన్వెల్త్ ఛాంపియన్‌షిప్‌లలో అయిదు (నాలుగు స్వర్ణాలు, ఒక రజతం), 2020 ఆసియా ఛాంపియన్‌షిప్‌లో ఒక బ్రాంజ్? పతకం, 2016 దక్షిణాసియా క్రీడల్లో ఒక గోల్డ్? ఉన్నాయి. లవ్‌ప్రీత్ సింగ్, గతంలో కామన్వెల్త్ గేమ్స్‌లో కాంస్య పతకం సాధించిన భారత వెయిట్‌లిఫ్టర్‌గా, ఇప్పుడు పురుషుల బృందానికి నాయకత్వం వహిస్తున్నాడు.



## కాంతారా చాప్టర్-1 కు అభినందనల వెల్లువ

### వీర లెవల్లో ఉందంటూ నటుల కితాబు

దసరా పండుగ కానుకగా అక్టోబర్ 2న గ్రాండ్‌గా విడుదలైన 'కాంతార: ఛాప్టర్ 1' సినిమా ప్రేక్షకుల నుంచి విశేష స్పందన పొందుతోంది. రిషబ్ శెట్టి దర్శకత్వంలో తెరకెక్కిన ఈ పాన్-ఇండియా ఫాంటసీ డ్రామా మరోసారి దేశవ్యాప్తంగా సంచలనం రేపుతోంది. భక్తి, మానవత్వం, పరబ్రహ్మ భావనల మేళవింపుతో వచ్చిన ఈ చిత్రాన్ని ప్రేక్షకులు మాత్రమే కాకుండా ఇండస్ట్రీ ప్రముఖులు కూడా అభినందిస్తున్నారు. ఇప్పటికే జూనియర్ ఎన్టీఆర్ సినిమా బాగుందని ట్వీట్ చేయగా, తాజాగా పాన్ ఇండియా స్టార్ ప్రభాస్ మరియు అర్జున్ రెడ్డి ఫేమ్ దర్శకుడు సందీప్ రెడ్డి వంగా కూడా సినిమా గురించి ఆసక్తికర కామెంట్స్ చేశారు. దర్శకుడు సందీప్ రెడ్డి వంగా మాట్ఆడుతూ...కాంతార: ఛాప్టర్ 1 నిజమైన మాస్టర్ పీస్ అంటూ సినిమా గురించి ప్రశంసలు కురిపించారు. ఇండియన్ సినిమా చరిత్రలో ఇలాంటి సినిమాను ఎప్పుడూ చూడలేదు. ఇది ఓ సినిమాటిక్ ప్రభంజనం. భక్తి ఎలా ఉంటుందో రిషబ్ అద్భుతంగా చూపించారు. ఇది ఆయన ఒంటి చేత్తో తీసిన సినిమానే కాదు, ఒక ఆధ్యాత్మిక ప్రయాణం. సినిమా బీజీఎమ్‌ను ఎంతగా పొగడినా తక్కువే, అంటూ పేర్కొన్నారు. అలాగే, ప్రభాస్ తన సోషల్ మీడియా ద్వారా స్పందిస్తూ.. కాంతార: ఛాప్టర్ 1 అనేది ఒక బ్రిలియంట్ మూవీ. ఇది ఈ ఏడాది బి÷-గగెస్ట్ హిట్ గా నిలుస్తుంది. ఈ సినిమాకు అసలు శక్తి అంటే రిషబ్ శెట్టి నటన. ఆయన నటనలో కనిపించిన భక్తి, శక్తి అసాధారణం. అలాగే నిర్మాత విజయ్ కిరగండూర్ అద్భుతంగా సినిమాను రూపొందించారు. చిత్ర యూనిట్‌కు నా హృదయ పూర్వక అభినందనలు అని పేర్కొన్నారు. సినిమా విడుదలైన రోజే జూనియర్ ఎన్టీఆర్ సినిమా చూసి స్పందించగా, ఇది కచ్చితంగా మరో స్థాయిలో తీసుకెళ్లే సినిమా. రిషబ్ శెట్టికి ప్రత్యేక శుభాకాంక్షలు, అంటూ ట్వీట్ చేశారు. కేవలం ప్రేక్షకుల నుంచి మాత్రమే కాకుండా విమర్శకుల నుంచి కూడా ఈ చిత్రానికి హై రేటింగ్స్ వస్తున్నాయి. డివోషనల్ స్జబెక్ట్‌ను కళాత్మకంగా, కమర్షియల్ గా చూపించి ప్రేక్షకులను ఆలోచింపజేసేలా తీర్చిదిద్దిన విధానం ప్రశంసలందుకుంటోంది. రిషబ్ శెట్టి మరోసారి తన కంటెంట్ ఎంపికలో ఎంత విలక్షణంగా ఆలోచిస్తాడో నిరూపించుకున్నాడు. 'కాంతార: ఛాప్టర్ 1'కు మద్దతుగా స్టార్ హీరోలు స్పందించడం, సినిమా విజయం పట్ల గర్వంగా ఫీలవడం ఫ్యాన్స్‌కు సైతం ఆనందాన్ని కలిగిస్తోంది.




## మన శంకర వరప్రసాద్‌గారులో ఉదిత్ నారాయణ్ పాట

కమర్షియల్ హంగులతో చక్కటి వినోదాన్ని పంచే దర్శకుడు అనిల్ రావిపూడి కొత్త పంథాను అనుసరిస్తున్నారు. ఈ ఏడాది సంక్రాంతి కానుకగా వెంకటేశ్‌తో 'సంక్రాంతికి వస్తున్నాం' తీసి బాక్సాఫీస్ వద్ద భారీ విజయాన్ని అందుకున్నారు. ఇక ఇందులోని 'గోదారి గట్టుమీద' పాటను రమణ గోగులతో పాడించి నేటి యువతరాన్ని సైతం కట్టిపడేశారు. ఇప్పుడు అలనాటి క్రేజీ గాయకుడు ఉదిత్ నారాయణ్‌తో మేజిక్ క్రియేట్ చేసేందుకు అనిల్ రావిపూడి సిద్ధమయ్యారు. ఆయన దర్శకత్వంలో చిరంజీవి కథానాయకుడిగా నటిస్తున్న చిత్రం 'మన శంకర వరప్రసాద్‌గారు'. నయనతార కథానాయిక. వచ్చే ఏడాది సంక్రాంతి కానుకగా సినిమాను తీసుకొచ్చేందుకు ముస్తాబు చేస్తున్నారు. ఈ క్రమంలో ప్రచార కార్యక్రమాలను ముమ్మరం చేశారు. ఇందులో భాగంగా ఉదిత్ నారాయణ్‌తో ఓ పాట పాడిస్తున్నారు. 90 దశకం చివరిలో 2000 సంవత్సరం తర్వాత వచ్చిన తెలుగు సహా ఇతర భాషల్లో ఉదిత్ నారాయణ్ స్వరం శ్రోతలను ఓ ఊపు ఊపేసింది. మరీ ముఖ్యంగా తెలుగులో ఆయన పాటలకు విశేషమైన క్రేజ్ ఉండేది. చిరంజీవి నటించిన చిత్రాల్లోని 'రామ్మా చిలకమ్మా..', 'కైకలూరి కన్నె పిల్ల..', 'వానా వానా వెన్నెల వానా...' వంటి పాటలను ఉదిత్ నారాయణ్ ఆలపించారు. అవి ఎవర్‌గ్రీన్‌గా నిలిచాయి. ఇప్పుడు మరోసారి 'మీసాల పిల్ల' అంటూ తన స్వరంతో అలరించబోతున్నారు. దీనికి చిరంజీవి డ్యాన్స్, గ్రేస్ తోడైతే వెండితెరపైన నిజంగా సంక్రాంతి సందడే.

# నానితో సినిమాకు క్లాప్ కొట్టిన ఓజి దర్శకుడు సుజీత్

ఓజి విడుదల కాక ముందే నాని హీరోగా దర్శకుడు సుజీత్ ఓ సినిమా ప్రకటించిన సంగతి తెలిసిందే. ఏడాది దాటినా మరో అప్‌డేట్ లేకపోవడంతో ఈ చిత్రం క్యాన్సిల్ అయిందనే రూమర్స్ ఇటీవల వచ్చాయి. 'ఓజీ' ప్రమోషన్స్‌లోనే సుజీత్ వాటికి చెక్ పెట్టారు. నానితో సినిమా ఉంటుందని స్పష్టం చేశారు. తాజాగా ఈ చిత్రాన్ని ప్రారంభించారు. దసరాని పురస్కరించుకుని ఈ సినిమాని లాంఛనంగా హైదరాబాద్‌లో ప్రారంభించారు. ఈ వేడుకకు హీరో వెంకటేశ్ ముఖ్య అతిథిగా హాజరై, ముహూర్తపు సన్నివేశానికి క్లాప్ కొట్టారు. చిత్ర బృందానికి శుభాకాంక్షలు తెలిపారు. సంబంధిత ఫొటోలు నెట్టింట వైరల్‌గా మారాయి. సినిమాలోనూ కలిసి నటిస్తున్నారా? అంటూ అభిమానులు కామెంట్లు పెడుతున్నారు. రెగ్యులర్ షూటింగ్ త్వరలోనే ప్రారంభం కానుందని, మరిన్ని అప్‌డేట్స్ రాబోతున్నాయని నిర్మాత వెంకట్ బోయనపల్లి తెలిపారు. సుజీత్ 'ఓజీ' విజయాన్ని ఆస్వాదిస్తుండగా.. నాని 'ది ప్యారడైజ్'లో నటిస్తున్నారు. 'దసరా' ఫేమ్ శ్రీకాంత్ ఓదెల తెరకెక్కిస్తున్న చిత్రమిది. నానితో చేయబోయే సినిమా 'ఓజీ' యూనివర్స్‌లోకి వస్తుందా? అన్న ప్రశ్నకు ఇటీవల సుజీత్ సమాధానమిచ్చారు. తన తొలి సినిమా 'రన్ రాజా రన్' స్టైల్‌లో ఉంటుందని, 'ఓజీ' యూనివర్స్‌లో భాగం కాదని తెలిపారు. ఈ చిత్రానికి 'బ్లడీ రోమియో' అనే టైటిల్ ప్రచారంలో ఉంది. కానీ, అధికారిక ప్రకటన లేదు.



# రాజుగారి గది 4: శ్రీచక్రం

## ఆరేళ్ల గ్యాప్ తరవాత ఓంకార్ ప్రకటన




తెలుగు ప్రేక్షకుల్ని భయపెట్టిన హారర్ ఫ్రాంచైజీ 'రాజు గారి గది' ఇప్పుడు మళ్లీ మెరుపులు మెరిపించేందుకు సిద్ధమవుతోంది. యాంకర్–డైరెక్టర్ ఓంకార్ ఆరేళ్ల గ్యాప్ తర్వాత ఈ సిరీస్‌లో నాలుగో భాగాన్ని ప్రకటించారు. పీపుల్ మీడియా ఫ్యాక్టరీ బ్యానర్‌పై తెరకెక్కుతున్న ఈ చిత్రం పేరు రాజు గారి గది 4: శ్రీచక్రం. తాజాగా విడుదలైన ఫస్ట్ పోస్టర్ సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. ఇందులో కాళికా మాత ఉగ్రరూపంలో దర్శనం ఇవ్వగా, ఎర్రచీరలో ఉన్న ఓ మహిళ దేవీ వైపు నడుచుకుంటూ వెళ్తుండటం హారర్, మిస్టికల్ ఎలిమెంట్స్‌ను సూచిస్తోంది. పోస్టర్‌కు జత చేసిన ట్యాగ్ లైన్ ఆసక్తి రేపుతుంది. ఈసారి కథా నేపథ్యం పూర్తిగా భక్తి, భయాల మిశ్రమంగా ఉండనుంది. 'కాళికాపురం' అనే ఊరిలోని కాళికా మాత ఆలయం, శ్రీచక్రం మహిమ, భక్తి వల్ల మేల్కొనే అమ్మవారు వంటి అంశాలతో హారర్, థ్రిల్లర్, కామెడీని మిక్స్ చేస్తూ ఓ కొత్త డైవైన్ యూనివర్స్‌ను నిర్మించనున్నట్లు చిత్రబృందం వెల్లడించింది. రాజు గారి గది హిట్ కావడంతో దానికి సీక్వెల్స్ చేస్తూ వస్తున్నారు ఓంకార్. ఇప్పటికే రాజు గారి గది2, రాజు గారి గది3 చిత్రాలు హిట్ కావడంతో రాజు గారి గది4 కు శ్రీకారం చుట్టారు. 'రాజు గారి గది 4: శ్రీచక్రం' సినిమా 2026 దసరా సందర్భంగా గ్రాండ్‌గా విడుదల కానుంది. ప్రారంభ దశలో ఉన్న స్క్రిప్ట్ వర్క్ పూర్తయిన తర్వాత షూటింగ్ మొదలవుతుంది. 2015లో వచ్చిన 'రాజు గారి గది' బాక్సాఫీస్ దగ్గర విజయాన్ని నమోదు చేయగా, 2017లో 'రాజు గారి గది 2', 2019లో 'రాజు గారి గది 3' ప్రేక్షకులను అంతగా అలరించకలేకపోయాయి. అందుకే ఓంకార్ గ్యాప్ తీసుకుని మళ్లీ ఈ కొత్త కాన్సెప్ట్‌తో తిరిగి వస్తున్నారు. భక్తి, హారర్, థ్రిల్లర్ మేళవింపుతో 'శ్రీచక్రం' కథ ప్రేక్షకులకు కొత్త అనుభూతిని అందించనుంది. క్యాస్టింగ్‌కి సంబంధించిన వివరాలు తెలియాల్సి ఉంది.




# జాతీయ అవార్డులపై విమర్శలు సరికాదు : రాణిముఖర్జీ

ఇటీవల మొదటిసారి నేషనల్ అవార్డును అందుకున్న బాలీవుడ్ నటి రాణీ ముఖర్జీ ,జాతీయ అవార్డుతో తన బాధ్యత మరింత పెరిగిందని చెప్పారు. ఆ పురస్కారాలు ప్రకటించినప్పుడు కొన్నిసార్లు వచ్చే విమర్శలపై స్పందించారు. అవార్డులు ప్రకటించినప్పుడు ఎవరైనా ప్రశ్నిస్తే వాటి విలువ తగ్గిపోతుందన్నారు. 'దేశవ్యాప్తంగా అభిమానులను సొంతం చేసుకోవడం ఆనందంగా ఉంది. మనకు నేషనల్ అవార్డు ప్రకటించినప్పుడు ప్రేక్షకులు కూడా మనం దానికి అర్హులమని భావిస్తే వచ్చే సంతోషం మాటల్లో చెప్పలేం. అలా కాకుండా 'ఆమె నటనకు పురస్కారం వచ్చిందా?. ఆమె కంటే గొప్పవారు చాలామంది ఉన్నారు' అని కామెంట్స్ వినిపించాయంటే దాన్ని అందుకున్నప్పటికీ విలువ ఉండదు. తాజాగా నాకు జాతీయ పురస్కారం వచ్చినప్పుడు అందరూ అంగీకరించారు. వారి అంగీకారం నాకు అవార్డు కంటే గొప్పగా అనిపించింది. నటీనటులకు చిన్న పురస్కారం కూడా ముఖ్యమే. ప్రేక్షకులను అలరించడమే మా ప్రధాన ఉద్దేశం. మాకు గౌరవం, గుర్తింపు వచ్చాయంటే అభిమానులు కూడా ఆనందిస్తారు' అని రాణి చెప్పారు. 2023లో విడుదలైన 'మిసెస్ ఛటర్జీ వర్సెస్ నార్వే' సినిమాకు గాను రాణీ ముఖర్జీ ఉత్తమ నటిగా జాతీయ అవార్డును సొంతం చేసుకున్నారు.

# ఆనాడు ఒక్క షో ప్రదర్శన కోసం కష్టపడ్డా

## కాంతారా విజయం మర్చిపోలేనిదన్న రిషబ్ శెట్టి



రిషబ్ శెట్టి స్వీయ దర్శకత్వంలో తెరకెక్కిన 'కాంతార చాప్టర్ 1' తాజాగా ప్రేక్షకుల ముందుకువచ్చి భారీ విజయాన్ని సొంతం చేసుకుంది. దీంతో ఆయన గత రోజులను గుర్తుచేసుకుంటూ ఓ పోస్ట్ పెట్టారు. 2016లో తన సినిమాను ఒక్క షో ప్రదర్శించడం కోసం ఎంతో కష్టపడినట్లు చెప్పారు. ఈరోజు తనకు దక్కుతున్న గౌరవం చూస్తుంటే ఎంతో ఆనందంగా ఉందన్నారు. 2016లో నా చిత్రం సాయంకాలం షో ప్రదర్శించడం కోసం పడిన కష్టం నుంచి 2025లో 5000కు పైగా థియేటర్స్‌లో హౌస్‌ఫుల్ బోర్డులు కనిపించే వరకూ ఇదీ.. దర్శకుడిగా నా జర్నీ. ఈ సినీ ప్రయాణం దేవుడి దయతో పాటు మీ ప్రేమాభిమానాలను ఎప్పటికీ మర్చిపోలేను. మీ ఆదరణతోనే ఈ విజయం సాధ్యమైంది. నన్ను ఆదరించిన ప్రతిఒక్కరికీ పేరుపేరునా కృతజ్ఞతల అంటూ తన పోస్ట్‌లో రాసుకొచ్చారు. 2012లో 'తుగ్లక్' అనే సినిమాతో తన కెరీర్ ప్రారంభించిన రిషబ్ శెట్టి నటుడిగా, దర్శకుడిగా గుర్తింపు తెచ్చుకున్నారు. మొదటిసారి 2016లో 'రిక్కీ' అనే సినిమాకు దర్శకత్వం వహించారు. క్రైమ్ థ్రిల్లర్ నేపథ్యంలో రూపొందిన ఆ సినిమా పాజిటివ్ టాక్ సొంతం చేసుకుంది. 2022లో ఆయన స్వీయ దర్శకత్వంలో తెరకెక్కిన 'కాంతార'కు జాతీయస్థాయిలో గొప్ప గుర్తింపు వచ్చింది. చిన్న సినిమాగా విడుదలై బ్లాక్‌బస్టర్ విజయాన్ని సొంతం చేసుకొని అవార్డులు తెచ్చింది. ఇప్పుడు దీని ప్రీక్వెల్‌గా వచ్చిన 'కాంతార చాప్టర్ 1'కూడా అదేస్థాయిలో ఆదరణ సొంతం చేసుకుంటోన్న విషయం తెలిసిందే.

EDITED, PRINTED AND PUBLISHED BY FAISAL KHAN PRINTED AT UJALA PRESS, LIG, 211 APHB COLONY ADILABAD, TELANGANA.
PUBLISHED FROM H.NO.4-4-120/C/3, SANJAY NAGAR COLONY, ADILABAD, TELANGANA STATE. EDITOR : FAISAL KHAN, RNI : APTEL/2013/53323, CELL : 94400 62685